www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 231 శనివారం, మే 16, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

# హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులు



- రైల్వేశాఖతో కలసి ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- అధికారులను ఆదేశించిన సిఎస్ రామకృష్ణారావు

**హైదరాబాద్,మే 15 :** హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదిత హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర రైల్వే శాఖ భాగస్వామ్యంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు రిపోర్టులు, ప్రాజెక్టు అమలులో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో కలసి పనిచేయాలని, ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, కనెక్టివిటీ, మిగతా2లో...

# 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని...

ఆ తరవాత జాతీయ రాజకీయాల్లోకి వెళతా
రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తా..
రాహుల్ తరవాత సెకండ్ ప్లేస్ ఆక్రమిస్తా
సిఎం రేవంత్ రెడ్డి మరోమారు సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్,మే 15 :** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2034లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి జాతీయ రాజకీయా ల్లోకి వెళ్తానని చెప్పారు. అప్పటి వరకు తానే సీఎంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ తర్వాతి స్థానంలో ఉంటానని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఆయనకు ప్రధాని కావాలనే కోరిక లేదని.. ఆ పదవికి పోటీ పడాలని తాను ఒప్పించానని రేవంత్ చెప్పారు. గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మిగతా2లో...

## తెలంగాణలో ఇప్పట్లో ఎన్నికలు లేవు

- సర్ ప్రక్రియను హడావిడిగా అమలు చేయడం తగదు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషన్‌కు పిసిసి వినతి



**హైదరాబాద్,మే 15 :**ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సర్ అంశంపై పీసీసీ బృదం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ వల్లే మిగతా2లో...

## నీట్ పరీక్ష కొత్త షెడ్యూల్ విడుదల

- జూన్ 21న ఎగ్జామ్ నిర్వహణకు తేదీ ఖరారు




# పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల

- లీటర్‌పై కనీసంగా రూ.3 పెంపు
- ధరలు పెంచుతూ ఆయిల్ కంపెనీల నిర్ణయం




**న్యూఢిల్లీ,మే 15 :** ఊహించి నట్లుగానే.. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. అయినప్పటికీ.. ప్రభుత్వరంగ చమరు కంపెనీలు దాదాపు 11 వారాల పాటు ఇంధన ధరలను స్థిరంగా ఉంచాయి. అయితే, అవి తీవ్ర ఆర్థికఒత్తిళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. లీటరుకు రూ.3 పెంచి వాహనదారులపై కొంత భారాన్ని మోపాయి. 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు మారలేదు. అయితే, లోక్‌సభ ఎన్నికలకు ముందు 2024 మార్చిలో లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాయి. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన ధరలు పెరుగుతాయంటూ ఇటీవల పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే, సరిపడా మిగతా2లో...

## జహీరాబాద్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

- రూ.650 కోట్ల పెట్టుబడితో భారీ ఫుడ్ ఇండస్ట్రీ
- దామోదరతో కలసి ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు
- త్రీ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం అని వెల్లడి



**సంగారెడ్డి,మే 15 :** తెలంగాణ రైజింగ్‌తో త్రీ ట్రిలియన్ ఎకానమీ కోసం తాము పనిచేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. జహీరాబాద్ లాంటి ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం తాము కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ మండలం తొగర్‌పల్లిలో మంత్రులు శ్రీధర్ బాబు, మిగతా2లో...

## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు

- కేశరావు ఛైర్మన్‌గా కమిటీ ఏర్పాటు




**హైదరాబాద్,మే 15 :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి, వారి సేవలు,త్యాగాలను గౌరవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన మిగతా2లో...




## ఆత్మహత్యలు కావు.. వ్యవస్థలు చేసిన హత్యలు

- నీట్ విద్యార్థుల ఆత్మహత్యలపై రాహుల్ ఆందోళన
- ప్రభుత్వం ఎప్పుడు కళ్లు తెరుస్తుందని ప్రశ్న

## పెట్రో ధరల పెంపు అనివార్యం

- కాంగ్రెస్, బిఆర్ఎస్‌లవి పనిపాటలేని విమర్శలు
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్,మే 15 :** పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకొంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పనీపాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆ యా పార్టీల నేతల మిగతా2లో...

## భూగర్భజలాల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

- తాగు నీటి భద్రత పై ప్రత్యేక దృష్టి
- నీటి లభ్యత పెరగడంతో పాటు వినియోగం పెరుగుతుంది
- ఫ్లోరైడ్,నైట్రేట్ వంటి సమస్యాత్మక అంశాలపై ప్రత్యేక దృష్టి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




## కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

- బ్రిడ్జిపై నుంచి అదుపుతప్పి కిందపడ్డ ట్రాక్టర్
- ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం



హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి)

మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర అంశాలపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ నుండి ముంబై, చెన్నై, బెంగళూరు ప్రధాన నగరాలకు అనుసంధానించే హై స్పీడ్ రైల్ ప్రాజెక్టు వలన తెలంగాణ రైజింగ్ 2047 ఎకనామిక్ గ్రోత్ కారిడార్ గా అభివృద్ధి చెందే అవకాశం ఉందని సి.ఎస్ పేర్కొన్నారు. దేశంలో వేగవంతమైన రవాణా వ్యవస్థకు హై స్పీడ్ రైలు ప్రాజెక్టు నిలుస్తుందని, ప్రజల భవిష్యత్ అవసరాలకు, పారిశ్రామిక, ఐటి, పర్యాటక రంగాలలో అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ ఉపకరిస్తుందని సి.ఎస్ తెలిపారు. హైదరాబాద్, పూనే,ముంబై హై స్పీడ్ రైల్ మార్గానికి సంబంధించి డి.పి.ఆర్ సిద్ధం అయ్యిందని రైల్వే అధికారులు తెలిపారు. సుమారు 671 కి. మీటర్ల మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, తెలంగాణ రాష్ట్రంలో 93 కి. మీటర్ల మేరకు భూ సేకరణ అవసరం ఉంటుందని, అదేవిధంగా హైదరాబాద్ - బెంగళూరు కారిడార్, హైదరాబాద్-చెన్నై కారిడార్ లో సుమారు 123 కి.మీటర్ల నిడివిలో భూసేకరణ అవసరమని, కోకాపేట, శంషాబాద్ ప్రాంతాలలో రైల్వే డిపోలకు కొంత భూసేకరణ చేయాలని అధికారులు పేర్కొన్నారు. వీటికి సంబంధించి రోడ్లు, భవనాల శాఖ, హెచ్.యం.డి.ఎ, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు కేంద్ర రైల్వే ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేసుకొని హై స్పీడ్ రైలు ప్రాజెక్ట్ కు సహకరించాలని సి.ఎస్ అన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, ఊఓఆం మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కేంద్ర రైల్వే శాఖ అధికారులు, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు పాల్గొన్నారు.

# భూగర్భజలాల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

**హైదరాబాద్,మే 15 :**భూగర్భ జలాల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.ప్రజలకు తాగునీటి భద్రత కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.ఫ్లోరైడ్, నైట్రేట్ వంటి సమస్యాత్మక అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు.శుక్రవారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,గ్రౌండ్ వాటర్ డైరెక్టర్ లక్ష్మణ్ ,డిప్యూటి డైరెక్టర్ పి.జ్యోతికుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో భూగర్భ జలాల సంరక్షణ అన్నది అత్యంత ప్రాధాన్యతంశమని ఈ విషయంలో రైతులకు ప్రత్యేక అవగాహన కలిగించెందుకు అధికారులు చొరవ చూపాలని ఆయన సూచించారు. అదే సమయంలో నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా చూడడంతో పాటు వృధా గా పోయే నీటిని నియత్రించేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు.తెలంగాణా రాష్ట్రంలో భూగర్భ జలాల లభ్యత పెరుగుతున్నప్పటికీ అదే స్థాయిలో నీటి వినియోగం పెరుగుతున్నందున నీటి వృధాను అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. 2024 తో పోల్చిచూసినపుడు 2025 లో జలాల వినియోగం 45.93 శాతం నుండి 46.86 శాతానికి పెరిగిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.భూగర్భ జలాల సంరక్షణ అనేది ఒక ఉద్యమంలా ప్రజల్లోకి టిదుకెళ్లాలని నీటి సంరక్షణలో ప్రతీ ఒక్కరిని భాగస్వామ్యం చేయాల్సిన ఆవశ్యకతను ఆయన అధికారులకు వివరించారు. అధికంగా భూగర్భ జలాల వినియోగం అవుతున్న ప్రాంతాలలో భవిష్యత్ అవసరాల దృష్ట్యా నియంత్రణ మీద దృష్టి సారించేయాలన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టుకునెందుకు గాను ఇంకుడుగుంటల నిర్మాణాన్ని ఇబ్బడిముబ్బడిగా ప్రోత్సాహించాలని ఆయన చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భజలాల పరిమాణాలని నిరంతరం గుర్తించేందుకు వీలుగా 1,771 ఫిజోమిటర్లను వినియోగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.పైగా భూగర్భ జలాల నియంత్రణతో గ్రౌండ్ వాటర్ డిపా÷-టం÷-మెంట్ కు ఆదాయం లభిస్తుందన్నారు. పరిశ్రమలు, మైనింగ్ యూనిట్లు,అపార్టుమెంట్లు,ప్యాక్డ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్లకు భూగర్భ జలాల వినియోగానికి అనుమతులు ఇవ్వడం ద్వారా వినియోగ చార్జీల రూపంలో 25.80 కోట్లు గడించినట్లు ఆయన తెలిపారు. జాతీయ హైడ్రాలోజి ప్రాజెక్టు అమలులో ఉత్తమ పనితీరు కనబర్చిన శాఖల్లో తెలంగాణా గ్రౌండ్ వాటర్ విభాగం ఒకటిగా గుర్తింపు పొందడం అభినందనీయమని, ఇకపై భూగర్భ జలాల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కృత్రిమ మేధస్సు తో మరిన్ని సత్ఫాలితాలూ సాధించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# జహీరాబాద్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

(మొదటి పేజీ తరువాయి)

దామోదర రాజనర్సింహలు పర్యటించారు. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో భారీ ఫుడ్ ఇండస్ట్రీకి మంత్రులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. 1500 మంది స్థానిక మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కేజేఎస్ యూనిట్‌కి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. తొగర్‌పల్లిలో ఇంత పెద్ద పరిశ్రమ రావడానికి నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కారణమని చెప్పుకొచ్చారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ పరిశ్రమ పూర్తిగా కాలుష్య రహితమని అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో అంతర్జాతీయ కారిడార్‌లో ఓ ఇండస్ట్రీ నెలకొల్పుతామని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అంతర్జాతీయ సదస్సులో పాల్గొని పరిశ్రమల కోసం పెట్టుబడులను ఆకర్శిస్తున్నామని చెప్పుకొచ్చారు. స్థానిక యువతకు ఉపాధే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో 2047 నాటికి దేశ జాతీయ ఉత్పత్తిలో 10 శాతం ఉత్పత్తి పెంచేలా తాము పనిచేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే మొదట పరిశ్రమలు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఏర్పడ్డాయని మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. మంత్రి శ్రీధర్‌బాబుకి పరిశ్రమల శాఖ తగినవిధంగా సెట్ అవుతుందని తెలిపారు. మెదక్ ప్రజలు చాలా అదృష్టవంతులని చెప్పుకొచ్చారు. వెనుకబడ్డ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తే ఆ ప్రాంత ప్రజలకు ఉపాధి లభిస్తుందని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం సహకరించారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని అన్నారు. సంగారెడ్డి జిల్లాకు కేంద్ర సంస్థలను తీసుకువచ్చామని జగ్గారెడ్డి తెలిపారు.

# 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని...

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తుచేశారు.. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని...కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్ట చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గి పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యూమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు.. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఆత్మహత్యలు కావు.. వ్యవస్థలు చేసిన హత్యలు

**న్యూఢిల్లీ,మే 15 :** నీట్ పరీక్షల రద్దుతో ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థులవి వ్యవస్థలు చేసిన హత్యలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నీట్ పరీక్షలకు సంబంధించిన ఆత్మహత్య ఘటనలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల కుంభకోణాలు, అవినీతి కారణంగా విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోందని ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా రాహుల్ గాంధీ పోస్టు పెట్టారు. లఖింపూర్ ఖేరీకి చెందిన 22 ఏళ్ల హృతిక్ మిశ్రా చివరిసారిగా 'నేను ఇకపై పోటీ పరీక్షలు రాయను' అని చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ భావోద్వేగానికి గురయ్యారు. మూడోసారి నీట్ పరీక్ష రాస్తున్న హృతిక్, పరీక్ష రద్దు కావడంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. అలాగే ఉనీజీలో కూడా నీట్ పరీక్ష రాసిన మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తుచేశారు. ఈ ఘటనలు కేవలం ఆత్మహత్యలు కావని, అవినీతి వ్యవస్థ చేసిన హత్యలని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పరీక్ష చేతిలో విద్యార్థులు ఓడిపోలేదు.. అవినీతి వ్యవస్థ చేతిలో బలయ్యారని అన్నారు. 2015 నుంచి 2026 వరకు దేశవ్యాప్తంగా 148 పరీక్షల కుంభకోణాలు వెలుగుచూశాయని ఆయన ఆరోపించారు. వాటిలో 87 పరీక్షలు రద్దయ్యాయని, దాదాపు 9 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభావితమైందని పేర్కొన్నారు. ఈ 148 కుంభకోణాల్లో కేవలం ఒక్కరికే శిక్ష పడిందని, సీబీఐ 17 కేసులు, ఈడీ 11 కేసులు నమోదు చేసినప్పటికీ ఎవరూ బాధ్యత వహించలేదని విమర్శించారు. ప్రత్యేకంగా నీట్, ఏఐపీఎంటీ మరియు ఇతర వైద్య ప్రవేశ పరీక్షల్లోనే 15 కుంభకోణాలు జరిగాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారాల్లో బాధ్యులైన అధికారులు, మంత్రులు రాజీనామా చేయకపోవడం అత్యంత సిగ్గుచేటని అన్నారు. కొందరిని తొలగించినట్లు చూపించి, తిరిగి ఉన్నత పదవుల్లో నియమిస్తున్నారని ఆరోపించారు. మోసానికి సహకరించే వారికి బహుమతులు లభిస్తుండగా, పరీక్షలు రాసే పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు అంటూ కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని మోడీని ఉద్దేశించి, మీలో జవాబుదారీతనం మేల్కొనడానికి ఇంకా ఎంతమంది హృతిక్‌లు కావాలని ప్రశ్నించారు. విద్యార్థుల బాధ తన బాధ అని, వారి భవిష్యత్తును దోచుకున్న వారు తప్పకుండా సమాధానం చెప్పాల్సి ఉంటుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

# పెట్రో ధరల పెంపు అనివార్యం

(మొదటి పేజీ తరువాయి)

మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. దేశవ్యాప్తంగా పెట్రోలు ధరలు పెరిగాయన్నారు. ఈ పెంచిన ధరలు శుక్రవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చాయని చెప్పారు.

అమెరికా, ఇరాన్ యుద్ధ ప్రభావంతోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు అనివార్య మైందన్నారు.

అంతేకానీ ఇది ప్రజల మీద భారం వేసేందుకు కాదన్నారు. క్రూడాయిల్ దిగుమతికి భారీగా ఖర్చు అవుతుందని వివరించారు. అందుకోసమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన వివరించారు.

అంతర్జాతీయ స్థాయిలో అమెరికా, జర్మనీ, జపాన్ తదితర దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు.

పెట్రోల్, డీజిల్ లీటర్ ధరలు రూ.3కు పైగా పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. వీటి ధరలు పెంచడం వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పైవిధంగా స్పందించారు.

# నీట్ పరీక్ష కొత్త షెడ్యూల్ విడుదల

**న్యూఢిల్లీ,మే 15 :** ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో రద్దయిన నీట్ యూజీ 2026 పరీక్షను మళ్లీ నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది. జూన్ 21న, ఆదివారం ఈ పరీక్ష జరగనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు ఎన్‌టీఏ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రీఎగ్జామ్‌కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను ఎన్‌టీఏ కోరింది. హాల్‌టికెట్, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడించనుంది. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3వ తేదీన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-యూజీని (నీట్-యూజీ) నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో ఈ పరీక్ష జరిగింది. అయితే, ఈ పరీక్ష ప్రశ్నపత్రాలు కొన్నిచోట్ల లీకయ్యాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నాటి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 23 లక్షల మంది మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా.. రీఎగ్జామినేషన్‌కు మరోసారి దరఖాస్తు చేసుకోనక్కర్లేదని, ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఇదిలాఉండగా.. నీట్ పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. రాజస్థాన్‌లోని సికార్‌లో ఈ లీకేజీ వ్యవహారం బయటపడింది. సుమారు 410 ప్రశ్నలతో ఒక గెస్ పేపర్ పరీక్షకు ముందే విద్యార్థులకు అందగా.. అందులోని 120 కెమిస్ట్రీ ప్రశ్నలు పరీక్షలో వచ్చాయనే ఆరోపణలొచ్చాయి. ప్రశ్నల క్రమంతో పాటు ఆప్షన్లు కూడా ఒకే వరుసలో ఉండటంతో లీక్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రశ్నపత్నం లీక్ అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అక్కడి నుంచి రాజస్థాన్, హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చేరినట్లు దర్యాప్తులో తేలింది. ఈ పేపర్ కోసం విద్యార్థుల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం.

# పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల

(మొదటి పేజీ తరువాయి)

నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం వాటిని ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ క్రమంలో ధరలు పెంచడం గమనార్హం.ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందనే వార్తలు దేశంలోని వాహనదారులను ఆందోళనకు గురిచేశాయి. దీంతో పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో కొన్ని బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. సీఎన్‌జీ వాహనదారులకు కూడా గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. కిలో సీఎన్‌జీని రూ.2 చొప్పున పెంచాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ3.29, డీజిల్‌పై రూ.3.14, తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ఆయిల్ కంపెనీలు పెంచాయి. పెట్రోల్ ధరలు: ఢిల్లీలో రూ.97.77, కోల్‌కతాలో 108.74, ముంబయిలో 106.68 , చెన్నైలో 103.67 (?2.83)గా ఉండనున్నాయి. ఇక డీజిల్ ధరలు: ఢిల్లీలో 90.67, కోల్‌కతాలో 95.13, ముంబయి 93.14, చెన్నైలో 95.25గా ఉండనున్నాయి. దాంతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో వీటి ధరలు మారాయి. పశ్చిమా సియాలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలో ముడి చమురు ధరలు విపరీతం గా పెరిగాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాలని ఆయిలు కంపెనీలు నిర్ణయించాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే.ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14పై పెంచాయి. తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచాయి.

# కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

**బెంగళూరు,మే 15 :** కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మునీరాబాద్ సమీపంలో బ్రిడ్జిపై వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి కిందపడటంతో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడగా, వారిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న వారు ఓ కార్యక్రమం ముగించుకుని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బ్రిడ్జిపై మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ట్రాక్టర్ కిందకు పడిపోయిందని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే లారీ ఢీకొట్టడంతో వంతెన పైనుంచి ట్రాక్టర్ కిందపడిందని కూడా అంటున్నారుజ ఈ ప్రమాదంలో ఏడాది చిన్నారి సహా ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. మరో 10 మందికి గాయాలయ్యాయి. కొప్పల తాలూకా మునీరాబాద్ వద్ద వంతెనపై ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగే సమయానికి ట్రాక్టర్‌లో 16 మంది ఉన్నారు. మునీరాబాద్ సమీపంలోని హులిగమ్మ దర్శనానికి ట్రాక్టర్‌లో భక్తులు వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. మృతులను సండూరు, కూడ్లిగి ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. ఘటనాస్థలాన్ని కొప్పల, విజయనగర ఎస్పీలు పరిశీలించారు.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన 10 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదానికి గల అసలు కారణాలపై విచారణ చేపట్టారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# తెలంగాణలో ఇప్పట్లో ఎన్నికలు లేవు

(మొదటి పేజీ తరువాయి)

బెంగాల్‌లో రాజకీయ సమీకరణలు మారాయన్నారు. గెలవాల్సిన పార్టీలు ఓడిపోయాయి. తెలంగాణలో వచ్చే రెండేళ్లలో ఎలాంటి ఎన్నికలు లేవు. ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదు. ఆ పక్రియను ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని ఇసిని కోరామని వెల్లడించారు.జనగణన పక్రియ ఇప్పటికే జరుగుతోంది. జనగణనతో పాటే ఎస్ఐఆర్ నిర్వహిస్తే సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుంది. ఎస్ఐఆర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకునే గడువు 3 నెలలకు పెంచాలన్నారు. ప్రత్యక్షంగా 3-4 సార్లు బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఈసీని కలిసిన వారిలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

శాఖ శుక్రవారం జీఓ ఆర్టీ నం.679 జారీ చేసింది. ఉద్యమంలో కొందరు ప్రాణత్యాగం చేయగా, మరికొందరు శారీరక వైకల్యానికి గురయ్యారు. పలువురిపై కేసులు నమోదై జైలు జీవితం గడిపిన నేపథ్యంలో, వారి సేవలను అధికారికంగా గుర్తించాలనే చాలాకాలంగా ఉన్న డిమాండ్‌పై ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కమిటీకి ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె. కేశవరావు చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ విప్ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి నియమితులయ్యారు.సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ సెక్రటరీ ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారు.తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ముందుగా స్పష్టమైన ప్రమాణాలను రూపొందించడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. ఆ ప్రమాణాల ఆధారంగా ఉద్యమకారుల జాబితాను సిద్ధం చేస్తుంది. అనంతరం వారికి ఎలాంటి గుర్తింపు, గౌరవం, సౌకర్యాలు కల్పించాలనే అంశాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది. కమిటీ అవసరమైతే అధికారులను పిలిపించుకోవచ్చు. సమాచారం సేకరించవచ్చు. సమావేశాలు నిర్వహించవచ్చు. అవసరమైన ఇతర వ్యక్తులు, అధికారులను కూడా సంప్రదించవచ్చు. కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి వీలైనంత త్వరగా సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులు కమిటీకి అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.


## అమృత్‌నగర్ తాండలో వెలుగులు నింపిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో నెలరోజుల సమస్యకు పరిష్కారం

**-- బండి రమేష్ చొరవతో స్ట్రీట్ లైట్లు పునరుద్ధరణ**



**బాలానగర్ మే16 ( పీపుల్స్ న్యూస్):**మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ కూకట్ పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్ అమృత్‌నగర్ తాండ బస్తీలో గత నెల రోజులుగా నాలుగు విద్యుత్ స్తంభాలకు స్ట్రీట్ లైట్లు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో చీకట్లు కమ్ముకోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మోతీలాల్ నాయక్, మోహన్ నాయక్, రవి నాయక్, నానావత్ మోహన్ నాయక్‌లు కలిసి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ గౌరవనీయులు బండి రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై వెంటనే స్పందించిన బండి రమేష్ మాజీ కౌన్సిలర్ లక్ష్మయ్యకు సమాచారం అందజేయగా, అమృత్‌నగర్ తాండ పక్కనే ఉన్న దీన్‌దయాల్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ హరిప్రసాద్ కూడా వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడారు. దీంతో అధికారులు స్పందించి శుక్రవారం స్ట్రీట్ లైట్ సిబ్బంది కాజా పాషా, నరేష్ నాయక్‌లు ఘటనాస్థలానికి చేరుకొని దెబ్బతిన్న లైట్లను మరమ్మతు చేసి బస్తి మొత్తం స్ట్రీట్ లైట్ల సరఫరాను పునరుద్ధరించారు. నెల రోజులుగా చీకట్లో ఉన్న ప్రాంతం మళ్లీ వెలుగులతో కళకళలాడడంతో అమృత్‌నగర్ తాండ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి సహకరించిన బండి రమేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, జీహెచ్‌ఎంసీ డీఈ స్వప్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారం చూపించడం అభినందనీయమని పేర్కొన్నారు.

## అక్రమ బోర్లపై చర్యలు ఎక్కడ..? రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం





**కుత్బుల్లాపూర్: మే 15 (పీపుల్స్ న్యూస్):**అనుమతులు లేకుండా అక్రమంగా బోర్లు తవ్వుతున్న ఘటనలు పెరుగుతున్నప్పటికీ, సంబంధిత అధికారులు మాత్రం చూస్తూ ఊరుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాల్టా చట్టానికి విరుద్ధంగా వందల అడుగుల లోతులో బోర్లు తవ్వడం వల్ల భూగర్భ జలాలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ అక్రమ బోర్ల నియంత్రణలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమవు తున్నారనే ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. కుత్బుల్లాపూర్ రెవెన్యూ మండల కార్యాలయం పరిధిలోని రోడా మేస్త్రి నగర్/బి ప్రాంతంలో నడిరోడ్డుపైనే అనుమతులు లేకుండా బోర్ తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఎమ్మార్వో కార్యాలయానికి పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలకు భూగర్భ జలాలు ఎంతో కీలకమని, అక్రమంగా బోర్లు వేయడం వల్ల భవిష్యత్తులో తీవ్ర నీటి సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. చట్ట విరుద్ధంగా జరుగుతున్న తవ్వకాలపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ఎదలపై పెట్రోల్ బాంబు.. కేంద్రంపై సీపీఎం ఆగ్రహ జ్వాలలు


**-- లీటరుకు రూ.3 పెంపుతో సామాన్యుడిపై పెనుభారం...**
**-- కార్పొరేట్లకు మేలు.. ప్రజలపై భారం మోపుతున్న బీజేపీ ప్రభుత్వం....**
**-- బాలానగర్ -- భరత్‌నగర్‌లో సీపీఎం భారీ నిరసనలు....**




**బాలానగర్ మే16 ( పీపుల్స్ న్యూస్):**కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను అమాంతం పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలతో ఆటలాడు తోందని సీపీఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పెరిగిన ఇంధన ధరలకు నిరసనగా శుక్రవారం బాలానగర్‌లోని సీపీఎం కార్యాలయం వద్ద, భరత్‌నగర్ ప్రాంతంలో పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ మేరకు కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇసలే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న వేళ, ప్రస్తుతం పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ. 3 పెంపు చేయడం వల్ల రవాణా ఖర్చులు మరింత పెరిగి సామాన్య ప్రజల జీవనం భారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు ధరల పెంపు ఉండదని చెప్పిన ప్రధాని, ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే దేశ పరిస్థితుల పేరుతో ఇంధన ధరలను పెంచడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. యుద్ధాలు, అంతర్జాతీయ పరిస్థితులు అంటూ సాకులు చెబుతూ చమురు కంపెనీలు, కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చడమే కేంద్ర ప్రభుత్వ అసలు లక్ష్యమని ఆరోపించారు."దేశంలో ఏ సంక్షోభం వచ్చినా ప్రజల జేబులనే ఖాళీ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పన్నులు తగ్గించి ఉంటే సామాన్యులకు కొంత ఉపశమనం లభించేది. కానీ ప్రజల రక్తాన్ని పీలుస్తూ కార్పొరేట్ పెట్టుబడి దారులకు ఊడిగం చేస్తోంది" అంటూ ఆయన మండిపడ్డారు.పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించు కోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని సీపీఎం నాయకులు హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు అంజి, కమల్, లక్ష్మి, రాజు, శ్రీను తదితరులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# కళ్యాణలక్ష్మి వేదికను రాజకీయాల కోసం వాడుకోవడం దురదృష్టకరం ....

**-- తెలంగాణ కాంగ్రెస్ నేతల విమర్శ**



**బాలానగర్ మే16 ( పీపుల్స్ న్యూస్):**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కూకట్‌పల్లి నియోజకవర్గంలో బాలానగర్ డివిజన్ పరిధిలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం దురదృష్టకరం మరియు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ప్రజల పన్నుల డబ్బుతో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఒకే పార్టీ సొత్తుగా, ఒకే నాయకుడి గొప్పతనంగా చూపించే ప్రయత్నం ప్రజలను తప్పుదారి పట్టించడమేనని విమర్శించారు. ప్రజలకు సేవ చేయాల్సిన వేదికను రాజకీయ ప్రచార సభగా మార్చి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఉచిత బస్సు ప్రయాణం, గృహ విద్యుత్ రాయితీలు, రైతులకు హామీల అమలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. "తులం బంగారం" వంటి హామీలపై ఎద్దేవా చేసే ముందు గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎందుకు వేలాది ఉద్యోగాలు ఖాళీగా ఉంచారో చెప్పాలని ప్రశ్నించారు. టీఎస్ పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీలు ఎందుకు జరిగాయో, రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల్లోకి ఎందుకు నెట్టారో, భూకబ్జాలు మరియు అవినీతి ఆరోపణలతో రాష్ట్ర ప్రతిష్ట ఎందుకు దెబ్బతిన్నదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేయలేదా? పదేళ్ల పాలనలో అర్హులైన పేదలకు రేషన్ కార్డులు ఎందుకు ఇవ్వలేదో కూడా ప్రజలకు వివరణ ఇవ్వాలని అన్నారు. రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు మంచివేనని అంగీకరిస్తూనే, ఆ పథకాల పేరుతో రాష్ట్రాన్ని అప్పుల బారిన పడేసిన వాస్తవాన్ని ప్రజలు మరచిపోలేదన్నారు. నిరుద్యోగ యువత కన్నీళ్లు, ఉద్యోగార్థుల ఆవేదన, పేద ప్రజల ఇబ్బందులు ఇప్పటికీ ప్రజల మదిలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలు ఇప్పుడు మాటలు కాదు, పని చూస్తున్నారని...అహంకార పాలన కాదు,ప్రజా పాలన కోరుకుంటున్నారని, అబద్ధపు ప్రచారం కాదు, పారదర్శక అభివృద్ధిని ఆశిస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన, ఇచ్చిన హామీల అమలే కాంగ్రెస్ పార్టీని మరింత బలపరుస్తాయని, ప్రజల ఆశీర్వాదంతో కూకట్‌పల్లిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు.

# నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్రంపై కాంగ్రెస్ తీవ్ర ఒత్తిడి....

**-- "నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి"**
**-- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ ....**



**బాలానగర్ మే16 ( పీపుల్స్ న్యూస్):**దేశ యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న మోదీ ప్రభుత్వం : కాంగ్రెస్ అధికార ప్రతినిధి మదన్ మోహన్ ఆగ్రహం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్, యూజీసీ-నెట్ సహా పలు జాతీయ స్థాయి పరీక్షల పేపర్ లీక్ ఘటనలపై కేంద్ర బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో మండిపడింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆధ్వర్యంలో దేశ పరీక్షల వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ ఆరోపించారు. పలు భారీ అవకతవకలు, పేపర్ లీక్‌లు జరుగుతున్నప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇప్పటివరకు నైతిక బాధ్యత తీసుకోకపోవడం దారుణమన్నారు. గతంలో ఒక రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి రాజీనామా చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, అదే ప్రజాస్వామ్య విలువలు ఇప్పుడు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు."93 పేపర్లు లీక్ అయినా కేంద్రం స్పందించలేదు" దేశంలో ఇప్పటివరకు 93 పరీక్షల పేపర్లు లీక్ అయినప్పటికీ ఒక్కసారి కూడా కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించలేదని మదన్ మోహన్ ఆరోపించారు. లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదువుకుంటే, మోదీ ప్రభుత్వం మాత్రం వారి భవిష్యత్తును పేపర్ లీక్ మాఫియాల చేతుల్లో పెట్టిందన్నారు. యూజీసీ-నెట్ 2024 పరీక్షను "పరీక్ష సమగ్రత దెబ్బతిన్నది" అంటూ కేంద్రం స్వయంగా రద్దు చేయడం, నీట్ పరీక్షలపై దేశవ్యాప్తంగా వచ్చిన ఆరోపణలు, సీబీఐ దర్యాప్తులు ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమని పేర్కొన్నారు."కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహిస్తామనడం వైఫల్యానికే అంగీకారం" వరుస వివాదాల నేపథ్యంలో నీట్ పరీక్షలను ఇకపై కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహిస్తామని కేంద్రం ప్రకటించడం, ఇప్పటి వరకు అమలు చేసిన విధానం పూర్తిగా విఫలమైందనే విషయాన్ని ప్రభుత్వమే అంగీకరించినట్టేనని కాంగ్రెస్ అభిప్రాయపడింది.

-- కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ పలు ప్రశ్నలు సంధించింది:ఎన్‌టీఏలో జరుగుతున్న అవినీతి, నిర్లక్ష్యంపై వచ్చిన హెచ్చరికలను ఎందుకు పట్టించుకోలేదు? విద్యార్థులు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? వరుస వైఫల్యాలపై ఇప్పటి వరకు ఒక్క ఉన్నతాధికారి కూడా నైతిక బాధ్యత ఎందుకు తీసుకోలేదు? దేశవ్యాప్తంగా జరుగుతున్న పేపర్ లీక్‌ల వెనుక ఉన్న మాఫియాలకు రాజకీయ అండ ఎవరిది? "డిజిటల్ ఇండియా" పేరుతో గొప్పలు... పరీక్షలు నిర్వహించలేని ప్రభుత్వం"న్యూ ఇండియా", "డిజిటల్ ఇండియా" అంటూ గొప్పలు చెప్పుకునే మోదీ ప్రభుత్వం, దేశ యువతకు న్యాయమైన పరీక్షలు కూడా నిర్వహించలేకపోవడం అత్యంత దురదృష్టకరమని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ డిమాండ్లు దేశ యువతకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎన్టీఏ వ్యవస్థపై సమగ్ర సంస్కరణలు చేపట్టాలి పేపర్ లీక్ మాఫియాలపై కఠిన చర్యలు తీసుకోవాలి పారదర్శక పరీక్షల నిర్వహణకు హామీ ఇవ్వాలి స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది.దేశ యువత, విద్యార్థులు, తల్లిదండ్రుల తరఫున కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, విద్యార్థులకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ ఉద్యమం ఆగదని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ స్పష్టం చేశారు

# మెదక్‌లో దారుణం భారమౌతుందని భావించి బిడ్డను 3 లక్షలకు అమ్మిన కన్నవాళ్లు

**మెదక్ జిల్లా:** మెదక్ జిల్లాలో కన్నప్రేమ కర్కశంగా మారింది. కడుపున పుట్టిన పసికందును కాసుల కోసం అమ్మేసుకున్నారు. ఆరు రోజుల ఆడబిడ్డను మూడు లక్షల రూపాయలకు విక్రయించిన దారుణ ఘటన కలకలం రేపుతోంది. డెలివరీ అయిన కొన్నిరోజుల తర్వాత పాప కనిపిం చకపోవడంతో ఐసీడీఎస్ (ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ అథారిటీ) అధికారులకు అనుమానం వచ్చింది. విషయం పోలీసులకు చేరడంతో గుట్టు బయటపడింది. పాపను క్షేమంగా రక్షించిన పోలీసులు తొమ్మిది మంది నిందితులను అరెస్ట్ చేశారు. శిశువిక్రయాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భారంగా భావించి అమ్మకం : కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి తండాకు చెందిన దేవీసింగ్, శిరీష దంపతులకు ఇప్పటికే ముగ్గురు సంతానం ఉన్నారు. ఈ ఏడాది మార్చి 27న మెదక్ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో శిరీషకు నాలుగో సంతానంగా ఆడపిల్ల జన్మించింది. అయితే, నలుగురు పిల్లల పోషణ భారమని భావించిన ఈ దంపతులు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన శారద అనే మహిళా మధ్యవర్తిని ఆశ్రయిరారు.“శిరీష–దేవీసింగ్ వీళ్లు పోతిరెడ్డిపల్లి తండాకు చెందిన వ్యక్తులు.



ఇటీవల ఓ పాపకు శిరీష జన్మనిచ్చింది. ఆ తర్వాత ఆ పిల్ల కనిపించకపోవటంతో అనుమానం వచ్చి మాకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు వచ్చిన వెంటనే మెదక్ ఎస్పీకి తెలియాజేశాం. వెంటనే ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసి ఆదేశాలు ఇవ్వటం జరిగింది. ఆదేశాల మేరకు మెదక్ జోన్ ఇన్‌స్పెక్టర్ వారి సిబ్బందితో చర్యలు చేపట్టారు” – ప్రసన్న కుమార్, మెదక్ డీఎస్పీరూ. 40 వేలు తల్లిదండ్రుల వాటా : సిద్దిపేట జిల్లా అల్లినగర్‌కు చెందిన సంతానం లేని దంపతులైన బొమ్మ కళమ్మ, లింగయ్యలకు పసికందును మూడు లక్షల రూపాయలకు విక్రయించేలా బేరం కుదుర్చుకున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీన మెదక్ ఎంసీహెచ్ ఆసుపత్రి సమీపంలోనే ప్రధాన మధ్యవర్తి శారద డబ్బులు తీసుకుని పాపను కొనుగోలు చేసిన దంపతులకు అప్పగించింది. అయితే ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. కొనుగోలు దారుల నుంచి తీసుకున్న మూడు లక్షల రూపాయలలో ప్రధాన మధ్యవర్తి శారద సింహభాగం తనే నొక్కేసింది. కన్న తల్లిదండ్రులకు కేవలం 40 వేల రూపాయలు ఇవ్వగా, మిగతా ఐదుగురు సబ్–మీడియేటర్లకు తలా పదివేల చొప్పున పంచిపెట్టింది.“ఈ శిరీష మార్చి 27న మాతాశిశు కేంద్రంలో జన్మనిచ్చింది. అయితే వాళ్లకు తెలిసిన కొందరు వ్యక్తుల సహాయంతో శారద అనే లేడీ దగ్గరకు వచ్చింది. ఈమెనే దీంట్లో కీ రోల్ ప్లే చేసింది. గజ్వేల్ దగ్గర అలీ నగర్‌లో కూర్మ కమ్యూనిటీకి చెందినవాళ్లకి అమ్మారు. ఏప్రిల్?1, 2026న ఆసుపత్రి సమీపంలోనే పాపను అమ్మి డబ్బు తీసుకుంది. అందులో తల్లిదండ్రులకు రూ.40 వేలు ఇవ్వటం జరిగింది” – ప్రసన్న కుమార్, మెదక్ డీఎస్పీమొత్తం 10 మందిపై కేసు నమోదు : ఐసీడీఎస్ కొల్చారం మండల సూపర్‌వైజర్ అనసూయకు వచ్చిన అనుమానంతో విషయం పోలీసులకు చేరింది. రంగంలోకి దిగిన టౌన్ సీఐ మహేష్ కేసు నమోదు చేసి విచారణ జరిపారు. కొనుగోలు చేసిన వారి నుంచి పాపను క్షేమంగా స్వాధీనం చేసుకున్నారు. ఈ శిశు విక్రయ వ్యవహారంలో మొత్తం పది మందిపై కేసు నమోదు చేసినట్లు మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు. తొమ్మిది మంది నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పాప తండ్రి దేవీసింగ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని అతని కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. చిన్నారిని ఐసీడీఎస్ అధికారులకు అప్పగించిన పోలీసులు శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు.”దీంట్లో 10 మందిని ముద్దాయిలుగా గుర్తించాం. వీరిలో 9 మందిని అదుపులోకి తీసుకున్నాం. ఎవరైతే పిల్లల్ని దత్తత చేసుకోవాలనుకున్నారో వాళ్లను కూడా తీసుకుని వచ్చాం. ఇటువంటి పనులకు దయచేసి ఎవర్ని ప్రోత్సహించవద్దు. పిల్లలు లేని వారు ఉంటే లీగల్ అడాప్షన్?కే వెళ్లాలి”

# హైదరాబాద్‌కు హైస్పీడ్ రైలు కనెక్టివిటీపై తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ ఫోకస్



**హైదరాబాద్, మే 15 :** హైస్పీడ్ రైలు కారిడార పై తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు (శుక్రవారం) సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముంబై, చెన్నై, బెంగళూరుకు హైస్పీడ్ రైలు కనెక్టివిటీ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్ర రైల్వేశాఖతో కలిసి డీపీఆర్‌లు సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రైజింగ్ 2047కు హైస్పీడ్ రైల్ ప్రాజెక్టులు కీలకమని చెప్పుకొచ్చారు. పారిశ్రామిక, ఐటీ, పర్యాటక రంగాలకు ఈ ప్రాజెక్ట్‌తో ప్రయోజనకరమని తెలిపారు. హైదరాబాద్ పుణె -- ముంబై కారిడార్‌లకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేయాలని మార్గ నిర్దేశం చేశారు. 671 కిలోమీటర్ల మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. తెలంగాణలో 93 కిలోమీటర్లమేర భూసేకరణ అవసరమని తెలిపారు. హైదరాబాద్ -- బెంగళూరు, చెన్నై కారిడార్లకు 123 కిలోమీటర్ల భూసేకరణ కావాలని చెప్పారు. ఎవీణూా, +వీ=, రైల్వేశాఖల సమన్వయంతో ఈ ప్రాజెక్టు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. భూసేకరణ, కనెక్టివిటీ, మౌలిక వసతులపై చర్యలకు సీఎస్ రామకృష్ణారావు ఆదేశాలు జారీ చేశారు.

# పంట కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**మాల్, మే 15 :** పంటల కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం కొండమల్లెపల్లిలో నిర్వహించిన మహా ధర్నా కార్య క్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్య మంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు వెంటనే కొను గోలు కేంద్రాలను సందర్శించి రైతుల కష్టాలను తెలుసుకోవాలన్నారు. రైతులు 40 రోజుల నుండి ఎదురు చూస్తున్నారని, తమ పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల వద్దే పడిగాపులు కాస్తున్నట్లు తెలిపారు. కాగా రైతులను కాంగ్రెస్ సర్కార్ ముప్పుతిప్పలు పెడుతుందని దుయ్యబట్టారు. గన్నీ బ్యాగులి య్యరు, కాంటా పెట్టరు, లారీలు రావన్నారు. నెల దాటినా కొనుగోళ్ల ఊసే లేదన్నారు.– ఎన్నికల ముందు అలవికాని హామీలిచ్చి, నమ్మించి గద్దెనెక్కినంక రైతులను నట్టేట ముంచిన రాబందు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. పండించిన పంటను నెలల తరబడి కొనుగోలు చేయక, కల్లాల్లో ఉన్న ధాన్యం కళ్లప్పగించి చూస్తూ కన్నీళ్లు పెట్టిస్తుందన్నారు.



పంట వేసినంక యూరియా ఇవ్వకుండా రైతులను లైన్లలో నిలబెట్టి చెప్పులరిగేలా తిప్పిన దద్దమ్మ సీఎం రేవంత్ అన్నారు. రైతన్న బతుకును ఆగం చేసిన రేవంత్ ప్రభుత్వాన్ని అదే రైతన్న కాంగ్రెస్ పార్టీని బొందపెట్టడం ఖాయం అన్నారు. ప్రభుత్వం రైతుల నుండి తరుగు పేరిట 2 కేజిల వడ్లు కట్ చేస్తున్నారు, మిల్లర్లు 3 కేజీలు అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంతో ఇప్పటికే అన్నదాతలకు అపార నష్టం జరిగిందన్నారు. పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు కానీ ఒక్క గింజ కూడా ప్రభుత్వం కొనడం లేదన్నారు. ఇప్పటికైనా ఎలాంటి ఆంక్షలు లేకుండా సకాలంలో వడ్లు కొనుగోలు పూర్తి చేయాలని

# పంపిణీకి ముహూర్తం కుదిరింది – సమస్యల గురించి కూడా పట్టించుకోండి

నల్గొండ జిల్లాలో రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారులకు గృహయోగంపై ఆశలు చిగురిస్తున్నాయి. నిర్మాణాలు పూర్తయినా ఇప్పటివరకు పంపిణీ కాకుండా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అందజేయేందుకు అధికారులు ఏర్పాట్లు వేగవంతం చేస్తున్నారు. అయితే ఏళ్ల తరబడి వాడుకలో లేకపోవడంతో గృహ సముదాయాల్లో అనేక సమస్యలు బయటపడుతున్నాయి.గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణం : నిరుపేదల ఆత్మగౌరవ ప్రతీకగా భావించిన రెండు పడక గదుల ఇళ్ల పంపిణీకి నల్గొండ జిల్లాలో మార్గం సుగమమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో ఈ ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా మౌలిక వసతుల లోపం, గుత్తేదారుల నిర్లక్ష్యం కారణంగా పనులు సంవత్సరాలుగా నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి పేదలకు ఇళ్లు అందజేస్తామని ప్రకటించింది.ఇళ్ల పంపిణీకి సిద్ధమౌతున్న అధికారులు : ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను ఎల్–1, ఎల్–2, ఎల్–3



జాబితాలుగా విభజించారు. ప్రస్తుతం ఇంటి స్థలాలు ఉన్న ఎల్–1 లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేస్తుండగా స్థలాలు, ఇళ్లు లేని ఎల్–2 దరఖాస్తుదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జూన్ 2న జిల్లావ్యాప్తంగా ఇళ్ల పంపిణీకి అధికారులు సిద్ధమవుతున్నారు. అస్తవ్యస్తంగా వసతులు : ఈటీవీ–ఈనాడు బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించగా అనేక సమస్యలు వెలుగుచూశాయి. ఏళ్లుగా పంపిణీ కాకపోవడంతో గృహ సముదాయాలు ఆకతాయిల అడ్డాగా మారాయి. కిటికీల అద్దాలు, విద్యుత్ బోర్డులు, నీటి పైపులు ధ్వంసమయ్యాయి. మద్యం సీసాలు ప్రాంగణాల్లో కనిపిస్తున్నాయి. కొన్ని ఇళ్లలో గబ్బిలాలు చేరగా మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారాయి. నీటి ట్యాంకులు దెబ్బతిన్నాయి. ఇంకా రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, మురుగునీటి పైపులు వంటి మౌలిక వసతుల పనులు పూర్తికాలేదు. అమృ త్–2 పథకం కింద తాగునీటి కనెక్షన్లు కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది.“నల్లగొండ పట్టణ ంలో 552 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను 2017లో అనేక పోరాటాలు చేశాం.్తామని ప్రభుత్వం తెలియజేసింది. దానికి ధన్యవాదాలు. కానీ అక్కడ కనీస వసతుల విషయంలో మాత్రం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టుగా నత్తనడకగా సాగుతుంది. ఆ ఇళ్లలో కావాల్సిన కరెంట్?, నీళ్లు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పిస్తే తుమ్మల వీరారెడ్డి, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శిమొత్తం 8,155 డబుల్? బెడ్?రూం పరిధిలో మొత్తం 8,155 డబుల్ బెడ్‌రూం ఇళు నిర్మించారు. ఇందులో జూన్ 2న మొదటి విడతగా 1,574 ఇళ్లను పంపిణీ చేయనున్నారు. నల్గొండ మండలంలో 552, మిర్యాలగూడలో 560, తిప్పర్తిలో 100, బ్రాహ్మణవెల్లంలో 150, ఔరావాణిలో 80, చిట్యాలలో 132 ఇళ్లు అందజేయనున్నారు. గతంలో లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు మౌలిక వసతుల కొరత కారణంగా ఇళ్లు అప్పగించలేదు. ఈసారి వారికి కూడా తాళాలు అందజేస్తామని అధికారులు చెబుతున్నారు.” 2164 డబుల్? బెడ్?రూం ఇళ్లు ఇంకా ఇవ్వాల్సి ఉంది. అందులో 31 కాలనీలు ఉన్నాయి. వాటిలో ఇప్పటికే 19 కాలనీలను అందించాం. ఇంకా 12 కాలనీలు ఇవ్వాల్సి ఉంది. నల్గొండలో 552, మిర్యాలగూడలో 560, తిప్పర్తిలో 100 ఇళ్లను జూన్? 2 అందించటానికి గౌరవ మంత్రిగారు ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి జూన్? 2నే గృహప్రవేశాలు చేయాలని ఆదేశాలిచ్చారు” – చంద్రశేఖర్, నల్గొండ జిల్లా కలెక్టర్లబ్ధిదారుల ఆశాభావం : ఈసారైనా ప్రభుత్వం వాయిదా వేయకుండా ఇళ్ల పట్టాలు అందజేస్తే తమ సొంతింటి కల నెరవేరుతుందని లబ్ధిదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన మౌలిక వసతుల పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

# ‘బండి సంజయ్ కొడుకు భగీరథ్ సీఎం రేవంత్ రెడ్డి ఇంట్లో ఉన్నాడని తెలిసింది’

**హైదరాబాద్, మే 15:** తెలంగాణ రాజకీయాల్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసు సెగలు రేపుతోంది. బండి భగీరథ్‌పై ఉన్న కేసు విషయంలో కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. ఒక మైనర్ అమ్మాయిని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కౌరవుల లాగా వేధిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బండి సంజయ్ కొడుకుని కాపాడటం కోసమే రేవంత్ రెడ్డి పోలీసులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు.‘ ఒక ఐపీఎస్ భార్యను చంపితే 48 గంటల్లో పుణే వెళ్లి నిందితులను పట్టుకున్న పోలీసులు.. ఇక్కడ ఉన్న భగీరథ్‌ను ఎందుకు పట్టుకోలేకపోతున్నారు? నిందితుడు రేవంత్ రెడ్డి ఇంట్లోనే ఉన్నాడని నాకు ఫోన్ వచ్చింది. పోలీసులే అతడిని రక్షిస్తూ.. మాకు దొరకడం



లేదని అబద్ధాలు చెబుతున్నారు.’ అని బక్క జడ్సన్ మండిపడ్డారు. సిట్ విచారణ కేవలం కాలయాపన కోసమే వేశారని.. బండి సంజయ్ తన కొడుకుని కాపాడుకోవడానికి విపరీతంగా డబ్బు ఖర్చు పెడుతున్నారని విమర్శించారు.గతంలో మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగిని వేధించినప్పుడు బీజేపీ స్పందిం చలేదని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే దారిలో నడుస్తోం దని జడ్సన్ విమర్శించారు. జర్నలిస్ట్ సంగప్పనే ఆ మైనర్ అమ్మాయి వీడియోలను మీడియ ఓూకు ఇచ్చారని సంచలన వ్యాఖ్యలు చేశారు. లోకల్ మీడియా ఒక బ్రోకర్ మీడియా గా మారిపోయిం దని, ఈ పోక్సో కేసుపై ఒక్క వార్త కూడా వేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.అసలు కేటీఆర్‌కు కాదని... బండి సంజయ్ కొడుకుకే డ్రగ్స్ టెస్ట్ చేయించాలని జడ్సన్ డిమాండ్ చేశారు. ఇక్కడ టెస్ట్ చేస్తే రేవంత్ రెడ్డి మేనేజ్ చేసే అవకాశం ఉందని అందుకే చెన్నై తీసుకువెళ్లి పరీక్షలు నిర్వహించాలని కోరారు. భవిష్యత్తులో ఈ మైనర్ అమ్మాయి బండి సంజయ్‌పై పోటీ చేస్తే ఆయన చిత్తుగా ఓడిపోవడం ఖాయమని, అప్పుడు ఆమెనే అతడిని ఈడ్చుకుపోయి జైలులో వేస్తుందని హెచ్చరించారు. బండి సంజయ్ కొడుకుని అరెస్ట్ చేయమన్నందుకు తనను పోలీసులు వేధించారని జడ్సన్ ఆరోపించారు.కాగా, బండి భగీరథ్ తనను వేధింపులకు గురి చేశాడని ఓ మైనర్ అమ్మాయి హైదరాబాద్‌లో కేసు పెట్టింది. దీంతో భగీరథ్‌పై పోలీసులు పోక్సో కేసు పెట్టారు. ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సిట్ బృందాన్ని ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం బండి భగీరథ్ పరారీలో ఉన్నాడు. అతడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలపగా.. రెండ్రోజుల టైం ఇస్తే తాను విచారణకు సహకరిస్తానని భగీరథ్ పోలీసులు మెయిల్ పంపాడు. దీంతో ఈ ఎపిసోడ్‌లో ఎటువంటి పరిణామాలు చోటు చేసుకుంటా యనేది ప్రస్తుతం హాట్ టాఫిక్‌గా మారింది.

# జవహర్‌నగర్ నేపాలీ ముఠా దోపిడీ కేసు.. ప్రధాన నిందితుల అరెస్ట్

**హైదరాబాద్, మే 15:** జవహర్‌నగర్ నేపాలీ ముఠా దోపిడీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న మమత అలియాస్ మీనా కడాయత్, ఆమె భర్త రమేశ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేపాల్ సరిహద్దుల్లో ఈ దంపతులు అరెస్ట్ అయ్యారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో నలుగురి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. చోరీ జరిగిన రోజు యజమాని ద్విచక్ర వాహనాన్ని తీసుకుని దుండగులు పరారయ్యారు.ఆ బైక్‌ను యాప్రాల్‌లోని పెట్రోల్ బంకు వద్ద వదిలి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ఏజెంట్ భీమ్‌ను పోలీసులు విచారిస్తున్నారు. ప్రధాన నిందితులను రేపటిలోగా హైదరాబాద్‌కు తరలించనున్నట్లు సమాచారం. అలాగే ఈ కేసులో మిగిలిన నిందితులు నేపాల్‌లో తలదాచుకున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్



పరిధిలోని కౌకూరు గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీధర్ మోహన్ దంపతులను బంధించి.. నేపాలీ ముఠా దోపిడీకి పాల్పడిన విషయం తెలిసిందే. దాదాపు 75 తులాల బంగారం, 20 కిలోల వెండితో దుండగులు పరారయ్యారు. ఈ దోపిడీపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు



**భూదాన్ పోచంపల్లి, మే 15 :** రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు, లోడింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శుక్రవారం భూదాన్ పోచంపల్లి మండలం ముక్తాపూర్, జూలూరు పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులు, నిర్వాహకులు, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రారంభించి ఎన్ని రోజులు అయ్యిందని, ఇప్పటి వరకు ఎంత మేర ధాన్యం కొనుగోలు చేశారని, ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో ఎంత ధాన్యం నిల్వ ఉన్నాయని ఆరా తీశారు. ఇబ్బందులు లేకుండా వేగంగా కొనుగోళ్లు కొనసాగించాలని సూచించారు. రోజుకు ఎన్ని లారీల ధాన్యం లోడింగ్ చేసి పంపుతున్నారని, లారీలు సరిపడా ఉన్నాయా అని ఆరా తీశారు.లారీలు తక్కువగా రావడం వల్ల కాంటా ప్రక్రియలో ఏమైనా ఆలస్యం జరుగుతుందా అని ప్రశ్నించారు.

# ఖమ్మంలో వింత పరిస్థితి.. ముగ్గురు మంత్రులున్నా దవాఖానల్లో వసతులు సున్నా..!

**హైదరాబాద్ :** పేరుగొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఉంది ఖమ్మం)జిల్లా ప్రజల పరిస్థితి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కడితే ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులయ్యారు. అందులో ఒకరు డిప్యూటీ సీఎం కూడా ఈ జిల్లా నుంచే ఉండటం విశేషం. అయితే క్యాబినేట్‌లో ముగ్గురు మినిస్టర్స్ ఉన్నా ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ దవాఖాన దుస్థితి ఏ మాత్రం మారడం లేదు. పలు దవాఖానల్లో లో వోల్టేజ్ సమస్యతో ఏసీలు, వైద్య పరికరాలు పని చేయకపోవడంతో రోగులు, వైద్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ఖమ్మం జిల్లా ప్రధాన హాస్పిటల్‌లో విద్యుత్ సరఫరాకు సరిపడా ట్రాన్స్‌ఫార్మర్లు లేక, లో వోల్టేజ్ సమస్యలతో ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు, బాలింతల



విభాగంలో సైతం ఏసీలు పని చేయడం లేదని ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. 240 రావాల్సిన వోల్టేజ్ కేవలం 180 నుండి 200 మాత్రమే రావడంతో పరికరాలు తరచుగా కాలిపోతున్నాయని దవాఖాన వైద్య సిబ్బంది చెప్తున్నారు.అలాగే ఏసీలు లేక ఆపరేషన్ థియేటర్, ఐసీయూల నుంచి దుర్వాసన వస్తుందని సిబ్బంది ఆరోపిస్తున్నారు. పలు విభాగాల్లో అత్యవసర పరికరాలు కూడా పని చేయకపోవడంతో సరైన చికిత్స అందించలేకపోతున్నామని వైద్యుల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలంలో ఏసీలు పనిచేయక రోగులు, వైద్యులు ఇబ్బంది పడుతున్నారని సరిపడా ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చి, నాణ్యమైన విద్యుత్ అందించాలని రోగులు, సిబ్బంది కోరుతున్నారు.

## భోజ్‌శాల ఆలయ కేసులో ఇండోర్ కోర్టు కీలక తీర్పు



**మధ్యప్రదేశ్ మే15:** భోజ్‌శాల ఆలయ కేసులో ఇండోర్ కోర్టు కీలక తీర్పు ఇచ్చింది. వివాదాస్పద స్థలం ఆలయానిదేనంటూ ఇండోర్ ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. ఆలయంలో సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు చేసుకోవచ్చని కోర్టు అనుమతించింది. ఆలయ ప్రాంతాన్ని పురావస్తుశాఖ ఆధీనంలోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.భోజ్‌శాల ఆలయ వివాదం దశాబ్దాలుగా కొనసాగుతోంది. భోజ్‌శాలలోని మధ్యయుగం నాటి స్మారక కట్టడాన్ని హిందూవులు వాగ్దేవి (సరస్వతి) దేవాలయంగా భావిస్తారు. ముస్లింలు దాన్ని కమల్ మౌలా మసీదుగా వ్యవహరిస్తుంటారు. అక్కడ 2003 ఏఎస్ఐ ఒప్పందం ప్రకారం, హిందువులు మంగళవారాల్లో, ముస్లింలు శుక్రవారాల్లో ప్రార్థనలు కొనసాగిస్తున్నారు.అయితే ఈ ప్రదేశంలో ఆరాధన కోసం ప్రత్యేక హక్కులు కోరుతూ హిందూ వర్గం ఈ ఒప్పందాన్ని హైకో ర్టులో సవాలు చేసింది. ఆలయ స్థలం మసీదు కు చెందిందని ముస్లిం వర్గాలు వాదించాయి. 2024లో 98 రోజులపాటు పురావస్తుశాఖ సర్వే నిర్వహించింది. దీనిపై మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ బెంచ్ నేడు విచారణ జరిపింది. 2024 జులై 15న ఇండోర్ కోర్టుకు నివేదిక సమర్పించింది. మసీదుకు ప్రత్యామ్నాయ స్థలం దరఖాస్తు చేసుకోవచ్చని కోర్టు స్పష్టం చేసింది.

## కుల వ్యవస్థను నిర్మూలించాలన్నదే నా వ్యాఖ్యల ఉద్దేశం ఉదయనిధి స్టాలిన్ క్లారిటీ



సనాతన ధర్మాన్ని నిర్మూలించాలన్న వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్న వేళ తమిళనాడు అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, నటుడు ఉదయనిధి స్టాలిన్ వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారని, ప్రజలను అగ్ర, నిమ్న కులాల పేరుతో విభజించే వ్యవస్థను మాత్రమే నిర్మూలించాలన్నది తన ఉద్దేశమని పేర్కొన్నారు. ఎవరూ ఆలయాలకు వెళ్లొద్దు అని చెప్పడం తన ఉద్దేశం కాదని వివరించారు. ఆలయాలతో పాటు సమాజంలో ప్రతీ ఒక్కరికీ సమాన హక్కులు ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎక్స్‌లో రాసుకొచ్చారు.ఎవరెన్ని విమర్శలు చేసినా తాను భయపడే వ్యక్తిని కాదని, కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతుంటానని ఉదయనిధి స్టాలిన్ చెప్పారు. పెరియార్, అంబేద్కర్, అన్నా, కళైంగర్ సిద్ధాంతాల గురించి కూడా తాను అసెంబ్లీలో మాట్లాడానని తెలిపారు. దేవుడిపై ఉండే నమ్మకానికి తాము వ్యతిరేకం కాదన్న ఉదయనిధి, అసమానతలను, అణచివేతను మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తామని అన్నారు. కాగా మంగళవారం అసెంబ్లీలో సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని ఉధయనిధి వ్యాఖ్యానించారు. అది మనుషులను కులం పేరుతో విభజిస్తుందని పేర్కొన్నారు."నేను తమిళనాడు శాసనసభలో మాట్లాడినప్పుడు ప్రజలను విభజించే కుల వ్యవస్థను నిర్మూలించాలని చెప్పాను. దీనిపై కొందరు నన్ను విమర్శిస్తున్నారు. నేను భయపడే వ్యక్తిని కాదు. ద్రవిడ ఉద్యమం వ్యతిరేకత నుంచే ఆవిర్భవించింది. ఆ కోణంలో నేను ఒక చిన్న వివరణ ఇవ్వాలని అనుకుంటున్నాను. కుల వ్యవస్థను నిర్మూలించాలని నేను చెప్పినప్పుడు, ఎవరూ దేవాలయాలకు వెళ్లకూడదని అర్థం కాదు. దేవాలయంలోనే కాకుండా సమాజంలో కూడా ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు ఉండాలని దీని అర్థం. పెరియార్, అంబేద్కర్, అన్నా, కరుణానిధి చెప్పిన సూత్రాల గురించి కూడా నేను మాట్లాడాను. దేవుడిపై ఎవరికైనా ఉన్న నమ్మకానికి మేము వ్యతిరేకం కాదు. కానీ అసమానతలను, అణచివేతను మాత్రం మేము తీవ్రంగా వ్యతిరేకిస్తాము.' 'ఉదయనిధి స్టాలిన్, తమిళనాడు ప్రతిపక్ష నేతఅం తకుముందు మంగళవారం తమిళనాడు శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా తొలిసారిగా ప్రసంగించిన ఆయన, మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మం ప్రజలను విభజిస్తుందని ఆరోపిస్తూ దానిని నిర్మూలించాలని అన్నారు. కాగా, 2023 సెప్టెంబర్‌లో అప్పటి మంత్రిగా ఉన్న ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని కచ్చితంగా నిర్మూలించాలంటూ చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపాయి. ఆ సమయంలో హిందూ అనుకూల సంస్థల నుంచి ఆయన తీవ్ర విమర్శలను, కోర్టు కేసులను సైతం ఎదుర్కొన్నారు. తాజాగా మరోసారి అలాంటి వ్యాఖ్యలే శాసనసభలో చేశారు.ఇదిలా ఉండగా, సనాతన ధర్మంపై ఐవీఖ నాయకుడు ఉదయనిధి స్టాలిన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై తమిళనాడు మంత్రి, ఎంఖ ప్రధాన కార్యదర్శి ఆధవ్ అర్జున స్పందించారు. ఈ విషయంపై స్టాలిన్‌కు సరైన అవగాహన లేదని ఆయన అభిప్రాయపడ్డారు. సమాజంలోని లౌకిక స్ఫూర్తిని చెప్పిన ఆయన, రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల ప్రజలను సమాన గౌరవంతో, సమానత్వంతో చూస్తుందన్నారు. తమిళనాడు రాజకీయ పునాది ఎల్లప్పుడూ సమానత్వ సూత్రంపైనే ఆధారపడి ఉందన్నారు. "ఉదయనిధి స్టాలిన్‌కు సనాతన ధర్మం అంటే ఏమిటో తెలియదు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులను మేము ఎల్లప్పుడూ సమానంగానే చూస్తాము. వ్యక్తిగతంగా నాకు దేవుడిపై నమ్మకం లేదు. కానీ ఒక మంత్రిగా నేను గౌరవించాలి. మేము హిందువులకు వ్యతిరేకం కాదు. మేము హిందుత్వానికి వ్యతిరేకం. హిందుత్వం అంటే ఒక మతాన్ని బలవంతంగా రుద్దడం. నిస్సందేహంగా, మనం అందరినీ సమానంగా చూడాలి. తమిళనాడు ఎల్లప్పుడూ సమానత్వంపైనే ఆధారపడి ఉంటుంది. ఉత్తరాదిలో సనాతన ధర్మం అంటే హిందూమతం అని అర్థం. తమిళనాడులో సనాతన ధర్మం అంటే అసమానత. దీనిపై ఆయన కచ్చితంగా స్పష్టత ఇవ్వాలి. మేము ఎల్లప్పుడూ అసమానతకు వ్యతిరేకం. మేము ఏ మతానికీ వ్యతిరేకం కాదు." అని అర్జున అన్నారు.

## రాజీపడిన ప్రధాని మోదీ - అదానీని కేసుల నుంచి కాపాడేందుకే అమెరికాతో ట్రేడ్ డీల్






**న్యూఢిల్లీ:**కేసుల వల నుంచి గౌతమ్ అదానీని విడిపించేందుకే, అమెరికాకు పూర్తి లబ్ధి చేకూర్చే వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోదీ సంతకం చేశారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. గౌతమ్ అదానీని కేసుల నుంచి కాపాడేందుకు అమెరికాతో బేరసారాలు జరపడం ద్వారా రాజీపడిన ప్రధానిగా నరేంద్ర మోదీ నిలిచారని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికా, భారత్ మధ్య జరిగింది ట్రేడ్ డీల్ కాదని, అది బేరసారం మాత్రమేనని రాహుల్ మండి పడ్డారు. ఈమేరకు హిందీలో ఆయన ఒక ట్వీట్ చేశారు. సోలార్ విద్యుత్ కాంట్రాక్టుల కోసం లంచాలు ఇవ్వడంతో పాటు పెట్టుబడిదారులను మోసగించారనే అభియోగాలతో గౌతమ్ అదానీపై 2024 నవంబరులో అమెరికాలో కేసులు నమోదయ్యాయి. ఈ కేసులను ఉపసంహరించుకోవాలని ఇప్పుడు అమెరికా న్యాయశాఖ యోచిస్తోందంటూ అమెరికన్ మీడియాలో కథనాలు వచ్చిన వెంటనే రాహుల్ ఈ ఆరో పణలు చేశారు.అదానీ కోసమే, అమెరికాకు నచ్చినట్టుగా ట్రేడ్ డీల్ : జైరాం రమేశ్ వాణిజ్య ఒప్పందాన్ని అమెరికా ఏకపక్షంగా ప్రతిపాదించినా, ప్రధాని మోదీ ఎందుకు అంగీకరించారో ఎట్టకేలకు తేటతెల్లమైందని కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్ ఇంఛార్జి) జైరాం రమేశ్ అన్నారు. అదానీని కేసుల నుంచి కాపాడేందుకే, అమెరికాకు మాత్రమే ప్రయోజనాన్ని కల్పించే వాణిజ్య ఒప్పందాన్ని మోదీ కుదుర్చుకున్నారని ఆయన ఆరోపించారు. దేశ ప్రయోజనాల కంటే అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ హెచ్చరికలకే అధిక ప్రాధాన్యతను ఇచ్చి 2025 మే 10న ఆపరేషన్ సిందూర్‌ను ప్రధాని మోదీ అకస్మాత్తుగా ఆపేశారని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. ఇప్పుడు మోదానీపై ఉన్న అన్ని అభియోగాలను ఎత్తివేసేందుకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధమవుతోందనే కథనాలు వస్తున్నాయని జైరాం రమేశ్ చెప్పారు. దేశ ప్రధాని పదవిలో ఉన్న వ్యక్తి ఇంకా ఎంతగా రాజీపడగలరు అని ఆయన ప్రశ్నించారు.గౌతమ్ అదానీపై అమెరికాలో కేసుల కాలక్రమంఅమెరికా కోర్టులో దాఖలైన ఛార్జ్‌షీట్, అంతర్జాతీయ మీడియా నివేదికల ప్రకారం గౌతమ్ అదానీ కేసుతో ముడిపడిన వివరాలు, ఆరోపణలు ఇలా ఉన్నాయి. 2020 - 2024 మధ్య కాలంలో భారతదేశంలో భారీ సోలార్ విద్యుత్ కాంట్రాక్టులను దక్కించుకోవడం కోసం గౌతమ్ అదానీ, సాగర్ అదానీ (అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ డైరెక్టర్), ఇతరులు కలిసి భారత ప్రభుత్వ అధికారులకు దాదాపు రూ.2,500 కోట్ల లంచాలు ఇవ్వడానికి అంగీకరించారని అమెరికా మార్కెట్ నియంత్రణ సంస్థ (యూఎస్ ఎస్ఈసీ - ఖూ ) ఆరోపించింది. ఈ లంచాల ద్వారా దక్కించుకున్న సోలార్ విద్యుత్ సరఫరా కాంట్రాక్టులతో 20 ఏళ్ల కాలంలో దాదాపు రూ.16,500 కోట్ల నికర లాభాన్ని ఆర్జించాలని అదానీ గ్రూప్ ప్రణాళిక వేసిందని యూఎస్ ఎస్ఈసీ పేర్కొంది.తమ కంపెనీలో ఎలాంటి లంచాల వ్యవహారాలు లేవని, పారదర్శకమైన విధానాలు పాటిస్తున్నామని అబద్ధపు ప్రకటనలు చేసి, అమెరికా సంస్థలతో సహా అంతర్జాతీయ మార్కెట్ నుంచి దాదాపు రూ.16,500 కోట్లను రుణాలు, బాండ్ల రూపంలో సేకరించారని అమెరికాలో మరో కేసు నమోదైంది.2024 నవంబర్ 20: ఈ తేదీన న్యూయార్క్‌లోని బ్రూక్లిన్ ఫెడరల్ కోర్టులో అమెరికా న్యాయశాఖ గౌతమ్ అదానీపై క్రిమినల్ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అదే రోజున యూఎస్ ఎస్ఈసీ సివిల్ మోసం కేసును నమోదు చేసింది.2024 నవంబర్ 21: ఈ వార్త బయటకు రావడంతో భారత స్టాక్ మార్కెట్లో అదానీ గ్రూప్ షేర్లు 20% వరకు పతనమయ్యాయి. అదానీ గ్రూప్ ఈ ఆరోపణలను పూర్తిగా నిరాధారమైనవని కొట్టిపారేసింది.2025 అదానీ లీగల్ టీఎం అమెరికా కోర్టులలో ఈ కేసుల చట్టబద్ధతను, అమెరికాకు ఉన్న అధికార పరిధిని సవాలు చేసింది. సుదీర్ఘంగా చట్టపరమైన పోరాటం చేసింది. 2026 మే 14: అమెరికా వెలుపల జరిగిన వ్యవహారం కావడంతో చట్టపరమైన అధికార పరిధి సరిపోదనే కారణంతో అమెరికా న్యాయ శాఖ క్రిమినల్ కేసులను పూర్తిగా ఎత్తివేయ దానికి సిద్ధమవుతున్నట్లు అమెరికన్ మీడియాలో తాజాగా కథనాలు ప్రచురితమయ్యాయి.2026 మే 15 (తాజా అప్‌డేట్): అమెరికా మార్కెట్ నియంత్రణ సంస్థ దాఖలు చేసిన సివిల్ కేసులో గౌతమ్ అదానీ, సాగర్ అదానీలు దాదాపు రూ.150 కోట్లకు పైగా జరిమానా చెల్లించ డానికి ఒప్పందం కుదుర్చుకుని, వివాదాన్ని ముగించారు.

## నీట్ విద్యార్థి రితిక్ ఆత్మహత్యకు బాధ్యులెవరు?




**ఉత్తర్ ప్రదేశ్:** నీట్ యూజీ 2026 పరీక్ష రద్దుతో ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన విద్యార్థి రితిక్ మిశ్రా ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటన దేశవ్యాప్తంగా కలకలం సృష్టించింది. పరీక్ష రద్దుతో తీవ్ర మానసిక వేదనకు గురైన రితిక్ బలవన్మరణానికి పాల్పడినట్లు బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. విద్యార్థి ఆత్మహత్య ఘటనపై ప్రతిపక్ష పార్టీలు, పలువురు రాజకీయ ప్రముఖులు స్పందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రితిక్ మృతిపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ ప్రియాంక గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.లఖింపూర్ ఖేరీలో నీట్ విద్యార్థి రితిక్ మిశ్రా ఆత్మహత్య చేసుకోవడం అత్యంత హృదయ విదారకమని ప్రియాంక గాంధీ అన్నారు. దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. నీట్ పరీక్ష రద్దు కావడంతో రితిక్ తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురయ్యాడని విద్యార్థి తల్లిదండ్రులు చెబుతున్నారని ప్రియాంక అన్నారు. పరీక్షల్లో విచ్చలవిడిగా పెరిగిపోతున్న అవినీతి యువత ప్రాణాలను బలి తీసుకుంటోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోందని మండిపడ్డారు. ఈ పేపర్ లీక్‌ల పరంపర ఎప్పుడు ఆగుతుంది? అంటూ ప్రశ్నించారు. దీనికి ఎవరు జవాబుదారీతనం వహిస్తారని ప్రియాంక గాంధీ మండిపడ్డారు.కాగా, నీట్ పరీక్ష రద్దుతో తీవ్ర ఆవేదనకు గురైన యూపీకి చెందిన రితిక్ మిశ్రా నిన్న (గురువారం) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇప్పటికే రెండు సార్లు నీట్ రాసిన విద్యార్థికి సీటు రాలేదు. మూడోసారి అయినా సీటు వస్తుందని భావించిన యువకుడికి పరీక్ష రద్దు షాక్ ఇచ్చినట్లు అయ్యింది. దీంతో అతడు బలవన్మరణానికి పాల్పడ్డాడు.

## భర్తతో కలిసి ప్రియుడ్ని హత్య చేసిన మహిళ.. మృతదేహాన్ని డ్రమ్‌లో కుక్కి పారవేత



**ముంబై:** ఒక మహిళ తన భర్త, సోదరుడు, మరొకరితో కలిసి ప్రియుడ్ని హత్య చేసింది. ఆ తర్వాత మృతదేహాన్ని డ్రమ్‌లో కుక్కి కాలువలో పడేశారు. ఆ వ్యక్తి మిస్సింగ్ ఫిర్యాదుపై దర్యాప్తు చేసిన పోలీసులు ఈ విషయం తెలుసుకుని షాక్ అయ్యారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ముంబ్రాకు చెందిన అర్బాజ్ మక్సూద్ అలీ ఖాన్, ఏప్రిల్ 3న పని నిమిత్తం దాదర్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయలుదేరాడు. అతడు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. ఫలితం లేకపోవంతో అర్బాజ్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.కాగా, మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అర్బాజ్ ఫోన్ కాల్స్, లొకేషన్ డేటాను పరిశీలించారు. చివరిసారి వసాయి ప్రాంతంలో అతడు ఉన్నట్లు తెలుసుకున్నారు. అర్బాజ్ ప్రియురాలు మెహజబీన్ షేక్ ఫోన్ లొకేషన్ కూడా ఆ ప్రాంతంలో ఉన్నట్లు తేలింది. దీంతో ఆమెపై అనుమానించిన పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు.మరోవైపు తొలుత బుకాయించిన మెహజబీన్, ఆ తర్వాత నిజాన్ని అంగీకరించినట్లు పోలీస్ అధికారి తెలిపారు.

## జూన్ 21న నీట్ యూజీ రీ ఎగ్జామ్- వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లోనే





**న్యూఢిల్లీ:**దేశవ్యాప్తంగా లక్షలాది మంది వైద్య విద్యార్థులు ఎదురుచూస్తున్న నీట్ యూజీ రీ-ఎగ్జామ్ తేదీని కేంద్రం ప్రకటించింది. జూన్ 21న నీట్ పరీ క్షను మళ్లీ నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ-చీూా అధికారికంగా వెల్లడించింది. మే 3న జరిగిన పరీక్షా ప్రశ్నపత్రం లీక్ అవ్వడంతో ఆ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తామని పే ర్కొంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పె ట్టుకొని ఆ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలి పింది. ఈ నేపథ్యంలో కొత్త తేదీలను చీూా వెల్ల డించింది. పారదర్శకమైన రీతిలో జూన్ 21న పరీక్ష నిర్వహిస్తామని తెలిపింది. అడ్మిట్ కార్డులు, పరీక్షా కేంద్రాల వివరాలను త్వరలోనే అధికారిక వెబ్‌సైట్‌లో పెడతామని పేర్కొంది. పునఃపరీక్ష రాసే విద్యార్థులు ఎలాంటి అదనపు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. రీఎగ్జామ్‌కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను చీూా కోరింది.వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో నీట్ పరీక్ష: కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో నీట్ పరీక్ష నిర్వహిస్తామని కేంద్రమంత్రి ధరేంద్ర ప్రధాన్ వెల్లడించారు. వచ్చే ఏడాది నీట్ పరీక్షను సీబీటీ విధానంలో నిర్వహిస్తామని, మళ్లీ మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూడటమే మా ధ్యేయమని చెప్పారు. జూన్ 21 నుంచి నీట్ రీ-ఎగ్జామ్ నిర్వహిస్తామ న్న కేంద్రమంత్రి, జూన్ 14 నుంచి చేస్తామని తెలిపారు."జూన్ 21న నీట్ రీఎగ్జామ్ తేదీ ఖరారైంది. ప్రశ్నపత్రం లీక్ వార్తలు రాగానే విచారణకు ఆదేశాలు జారీచేశాం. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుం టున్నాం. విద్యార్థులు ఎవరూ నష్టపోకూడదనే పరీక్ష రద్దుచేసి మళ్లీ నిర్వహిస్తున్నాం. పరీక్ష పారదర్శకంగా నిర్వహించడమే మా ప్రధాన కర్తవ్యం. విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలనేది మా మొదటి ప్రాధాన్యం. పేపర్ లీక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. నిబంధ నలు ఉల్లంఘించిన వారిని ఉపేక్షించబోము. పేపర్ ఎలా లీక్ అయింది? ఎవరి నుంచి ఎక్కడికి వెళ్లిందనేది పూర్తి వివరాలు బహిర్గతమవుతాయి. సీబీఐ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలు చూసి భయపడొద్దు. అడ్మిట్‌కు సంబంధించి ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉంది. పరీక్ష ఫీజు లేకుండా విద్యార్థులకు ప్రయోజనం కల్పిస్తున్నాం. ప్రశ్నపత్రం లీక్ చేసిన వారిని వదిలిపెట్టేది లేదు సీబీఐ అదే పనిలో ఉంది. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నాం. వ్యవస్థ బలోపేతానికి మరిన్ని చర్యలు తీసుకుంటాం."

## భోజ్‌శాల కాంప్లెక్స్ హిందువులదే: మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు



**మధ్యప్రదేశ్:** మధ్యప్రదేశ్‌లోని వివాదాస్పద భోజ్‌శాల కాంప్లెక్స్ హిందూ ఆలయానికే చెందుతుందని మధ్యప్రదేశ్ హైకోర్టు ఇండోర్ ధర్మాసనం సంచలన తీర్పు వెలువరించింది. ఈ మేరకు జస్టిస్ విజయ్ కుమార్ శుక్లా, జస్టిస్ అలోక్ అవస్థిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఉత్త ర్వులు జారీ చేసింది. అక్కడ సరస్వతిదేవి విగ్ర హాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని కేంద్రాన్ని ఆదేశిం చింది. భక్తులకు తగిన వసతులు కల్పించాలని సూచించింది. భోజ్‌శాల కాంప్లెక్స్‌ను స్వాధీనం చేసుకోవాలని పురావస్తు శాఖను ధర్మాసనం ఆదేశించింది.ఈ చారిత్రక కట్టడం పరిరక్షణ, భద్రత, మతపరమైన ఆచారాల నియంత్రణకు సంబంధించి పురావస్తు శాఖకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించింది. 1958నాటి ఏఎస్ఐ చట్టం ప్రకారం, ఈ ఆస్తుల బాధ్యత లను ఏఎస్ఐ నిర్వర్తిస్తుందని ధర్మాసనం తెలిపింది. భోజ్‌శాల ఆలయ వ్యవహారాలు, పరిపాలనపై కేంద్ర ప్రభుత్వం, పురావస్తు శాఖ సంయుక్తంగా తుది నిర్ణయం తీసుకుంటాయని తెలిపింది. భవిష్యత్తులో ఈ కట్టడం చారిత్రక నేపథ్యం దెబ్బతినకుండా ఏఎస్ఐ పర్యవేక్షణలో నిర్వహణ కొనసాగుతుందని ధర్మాసనం తెలిపింది. మసీదు నిర్మాణం కోసం ముస్లింలు ప్రత్యామ్నాయ స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.పురావస్తు శాఖ ఇటీవల సమర్పించిన 2వేల పేజీల శాస్త్రీయ సర్వే నివేదికను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. మసీదు నిర్మాణం కంటే ముందే అక్కడ పర్మార్ రాజులకాలంనాటి ఆలయం ఉండేదని, పాత ఆలయ భాగాలతోనే మసీదు నిర్మించారని పురావస్తు శాఖ నివేదికలో పేర్కొంది. ఈ ఆధారాలనే ధర్మాసనం ప్రామాణికంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. కోర్టు తీర్పు నేపథ్యంలో మధ్యప్రదేశ్ ప్రభుత్వం ధార్ జిల్లాలో భద్రతను కట్టుదిట్టం చేసింది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## ఆ ఫ్యామిలీలో అయిదుగురికి నీట్ ర్యాంక్.. సీబీఐ దర్యాప్తుతో వెలుగులోకి షాకింగ్ నిజాలు



**న్యూఢిల్లీ:** నీట్ యూజీ పేపర్ లీక్ ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. అయితే కొన్ని షాకింగ్ విషయాలు తెలిశాయి. 2025 నీట్ పరీక్షలో.. జైపూర్‌కు చెందిన బివాల్ ఫ్యామిలీలోని అయిదుగురు సభ్యులు ఆ పరీక్షను క్లియర్ చేశారు. వాళ్లు ప్రతిష్టాత్మక మెడికల్ కాలేజీల్లో సీట్లు సంపాదించారు. వాళ్లు సాధించిన సక్సెస్ పట్ల దేశం గర్వించింది. ఆ ఫ్యామిలీకి నలుమూలల నుంచి కంగ్రాట్స్ వెల్లువెత్తాయి. దినేశ్ బివాల్ అనే వ్యక్తి తన ఫేస్‌బుక్‌లో 2025 నవంబర్ 6వ తేదీన ఓ పోస్టు పెట్టారు. తమ అయిదుగురు పిల్లలు నీట్‌లో ర్యాంక్ కొట్టి గవర్నమెంట్ మెడికల్ కాలేజీల్లో సీట్లు సంపాదించారని, దీని పట్ల గర్వంగా ఉందని పేర్కొన్నాడు. అయితే ఆ దినేశ్‌పై ఇప్పుడు ఫోకస్ పడింది. ఏడాది తర్వాత అతనిపై నిఘా పెట్టారు. దినేశ్‌తో పాటు అతని సోదరుడు మంగీలాల్‌ను అరెస్టు చేశారు. నీట్ పేపర్ లీక్ స్కాండల్‌లో మంగీలాల్ మేనల్లుడు వికాశ్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో విద్యా వ్యవస్థలో మాఫియా పేరుకుపోయినట్లు భావిస్తున్నారు. మెడికల్ అడ్మిషన్ విధానంలో చాలా లొసగులు ఉన్నట్లు తెలుస్తోంది. బివాల్ ఫ్యామిలీ సక్సెస్ స్టోరీ వెనుక నీట్ పేపర్ లీక్ నెట్వర్క్ ఏమైనా ఉందా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# మూడేళ్లకొకసారి వచ్చే 'అధిక మాసం'- ఈసారి జ్యేష్ఠంలో- మరి శుభకార్యాలు చేసుకోవచ్చా?





తెలుగు పంచాంగం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి అధిక మాసం వస్తుంది. 2023 వ సంవత్సరంలో శ్రావణ మాసం అధిక మాసంగా వచ్చింది. తిరిగి 2026 లో జ్యేష్ఠ మాసం అధిక మాసంగా రానుంది.

**అధిక మాసం అంటే?**
ఒకే సంవత్సరంలో ఒకే పేరున్న మాసం రెండు సార్లు వస్తే మొదటిదాన్ని అధికం అని, రెండవదాన్ని నిజమాసమని, శుద్ధం అని అంటారు. శుభకార్యాలు నిషిద్ధమైన ఈ అధిక మాసంలో ఏమేమి చేయవచ్చు? ఏవి చేయకూడదు అనే అంశాలు ఋషులు చక్కగా వివరించి ఉన్నారు. ఈ సందర్భంగా అసలు అధిక మాసం ఎలా ఏర్పడుతుందో చూద్దాం.

**అధిక మాసం ఎలా ఏర్పడుతుంది?**
ఈ ఏడాది మే 17, ఆదివారం నుంచి అధిక జ్యేష్ఠ మాసం ప్రారంభం కానుంది. "అసంక్రాంతి మాసో అధికమాసః" అని సనాతన ధర్మశాస్త్రంలో వివరించి ఉంది. అంటే సూర్యుడు ఒక రాశి నుంచి ఇంకో రాశిలోకి ప్రయాణించడాన్ని సంక్రమణం లేదా సంక్రాతి అంటారు. ఏ మాసంలో అయితే సూర్యుడు ఒక రాశి నుంచి ఇంకో రాశిలోకి ప్రవేశించడో ఆ మాసాన్ని అధిక మాసమని అంటారు.

**శాస్త్రీయ కోణం**
శాస్త్రీయ కోణం నుంచి చూస్తే చాంద్రమానం ప్రకారం చూస్తే ఒక సంవత్సరానికి 354 రోజులు మాత్రమే ఉంటాయి. అదే సౌరమానం ప్రకారం 365 రోజులు ఉంటాయి. ఈ రెండింటి మధ్య వచ్చే 11 రోజుల తేడాను సరిచేయడానికి ప్రతి 33 నెలలకు ఒకసారి అధిక మాసం వస్తుంది. అంటే ఏడాదికి 11 రోజుల చొప్పున మూడు సంవత్సరాలకు సుమారుగా 30 రోజుల పైనే అవుతుంది. ఈ కాలాన్ని అధిక మాసంగా పరిగణించాలని శాస్త్రం చెబుతోంది.

**ఏ నెల అధిక మాసం అవుతుంది?**
ఏ నెలలో సూర్యుడు ఒక రాశి నుంచి మరో రాశిలోకి ప్రవేశించడో అంటే సూర్య సంక్రమణం జరగదో, నెల 'అధిక మాసం' అవుతుంది.

**పురుషోత్తమ మాసం**
అధిక మాసాన్ని పురుషోత్తమ మాసమని కూడా అంటారు. ఈ మాసానికి అధిపతి శ్రీమహావిష్ణువు.

**అధిక మాసం ఎప్పుడు వస్తుంది?**
సాధారణంగా చైత్రమాసం నుంచి ఆశ్వయుజ మాసం మధ్యలో అధిక మాసం వస్తుంది

**2026లో అధిక మాసం ఎప్పుడు?**
2026 సంవత్సరంలో, మే 17, ఆదివారం నుంచి అధిక జ్యేష్ఠ మాసం ప్రారంభమవుతుంది. ఈ ఏడాది జ్యేష్ఠ మాసం రెండు సార్లు వస్తుంది. జూన్ 16 నుంచి నిజ జ్యేష్ఠ మాసం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా అధిక మాసంలో ఎలాంటి పుణ్యకార్యాలు చేయవచ్చు? ఎలాంటి కార్యాలు నిషిద్ధం? అనే విషయాలు తెలుసుకుందాం.

**ఋగ్వేద వాక్కు**
శ్రౌత స్మార్తాది కర్మలన్నీ నిజమాసం అంటే శుద్ధ మాసంలోనే ఆచరించాలని ఋగ్వేదంలో వివరించి ఉంది. ఈ కర్మలు అధిక మాసంలో ఆచరిస్తే నిష్ఫలం అవుతాయని ఋషి వాక్కు. దేవకార్యాలు నిజమాసంలో, పితృ కార్యాలు అధిక నిజ రెండు మాసాల్లో ఆచరించవచ్చు.

**అధిక మాసంలో శుభకార్యాలు చేసుకోవచ్చా?**
అధిక మాసంలో శుభకార్యాలు నిషిద్ధమైనప్పటికీ సత్యనారాయణ స్వామి వ్రతాలు, నవగ్రహ హోమాలు, శాంతి పూజలు నిరభ్యంతరంగా చేసుకోవచ్చు.

**అధికస్య అధికం ఫలం**
అధిక మాసంలో లౌకికమైన శుభకార్యాలు నిషిద్ధమైనప్పటికీ జపతపాలకు, అనుష్టానానికి ఇంతకు మించిన శుభ సమయం మరొకటి ఉండదు. ఈ మాసంలో చేసే జపతపాలకు, అనుష్టానానికి వెయ్యిరెట్లు అధిక ఫలం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. అందుకే అధికస్య అధికం ఫలం అంటారు.


అధిక మాసంలో ఎంత ఎక్కువగా జపతపాలు, అనుష్ఠానాలు చేస్తే అంత ఎక్కువ ఫలితం లభిస్తుందని అర్ధం. ఈ మాసంలో చేసే ఏ పుణ్యకార్యమైన విశమైనప్పటికీ జపతపాలకు, అనుష్టానానికి ఇంతకు మించిన శుభ సమయం మరొకటి ఉండదు. ఈ మాసంలో చేసే జపతపాలకు, అనుష్టానానికి వెయ్యిరెట్లు అధిక ఫలం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. అందుకే అధికస్య అధికం ఫలం అంటారు. ేషమైన ఫలాన్ని ఇస్తుంది.

**శ్రాద్ధకర్మలు నిర్వహించవచ్చా?**
జ్యేష్ఠ మాసంలో గతించిన పెద్దలకు శ్రాద్ధ కర్మలు నిర్వహించే విషయంలో శాస్త్రం కొన్ని నియమాలు సూచించింది. అధిక మాసంలో పిండ రహితంగా, శుద్ధ మాసంలో పిండ సహితంగా శ్రాద్ధ కర్మలు ఆచరించాలని శాస్త్రం చెబుతోంది. అంతేకాదు ఈ మాసమంతా విరామం లేకుండా ఒక దీపాన్ని వెలిగించి ఉంచడం వలన పితృదేవతలకు సద్గతులు కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయి.

**దానధర్మాలకు శ్రేష్టం అధిక మాసం**
అధిక మాసం దానధర్మాలకు శ్రేష్టమైన మాసమని పెద్దలు అంటారు. ఈ మాసంలో ఫల దానం అంటే పళ్ళు దానం చేసినా, పిండి వంటలు పంచి పెట్టినా అధిక ఫలం లభిస్తుందట! ముఖ్యంగా ఈ దానాలు జ్యేష్ఠ శుద్ధ ద్వాదశి, పౌర్ణమి, బహుళ అష్టమి, నవమి, ద్వాదశి, చతుర్దశి, అమావాస్య వంటి రోజుల్లో చేయడం వలన అనంతమైన పుణ్యం లభిస్తుందని శాస్త్రంలో వివరించి ఉంది. ఈ రోజుల్లో దానాలు చేయడం వలన సుఖశాంతులు, సౌభాగ్యాలు కలుగుతాయని విశ్వాసం.రానున్న అధిక జ్యేష్ఠ మాసంలో మనం కూడా జపతపాలు, దానధర్మాలు, దైవారాధనలు చేద్దాం. సకల శుభాలు పొందుదాం. శుభం భూయాత్!ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

# హరిద్ర గణపతి పూజ ఇలా చేస్తే- శుభ ఫలితాలు, సంతాన సౌభాగ్యం కలగడం తథ్యం!

జ్యోతిష శాస్త్రం ప్రకారం నవగ్రహాల్లో గురు గ్రహాన్ని శుభ గ్రహంగా భావిస్తారు. ఒక్క గురువు అనుకూలంగా ఉంటే చాలు మిగిలిన అన్ని గ్రహాలు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ శుభ ఫలితాలు పొందవచ్చు. కానీ గురు గ్రహం అనుకూలత లేకుండా మిగిలిన ఎన్ని గ్రహాలు అనుకూలంగా ఉన్నా లాభం లేదు. గురు గ్రహ అనుకూలత కోసం గురువును ఆరాధించడంతో పాటు కొన్ని ప్రత్యేక పరిహారాలు పాటించడం వల్ల శుభ ఫలితాలు పొందవచ్చునని జ్యోతిష శాస్త్ర పండితులు చెబుతున్నారు. ఆ పరిహారాలేంటో ఈ కథనంలో తెలుసుకుందాం.



**హరిద్ర గణపతి**
పసుపు రంగు గురు గ్రహానికి ప్రతీక. హరిద్ర అంటే పసుపు అని అర్ధం. హరిద్ర గణపతి అంటే పసుపు కొమ్ము గణపతి అని అర్ధం. స్వచ్ఛమైన పసుపు కొమ్ము మీద గణపతి ఆకారాన్ని చెక్కి, ఆ గణపతిని పూజించిన గురు గ్రహ అనుగ్రహం కలుగుతాయి. జాతక చక్రంలో గురువు అనుకూలంగా లేని వారు పసుపు కొమ్ము గణపతిని పూజిస్తే వ్యతిరేక ఫలితాల నుంచి విముక్తి కలుగుతుంది.

**హరిద్ర గణపతి పూజ ఎలా చేయాలి?**
పూజామందిరంలో ఎరుపు లేదా పసుపు రంగు వస్త్రం పరిచి దానిపై పసుపుకొమ్ము గణపతిని ప్రతిష్ఠించాలి. పసుపు కొమ్ము గణపతికి దూపదీప నైవేద్యాలు సమర్పించి మనసులో ఉన్న కోరికను చెప్పుకోవాలి. "ఓం హరిద్ర గణపతాయనమః" అనే మంత్రాన్ని ప్రతిరోజు 108 సార్లు జపించాలి. గురు గ్రహ కారకత్వాల్లో సంతాన కారకత్వం ప్రధానమైనది. సంతాన సమస్యలు ఉన్నవారు పసుపు కొమ్ము గణపతిని పూజించడం మంచిది. ఈ పసుపు గణపతిని పూజించడం వెనుక ఒక కథ ఉంది.

**పసుపు కొమ్ము ఇలా పుట్టింది!**
త్రిపురాసురులనే ముగ్గురు రాక్షసుల లోకకంటకులై ప్రజలను పీడిస్తుండేవారు. చివరకు శివుని చేతిలో వారు ఓడిపోయిన, వారు ముగ్గురు ఏకకాలంలో మరణించేలా వరం ఇవ్వాలని శివుని కోరుకుంటారు. వారి కోరిక ప్రకారం వారిని ఒకే కాలంలో సంహరించే ప్రయత్నంలో నందీశ్వరుడు త్రి శృంగములు కలిగినవాడు కావున ముగ్గురిని తన శృంగముల్లో ఒకే కాలమందు పైకెత్తగా శివుడు తన త్రిశూలంతో వారి ముగ్గురిని ఏక కాలంలో సంహరిస్తాడు. ఈ సందర్భంగా జరిగిన ఒక చిన్న అపశ్రుతి వల్ల నంది మధ్య శృంగం త్రిశూల ఉధృతికి నేల రాలింది. పరమేశ్వరుని వరం వల్ల నేలరాలిన ఆ 'పశువు కొమ్ము', పసుపు కొమ్ముగా మారి తొలి పూజలందుకొనే విఘ్నేశ్వరుని మూర్తి రూపంగా హరిద్ర మూర్తిగా పూజలందుకుంటోంది.

అందుకే మనం ఏ పూజ చేసినా, ఏ వ్రతం చేసినా, ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా ఆరంభంలో పసుపు గణపతిని చేసి పూజించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం.

శుభానికి ప్రతీక పసుపు కొమ్ము గణపతి
గురుగ్రహం పసుపు వర్ణానికి అధిపతి. పసుపు కొమ్ము గణపతి శుభానికి ప్రతీక కావడం వల్ల మనం ఆరంభించే అర్చనాది కార్యక్రమాలు, ఆధ్యాత్మిక క్రతువులు శుభారంభాన్ని, మోక్ష కారకాన్ని కలుగజేస్తాయి. జ్యోతిష శాస్త్రంలో గురువు జ్ఞాన కారకుడు, సంతాన కారకుడు, గృహ సౌఖ్యం, ఆచారాలు మొదలైన వాటికి సంబంధించిన ఇబ్బందులు ఉన్నవారు పసుపు కొమ్ము గణపతిని పూజించడం మంచిది.

**గురువు అంటే?**
గురువు అంటే అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించేవాడని పురాణాలు చెబుతున్నాయి. జీవితంలో ఎదగడానికి, నిర్దేశించుకున్న ఆశయాలను నెరవేర్చుకోవడానికి అవసరమైన మార్గాన్ని సూచించి, ఆ దిశగా నడిపించేది గురువే. అలాంటి గురువు అనుగ్రహం కోసం దేవతల గురువైన 'బృహస్పతి'ని ప్రార్థిస్తుంటాం.

**వ్యాధుల నుంచి రక్షించే గురు గ్రహం**
గురు గ్రహం ఒక రాశి నుంచి బయలుదేరి తిరిగి అదే రాశికి చేరుకోవడానికి 'పుష్కర కాలం' పడుతుంది. మేధోపరమైన ఉన్నత లక్షణాలను ప్రసాదించే గురువు, కొన్ని రకాల వ్యాధుల బారిన పడటానికి కారకుడు అవుతుంటాడు. జాతకంలో గురువు స్థానం సరిగ్గా లేనప్పుడు కాలేయ సంబంధమైన వ్యాధులు సంక్రమిస్తుంటాయి. ఇక పైకి తెలియకుండా లోలోపల విస్తరించే షుగర్, కేన్సర్ వంటి వ్యాధులు కూడా గురువు అనుగ్రహం లేకపోవడం వల్లనే కలుగుతాయి. ఇలాంటి వారు పసుపుకొమ్ము గణపతిని పూజించడం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

**ఈ గురువులు పూజనీయులు**
జాతకరీత్యా గురు గ్రహం అనుకూలంగా లేనప్పుడు కలిగే దుష్ఫలితాల బారి నుంచి ఉపశమనం కోసం దత్తాత్రేయ స్వామి, రాఘవేంద్ర స్వామి, శిరిడీ సాయిబాబా, రామకృష్ణ పరమహంస వంటి గురువులను పూజించడం వల్ల బృహస్పతి అనుగ్రహాన్ని పరిపూర్ణంగా పొందవచ్చు.

**శివస్వరూపం**
సాక్షాత్తు పరమేశ్వరుని స్వరూపంగా భావించే

# కియా తన కియా కారెన్స్ క్లావిస్ కోసం ఫైనాన్సింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించింది.




దక్షిణ కొరియా కార్ల తయారీ సంస్థ కియా భారత్?లో తన 'మేడ్-ఇన్-ఇండియా' ఎలక్ట్రిక్ కారు 'కియా కారెన్స్ క్లావిస్ జుఎ' కోసం 'ధ్ఘ్వతీఎ-ఖం-ఖ-ావతీజఅఎవ' (ధ్ఘుఖ్గూ) ఫైనాన్సింగ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. జుఎ యాజమాన్యాన్ని సులభతరం చేయడమే లక్ష్యంగా కస్టమర్లకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చినట్లు కంపెనీ తెలిపింది
ఈ ప్రోగ్రాం వల్ల లాభం ఏంటి?: జుఎ ధరలో బ్యాటరీ అత్యంత ఖరీదైన భాగం. అయితే ఈ ప్రోగ్రాం ద్వారా, బ్యాటరీ ధరను చెల్లించకుండానే వాహనాన్ని కొనుగోలు చేయొచ్చు. దీనివల్ల వాహనం ప్రారంభ ధర తగ్గుతుంది. అయితే ఆ తర్వాత కిలోమీటర్? చొప్పున నగదు చెల్లించాల్సి ఉంటుంది.కొనడం ఇంకా సులభం': ఈ ధ్ఘుఖ్గూ ప్రోగ్రామ్ ప్రారంభంపై కియా ఇండియా చీఫ్ సేల్స్ ఆఫీసర్ సన్‌హాక్ పార్క్ మాట్లాడారు. "కియా ఇండియాలో సస్టైనబిలిటీ అంటే కేవలం ఎలక్ట్రిక్ కార్లు తేవడం మాత్రమే కాదు.. కస్టమర్లకు జుఎ వాడకాన్ని ఈజీగా, ప్రాక్టికల్‌గా మార్చే పూర్తి ఎకోసిస్టమ్‌ను తయారు చేయడం" అని ఆయన అన్నారు.ఈ క్రమంలో "బ్యాటరీ-యాజ్-ఎ-సర్వీస్ మోడల్ ఆ దిశగా వేసిన కీలక అడుగు. దీంతో తక్కువ ప్రారంభ ఖర్చుతో, ఎక్కువ ఆర్థిక వెసులుబాటుతో కస్టమర్లు అడ్వాన్స్‌డ్ జుఎ టెక్నాలజీని వాడుకోవచ్చు" అని పార్క్ తెలిపారు.ఆయన ఇంకా మాట్లాడుతూ.. "మా మొదటి మేడ్-ఇన్-ఇండియా ఎలక్ట్రిక్ వాహనం కియా కారెన్స్ క్లావిస్ జుఎతో మొదలుపెట్టి, భారత్‌లో ఒక స్మార్ట్, సస్టైనబుల్ మొబిలిటీని తీసుకురావాలన్న మా విస్తృత లక్ష్యానికి ఈ పథకం తొలి అడుగు" అని జోడించారు.కియా కారెన్స్ క్లావిస్ జుఎ ధ్ఘుఖ్గూ ఫైనాన్స్ ప్రోగ్రాం: కియా ఇండియా ఫ్లెక్సిబుల్ డ్యూయల్-లోన్ ఆప్షన్‌తో ద్వారా జుఎ యాజమాన్యాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావడానికి ధ్ఘుఖ్గూ ఫైనాన్స్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తోంది. విశేషమేంటంటే, ఈ పథకానికి దేశంలోని ప్రముఖ ఫైనాన్సర్లు మద్దతు ఇస్తున్నారు.ఈ కొత్త డ్యూయల్-లోన్ ఫైనాన్సింగ్ స్ట్రక్చర్ కింద ఛాసిస్, బ్యాటరీ కోసం వేర్వేరు లోన్ అకౌంట్లు ఉంటాయి. ఇది జుఎ యాజమాన్యంలో మరింత పారదర్శకత, సౌలభ్యాన్ని అందిస్తుంది.నివేదికల ప్రకారం, ఈ ప్రోగ్రామ్ ఒక ఫైనాన్సింగ్ ప్లాన్‌ను అందిస్తుంది. దీనిలో కియా కారెన్స్ క్లావిస్ జుఎ ఓనర్‌షిప్ కేవలం రూ. 51,520 నుంచి ప్రారంభమవుతుంది. దీనికి అదనంగా, కిలోమీటరుకు రూ. 3.3 చొప్పున ట్రాన్స్‌పరెంట్ బ్యాటరీ రీపేమెంట్ ప్లాన్ కూడా ఉంటుంది. ఇది కియా కారెన్స్ క్లావిస్ జుఎ ఓనర్‌షిప్ అనుభవాన్ని అవాంతరాలు లేనిదిగా, పూర్తిగా కస్టమర్-కేంద్రీకృతంగా మారుస్తుంది.

# టీనేజ్ అమ్మాయిలకు - పేరెంట్స్ ఈ విషయాలు అర్థమయ్యేలా చెప్పాలట!



టీనేజీలోకి అడుగుపెట్టేటప్పుడు అమ్మాయిల్లోనే కాదు, అమ్మల్లోనూ ఆందోళన మొదలవుతుంది. వాళ్లకి ఏది ఎంత వరకూ చెప్పాలి? ఏది చెప్పకూడదు? ఇలా ఎన్నో సందేహాలు, అపోహలు ఉంటాయి. చిన్నారులు బాల్యం నుంచి యవ్వనంలోకి అడుగుపెడుతున్న ఈ దశ ఎంతో కీలకం అంటున్నారు నిపుణులు. ఇప్పుడు ఏర్పరచుకునే అలవాట్లు, జీవనశైలి సూత్రాలే వాళ్ల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది అని చెబుతున్నారు. అందుకు పేరెంట్స్ ఈ సూత్రాలు పాటించాలని సూచిస్తున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!భావోద్వేగాలపరంగా : టీనేజ్?లోనే భావోద్వేగాల పరిణతి వస్తుందట. ప్రతిదీ ఈ దశలోనే నేర్చుకుంటారట. ఇలాంటప్పుడు విమర్శిస్తూ, కఠినంగా వ్యవహరిస్తే కుటుంబంతోనూ, తోటి పిల్లలతోనూ వాళ్లు ఎమోషనల్?గా దూరమవుతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తద్వారా తమ సమస్యలను చెప్పడానికి భయపడతారని అంటున్నారు. కాబట్టి, తప్పు సరిచేసే ముందు వాళ్ల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత పేరెంట్స్?దే అని చెబుతున్నారు. టీనేజీ పిల్లలను కుటుంబ సభ్యులను, టీచర్లు మరింతగా అర్థం చేసుకోవాలని సూచిస్తున్నారు. అపోహలు తొలగిస్తేనే : రుతుక్రమం... శారీరకంగా, మానసికంగా అమ్మాయిల్లో చాలా మార్పులే వస్తాయి. కాబట్టి, వాటి గురించి పీరియడ్స్ మొదలవ్వక ముందే పిల్లలకు అర్థమయ్యేలా లాజికల్?గా, మనసు నొప్పించకుండా చెప్పాలంటున్నారు నిపుణులు. అప్పుడే, మనసులో ఉన్న భయాలూ, అపోహలూ తొలగిపోయి, తనలో వస్తోన్న మార్పులను అర్థం చేసుకుంటారని చెబుతున్నారు.పాలకూరతో అందమైన చర్మం, పొడవైన జుట్టు? - నిపుణులు ఏం చెప్తున్నారంటే!శుభ్రత ముఖ్యమే : ఇక పీరియడ్స్ మొదలయ్యాక మరో కొత్త సవాలు ఎదురైవుతాయి. ముఖ్యంగా, పరిశుభ్రత, ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా ఉండాలంటే, ప్రతి 4-6 గంటలకు ఒకసారి ప్యాడ్ మార్చుకునేలా చూడాలంటున్నారు నిపుణులు. మెన్?స్ట్రువల్ కప్స్ వంటివి వాడుతుంటే వాటిని శుభ్రపరచడం, స్టెరిలైజ్ చేయడం వంటివి నేర్పించాలని చెబుతున్నారు. క్రమం తప్పకుండా స్నానం, దుస్తులు, లోదుస్తులు వంటివి మార్చుకోవడం అలవాటు చేయాలని సూచిస్తున్నారుఎదుగుదలకు తగినట్లుగా : ఎదిగే వయసులో అమ్మాయిలకు పోషకాహారం తప్పనిసరంటున్నారు నిపుణులు. ఎంత బిజీగా ఉన్నా సరే, మంచి ఆహారం అందించడం మాత్రం మర్చిపోవద్దని చెబుతున్నారు. అధిక ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, లో-ఫ్యాట్, లో-కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారం ఇవ్వాలని పేర్కొంటున్నారు. దీని గురించి ఒకరోజు ముందుగానే ప్రణాళిక వేసుకుంటే వాటి తయారీ సులభమవుతుందని వివరిస్తున్నారు.
నీళ్లు తాగుతున్నారా? : ఆహారం ఒక్కటే కాదు, సరైన మోతాదులో నీళ్లు తీసుకోవడం కూడా అంతే ముఖ్యమంటున్నారు నిపుణులు. క్లాస్, చదువుల్లో పడి స్కూల్లో నీళ్లు తాగడం మర్చిపోతారని చెబుతున్నారు. కాబట్టి, మీ పాప రోజుకి కనీసం 12 గ్లాసుల నీళ్లు తాగేలా చూసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే, చక్కెర లేని పండ్ల రసాలూ మంచివేని సలహా ఇస్తున్నారు. ఈ క్రమంలో కాఫీ, టీ, కార్బొనేటెడ్ డ్రింక్?లు, కృత్రిమ తీపి కలిగిన పానీయాలకూ దూరంగా ఉంచాలని తెలియజేస్తున్నారు.హార్మోన్లలో మార్పులు : టీనేజ్?లో అమ్మాయిల్ని ఇబ్బంది పెట్టే మరో సమస్య మొటిమలు ఒకటి. ఇవే వారిలో ఆత్మన్యూనతకూ దారితీస్తాయంటున్నారు నిపుణులు. కాబట్టి, ఇందుకు కారణం హార్మోనుల్లో మార్పులే అని పిల్లలకు అర్థమయ్యేలా చెబుతూనే వాటి గురించి జాగ్రత్తలూ చెప్పాలంటున్నారు. వాటిని గిల్లడం, వత్తడం లాంటివి చేయనీయకూడదని సూచిస్తున్నారు.వ్యాయామంతో : సిగ్గు, బిడియం లాంటి వల్ల టీనేజ్ అమ్మాయిలను ఆటలకు దూరం చేస్తున్నాయని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. కాబట్టి, ఆ ఫీలింగ్స్?ను పోగొట్టి వాళ్లు బయటకు వచ్చేలా ప్రోత్సహించాలంటున్నారు నిపుణులు. స్విమ్మింగ్, బాస్కెట్?బాల్, వాకింగ్, రన్నింగ్ ఇలా ఏదో ఒకదాన్లో భాగమయ్యేలా చూడాలని చెబుతున్నారు. వ్యాయామం అలవాటు చేయడం వల్ల భవిష్యత్తులో పిల్లలకు జీవనశైలి వ్యాధులు రాకుండా ఉంటాయని పేర్కొంటున్నారు.

శనివారం,
మే 16, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# ట్రంప్ కుంపటితో ఆర్థిక రంగం కుదేలు !



ఇరాన్‌పై దాడితో ప్రపంచ దేశాలను ప్రమాదంలో పడేసిన ట్రంప్ ఇంకా మేల్కొనలేదు. తనవల్ల ప్రపంచం అతలాకుతలం అయ్యిందే అన్న కించిత్ చింతన కూడా కానరావడం లేదు. పైపచ్చు..ఇరాన్‌ను భూమండలం మీద లేకుండా చేస్తామని కూడా ప్రకటించారు. ఇరాన్ సంగతి ఎలా ఉన్నా...భారత్ లాంటి దేశాలు చమురు ధరలతో విలవిల్లాడుతున్నాయి. ఆర్థిక సంక్షోభం తప్పేట్లుగా లేదు. చమురు రవాణా ఆగిపోవడంతో పాటు, ముడి చమురు ధరలు పెరగడంతో నానాయాతన పడాల్సి వస్తోంది. తాజాగా భారత్‌లో పెట్రీ, డీజిల్ దలరు పెరిగాయి. ఈ పెరుగుదల ఒక్క ఇంధనంపైనే ఉండదు. ఇకనుంచి అన్నిరంగాల పై దీని ప్రభావం పడుతుంది. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతాయి. విమానయాన రంగం ఇప్పటికే గగనకుసుమమైంది. ఇది మరింత ప్రమాదంలో పడనుంది. వెరసి సామాన్యుల బతుకులు భారం కానున్నాయి. పొదుపు మంత్రం ప్రకటించిన ప్రధాని మోడీ కాన్వాయ్‌లను తగ్గించారే తప్ప, అసలు పొందుపు విషయంలో మాట్లాడడం లేదు. దేశంలో ప్రజాప్రతినిధుల దుబారాను తగ్గించే ప్రయత్నాలపై ఎవ్వరు కూడా మాట్లాడడం లేదు. దీనికితో తోడు ఈ సంక్షోభం దృష్ట్యా ఐటి కంపెనీల్లో ఉద్యోగాల కోతలు మొదలయ్యాయి. రిక్రూట్‌మెంట్లు తగ్గాయి. ప్రధాని మోడీ ఇచ్చిన వర్క్‌ఫ్రమ్ హోమ్ విధానం అమలు సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. కరోనా సమయంలో విధిలేక ఆఫీసులు మూసుకున్న ఐటి కంపెనీలు ఇప్పుడు ఉద్యోగులను వర్క్‌ఫ్రమ్ హోమ్‌కు పరిమితం చేయదల్చుకోలేదు. దేశంలో పెరుగుతున్న ఇంధన వినియోగాన్ని తగ్గించి, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక కీలక ప్రతిపాదనను ముందుకు తీసుకువచ్చారు. ఉద్యోగులు వీలైనంత వరకు ఇంటి నుండే పని చేసే విధానాన్ని పాటించాలని ఆయన సూచించారు. ఈ నేపథ్యంలో, దేశీయ ఐటీ హబ్‌లలో ఒకటైన హైదరాబాద్‌పై ఈ నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం సుమారు 9 లక్షల మంది ఐటీ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో మెజారిటీ ఉద్యోగులు తమ కార్యాలయాలకు చేరుకోవడానికి ప్రతిరోజూ సగటున 50 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తున్నారు. ఈ సుదీర్ఘ ప్రయాణం వల్ల అటు ట్రాఫిక్ సమస్యలు పెరగడమే కాకుండా, భారీగా ఇంధనం ఖర్చవుతోంది. ప్రధాని సూచన మేరకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అమలు చేస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. హైదరాబాద్ ఐటీ రంగంలో ఈ విధానం వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలపై ప్రాథమిక అంచనాలు వెలువడ్డాయి. నగరంలోని మొత్తం ఐటీ ఉద్యోగులలో కనీసం సగం మంది, అంటే సుమారు 4.5 లక్షల మంది వారానికి కేవలం మూడు రోజులు ఇంటి నుండి పని చేసినా అద్భుతమైన ఫలితాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల నెలకు దాదాపు 140 కోట్ల రూపాయల విలువైన ఇంధనం ఆదా అయ్యే అవకాశం ఉందని అంచనా. ఇది దేశీయ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊరటనిస్తుందని భావిస్తున్నారు. ఇలా ఒక్కో నగరాన్ని తీసుకుంటే గణనీయమైన మార్పులు ఉంటాయని అంటున్నారు. కోవిడ్ సమయంలో వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం విజయవంతంగా అమలు జరిగినప్పటికీ, ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలు ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. పెద్ద కంపెనీలు ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తుండగా, కొన్ని చిన్న స్థాయి సంస్థలు మాత్రం ఈ విధానం వల్ల తమ ఉత్పాదకత దెబ్బతింటుందని లేదా ఇతర నష్టాలు వస్తాయని ఆందోళన చెందుతున్నాయి. ప్రభుత్వం నుండి స్పష్టమైన మార్గదర్శకాలు వస్తే తప్ప ఈ విషయంలో క్లారిటీ వచ్చేలా లేదు. కేవలం వర్క్ ఫ్రమ్ హోమ్ మాత్రమే కాకుండా, పెట్రోల్ , డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం కూడా అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఇంటి నుండే పని చేయడం వల్ల ఇంధన దిగుమతులు తగ్గి, అంతర్జాతీయ మార్కెట్‌లో భారత రూపాయి విలువ పెరగడానికి తోడ్పడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు దేశ ఆర్థిక భవిష్యత్తుకు ఈ 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానం ఒక కీలక మలుపు కానుంది. ఇకపోతే ఆర్థిక సంక్షోభం కారణంగా అనేక ఐటి కంపెనీలు కుదింపు మోజులో పడ్డాయి. ఎడాపెడా ఉద్యోగులను తొలగిస్తున్నాయి. గత నెలలో ప్రపంచవ్యాప్తంగా 30,000 మంది ఉద్యోగులను తొలగించిన అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీ ఒరాకిల్.. తాజాగా మరో షాకిచ్చింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) వంటి పలు ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ ప్రక్రియ ద్వారా విద్యార్థులకు జారీ చేసిన జాబ్ ఆఫర్ లెటర్లను, ప్రీ–ప్లేసమెంట్ ఆఫర్ల (పీపీఓ)ను కంపెనీ రద్దు చేసింది. ఒరాకిల్ తాజా నిర్ణయంతో ప్రభావితమైన కాలేజీల్లో ఎన్ఐటీ వరంగల్, వీఎన్ఐటీ నాగ్‌పూర్, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ రూర్కీ, ఐఐటీ బీహెచ్‌యూ కూడా ఉన్నాయి. ఆఫర్ లెటర్ల రద్దు విషయాన్ని కంపెనీ ఈ వారంలోనే విద్యార్థులకు వెల్లడించింది. దాంతో వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఎందుకంటే, చాలావరకు ఇంజనీరింగ్ కాలేజీలు ప్రాంగణ నియామకాల విషయంలో ఒక విద్యార్థి–ఒక ఉద్యోగం విధానాన్ని అనుసరిస్తున్నాయి. అంటే, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో ఒక కంపెనీ నుంచి జాబ్ ఆఫర్ అందుకున్న విద్యార్థికి ఇతర కంపెనీల ఆఫర్లను దక్కించుకునే అవకాశం ఉండదు. దాంతో ఒరాకిల్ ఆఫర్ కోల్పోయిన వారిప్పుడు కొత్త ఉద్యోగం కోసం అన్వేషించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమెరికన్ టెక్నాలజీ దిగ్గజాల్లో ఒకటైన సిస్కో కూడా భారీగా ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. వ్యాపార పునర్వ్యవస్థీకరణలో భాగంగా సిబ్బంది సంఖ్యను దాదాపు 4,000 మేర తగ్గించుకునే ఆలోచనలో ఉన్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ విషయాన్ని ప్రభావిత సిబ్బందికి నేరుగా తెలియజేయడం జరుగుతుందని కంపెనీ పేర్కొంది. సిస్కో కూడా తన పెట్టుబడులను కృత్రిమ మేధ (ఏఐ)తో పాటు వేగంగా వృద్ధి చెందుతున్న ఇతర విభాగాల వైపు పెట్టుబడులను మళ్లించే ప్రయత్నాల్లో ఉంది. మైక్రోసాఫ్ట్‌పరమైన వృత్తి నిపుణుల సోషల్ నెట్‌వర్కింగ్ ఎలాట్‌ఫామ్ లింక్డ్ఇన్ సైతం ఉద్యోగులను తగ్గించుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. వృద్ధి చెందుతున్న విభాగాలపై దృష్టిపెట్టేందుకు సిబ్బంది పునర్వ్యవస్థీకరించాలను కుంటున్న కంపెనీ.. అందులో భాగంగా 5 శాతం ఉద్యోగాలకు కోత పెట్టాలనుకుంటోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. లింక్డ్ఇన్‌లో ప్రపంచవ్యాప్తంగా 17,500 ఉద్యోగులు పనిచేస్తున్నారు. మొత్తంగా ట్రంప్ పెట్టిన కుంపటి ఇప్పట్లో చల్లారేలా లేదు. ప్రపంచ ఆర్థిక స్థితిని ఎంతగా దిగజారుస్తుందో ఇప్పుడే చెప్పలేం. భారత్ ఆర్థిక వ్యవస్థపై మాత్రం తీవ్ర ప్రభావం పడడం ఖాయమని చెప్పవచ్చు.

---

## వచ్చే ఏడాది నీట్ ఆన్‌లైన్ పరీక్ష

- లీకేజీని అరికట్టేందుకు చర్యలు
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్




**న్యూఢిల్లీ,మే15:** నీట్ పేపర్ లీక్ వ్యవహారం సంచలనం సృష్టించింది. దాంతో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి, మళ్లీ జూన్ 21న ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని వెల్లడించారు. జూన్ 21న నీట్ రీఎగ్జామ్ తేదీ ఖరారైంది. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై విచారణకు ఆదేశించాం. ఇప్పటికే ఈ కేసును సీబీఐ విచారిస్తోంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. వారు నష్టపోకూడదనే పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తున్నాం అని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండేలా చూడటమే మా మొదటి లక్ష్యం. పరీక్ష పారదర్శకంగా నిర్వహించడమే మా ప్రధాన కర్తవ్యం. ఏటా కోటి మందికి ఎన్టీఏ పరీక్షలు నిర్వహిస్తోంది. పేపర్ ఎలా లీక్ అయింది.. ఎవరి నుంచి ఎక్కడికి వెళ్లిందన్న పూర్తి వివరాలు పూర్తి బహిర్గతమవుతాయి. ఈసారి ఎలాంటి పరిస్థితుల్లోనూ మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూసుకుంటాం. రీటెస్ట్ కోసం విద్యార్థులు నచ్చిన నగరాన్ని ఎంచుకోవడానికి వారం రోజులు గడువు ఇస్తున్నాం. జూన్ 14న అడ్మిట్ కార్డులు విడుదల చేస్తాం. నీట్ కోసం మళ్లీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోన్న వార్తలు చూసి విద్యార్థులు ఆందోళన చెందొద్దని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.

## గతేడాది కూడా నీట్ ప్రశ్నాపత్రం లీక్

**లీక్ పేపర్లతో ప్రభుత్వ వైద్య కళాశాల్లో సీట్లు**

**టెన్త్. ఇంటర్‌లో అత్తెసరు మార్కులు వచ్చినా నీట్‌లో హవా**

**గతేడాది లీక్ ఆనవాళ్లపై దృష్టి సారించిన సిబిఐ**




**న్యూఢిల్లీ,మే15:** నీట్ 2026 పరీక్ష పత్రం లీకేజీపై దృష్టిపెట్టిన అధికారులకు గతేడాది లీక్ ఆనవాళ్లు బయట పడుతున్నాయి. కీలక నిందితుడైన వికాస్ బివాల్ గతేడాది యశ్ యాదవ్ నుంచి నీట్ ప్రశ్నపత్రం కొనుగోలు చేసినట్లు సీబీఐ అనుమానిస్తుంది. దీంతో ఈ యేడాది కూడా యశ్ నుంచే వికాస్ ఈ పేపర్‌ను కొన్నాడు. ఈ వ్యవహారంలో యశ్ తండ్రి మంగిలాల్ బివాల్, అంకుల్ దినేశ్ బివాల్ హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వికాస్ అతడి సోదరిలు ప్రగతి, కజిన్స్ సానియా, గుంజన్, పలాక్‌లు కూడా గతేడాది వైద్యవిద్య సీట్లు పొందారు. వీరంతా కూడా లీకైన పేపర్ సాయంతోనే సీట్లు సాధించినట్లు తెలుస్తోంది. వికాస్‌కు పదో తరగతిలో 63శాతం, 12వ తరగతిలో 55శాతం మార్కులు వచ్చాయి. ఇక 2024లో నీట్ పరీక్ష రాస్తే కేవలం 720కి గాను 240తో సరిపెట్టుకొన్నాడు. సికార్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో 46 పరీక్షలు రాస్తే సగటున 384 మార్కులు వచ్చాయి. కానీ, 2025లో మాత్రం 85.11 పర్సెంటైల్‌తో గవర్నమెంట్ కాలేజీలో సీటు సాధించడం విశేషం. ఇక ఆయన సోదరి ప్రగతి 10వ తరగతిలో 69శాతం , 12వ తరగతిలో 91శాతం మార్కులు వచ్చాయి. 2024 నీట్‌లో 720కి 355 మార్కులే వచ్చాయి. కానీ, సికార్‌లోని కోచింగ్ సెంటర్‌లో 50 నమూనా పరీక్షలు రాస్తే మార్కులు ఏనాడు 320– 342 దాటలేదు. కానీ, 2025లో హఠాత్తుగా 92.53 పర్సంటైల్‌తో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. ఇక మరో కజిన్ సోనియాకు 10వ తరగతిలో 63, 12వ తరగతిలో 89 మార్కులు వచ్చాయి. 2024 నీట్‌లో 320 మార్కులతో సరిపెట్టుకొంది. సికార్‌లోని కోచింగ్ సెంటర్‌లో 49 మాక్‌టెస్ట్‌లు రాస్తే 341–361 మధ్యే మార్కులు వచ్చాయి. అదే నీట్ పరీక్ష రాస్తే మాత్రం అలవోకగా 94.07 పర్సంటైల్‌తో ప్రభుత్వ కాలేజీలో సీటు పొందింది. ఇక పలాక్‌కు 10వ తరగతిలో 93శాతం, 12వ తరగతిలో 89 శాతంమార్కులు వచ్చాయి. 2024 నీట్‌లో 512 మార్కులు మాత్రమే సాధించింది. సికార్‌లోని కోచింగ్ సెంటర్లలో నిర్వహించిన 50 నమూనా పరీక్షల్లో ఆమెకు ఏనాడు 515–550 మార్కులు దాటలేదు. కానీ, 2025 నీట్‌లో 98.61 పర్సంటైల్‌తో జైపుర్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. ఇప్పుడు అదే కుటుంబం లోని రిషి కోసం పేపర్ కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అతడు 10వ తరగతిలో 43శాతం, 12వ తరగతిలో గ్రేస్ మార్కులు 50శాతం సాధించాడు.

## ఆదివారం నుంచి అధిక జేష్టమాసం

- పెళ్లిళ్లు తదితరాలకు నెలపాటు విరామం
- శుభముహూర్తాలకు బ్రేక వేళ తగ్గిన బంగారం ధరలు

**విజయవాడ,మే15:** అధిక జేష్టమాసంతో శుభముహూర్తాలు అయిపోయాయి. మరో నెలరోజుల తరవాతనే పెళ్లి తదితర ముహూర్తాలకు ఛాన్స్ ఉంది. గురువారం నుంచి అన్నిరకాల శుభ ముహూర్తాలు ముగిసాయని పండితులు చెబుతున్నారు. ఫిబ్రవరి నుంచి మే 13 వరకూ తెలుగు లోగిళ్ళను వివిధ రకాల శుభకార్యాలతో కళకళలాడాయి. ఇప్పుడు ముహూర్తాలు నెల రోజల పైబడి లేవని సెలవిచ్చారు. ఆదివారం నుంచి అధిక జ్యేష్ట మాసం రానుండడంతో జూన్ 20 వరకూ మంచి రోజులు లేవని పురోహితులు చెపుతున్నారు.జూన్‌లో చివరి 8 రోజులు మంచి ముహూర్తాలున్నాయని పండితులు వివరిస్తున్నారు. జూలైలో మరో నాలుగు రోజులు మాత్రమే ముహూర్తాలున్నాయిని ఆ తరువాత చతుర్మాసం తదితర కారణాలతో ఆగస్టులో 11 రోజులు, సెప్టెంబరులో 4, అక్టోబరులో మరో 4 రోజులు మాత్రం ముహూర్తాలున్నా చతుర్మాసం అడ్డొస్తోందని పురోహితులు అంటున్నారు. ఆ తరువాత నవంబరులో కార్తీక మాసం కారణంగా 11 రోజులు, డిసెంబరులో మరో 14 రోజుల్లో కూడా అనువైన ముహూర్తాలున్నాయంటున్నారు. దీంతో పెళ్లిళ్లపై ఆధారపడ్డ వారు ,ఇతర కార్యక్రమాలపై ఆధారపడ్డ వారికి ఖాళీగా ఉండాల్సిన ఆగత్యం ఏర్పడింది. కారణం ఏదైనా భారత్‌లో బంగారం ధరల ర్యాలీకి బ్రేక్ పడినట్టు కనిపిస్తోంది. అంతర్జాతీయ అనిశ్చితులు, కేంద్రం దిగుమతి సుంకాల పెంపు నేపథ్యంలో బంగారం, వెండి ధరల్లో భారీ కోత కనిపించింది.




గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శుక్రవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,60,090కు పడిపోయింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధరలో ఏకంగా రూ.2,240ల మేర కోత పడింది. 22 క్యారెట్ల పసిడి ధర కూడా రూ.1,46,750కు చేరుకుంది. నిన్నటితో పోలిస్తే ధర రూ.2,050ల మేర తగ్గింది. నగరంలో వెండి ధరలో కూడా రూ.10 వేల కోత పడింది. ప్రస్తుతం కిలో వెండి రూ.3.05 లక్షల వద్ద ట్రేడవుతోంది ఇతర ప్రధాన నగరాల విషయానికి వస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,63,390గా ఉంది. ఢిల్లీలో రూ.1,60, 240గా, ముంబైలో రూ.1,60,090 వద్ద కొనసాగుతోంది. చెన్నైలో 22 క్యారెట్ల ఆర్నమెంటల్ పసిడి ధర రూ.1,49,500గా, ఢిల్లీలో రూ.1,46,900గా, ముంబైలో రూ.1,46,750గా ఉంది. చెన్నై సహా పలు నగరాల్లో వెండి దర రూ.3.05 లక్షల వద్ద ట్రేడవుతోంది. నిన్నటితో పోలిస్తే దేశంలో కిలో వెండి ధర రూ.10 వేల మేర తగ్గింది.

## కర్జెల్లిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణమహోత్సవం

- ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయా సాధనకై కృషి చేయాలి
- సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు



**కొమరంభీమ్ ఆసిఫాబాద్ :మే 15**
:కొమరంభీమ్ఆసిఫాబాద్ జిల్లా చింతల మానేపల్లి మండలంలోని కర్జెల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన హిందూ హృదయ సామ్రాట్ చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని సిర్పూర్ శాసనసభ్యులు డా.పా ల్వా యి హరీష్ బాబు.ఆవిష్కరించారు.ఈ సంద ర్భ ంగా వారు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహా రాజ్ స్ఫూర్తితో సనాతన హైందవ ధర్మ పరిరక్షణ కోసం అందరూ నడుంబిగించాలని పిలుపునిచ్చారు. గో సంరక్షణతో, పాటు కుటుంబ విలువలను పాటించడం కూడా ధర్మ పరిరక్షణలో భాగమేనని తెలిపారు.కర్జెల్లి గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆరె కులస్తులు ఎదుర్కొంటున్న ఓబీసీ సర్టిఫికెట్ సమస్యను పరిష్కరిస్తామని, వారి అండగా నిలుస్తామని తెలిపారు..ఈ కార్యక్రమం లో అరే కుల సంఘం కమిటీ నిర్వాహకులు,,అరేకుల సంఘం నాయకులు,గ్రామస్తులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు హైదరాబాద్ లో,33జిల్లాల ఉద్యమకారుల రాష్ట్ర స్థాయి సదస్సుని విజయవంతం చేయాలని పిలుపు

- స్థలం :బషీర్ బాగ్ సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియం హైదరాబాద్..
- తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్....



**ఉమ్మడి ఆదిలాబాద్ :మే 15** :తెలంగాణ రాష్ట్రం లోని 33జిల్లాల ఉద్యమకారులు నేడు నిర్వహిస్తున్న ఉద్యమకారుల రాష్ట్ర స్థాయి సదస్సుకు,ఉద్యమంలో పాల్గొన్నఉద్యమకారులు హైదరాబాద్ లోని బషీర్ బాగ్ సురవరం ప్రతాప్ రెడ్డి ఆడి టో రియము నేడు 2026మే 16న మధ్యాహ్నం 2గంటల నుండి 5గంటల వరకు జరిగే ఉద్యమకారుల రాష్ట్ర స్థాయి సదస్సు ను విజయవంతం చేయాలని సంఘం చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు. గోదావరి ఖనిలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఉద్యమకారుల హక్కుల సాధనకై 33జిల్లాలవ్యాప్తంగా ఉద్యమకారులు తెలంగాణ రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులు సదస్సు కు హాజరు కావాలని, ఉద్యమకారుల రాష్ట్ర వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లోవైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డు రవీందర్, నూతీ. తిరుపతి, కళావతి, పర్య స్వాతి, తోడేటి స్వరూప, అనిత, చౌదరి, కనక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు..

## సాలూరు టౌన్ లో డ్రోన్ సర్వైలెన్స్ నిర్వహణ



**పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మే 15**
పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు అధికారి ఎస్.వి. మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం సాలూరు టౌన్ పోలీస్ వారు పట్టణ పరిధిలోని పలు సున్నిత, అనుమానాస్పద ప్రాంతాల్లో డ్రోన్ సర్వైలెన్స్ నిర్వహించారు.పట్టణంలోని నిర్జన ప్రదేశాలు, బ్లాక్ స్పాట్లు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, వేగావతి నది పరివాహక ప్రాంతం, బంటి స్టేడియం, ఇతర ముఖ్య ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా గగనతల పర్యవేక్షణ చేపట్టబడింది.ఈ సర్వైలెన్స్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం అక్రమ కార్యకలాపాలు, మత్తు పదార్థాల వినియోగం, రవాణా, అనుమానాస్పద వ్యక్తుల సంచారం, జూదం, ఆన్‌లైన్ బెట్టింగ్, అక్రమ మద్యం విక్రయాలు వంటి చట్ట విరుద్ధ చర్యలను గుర్తించి నివారించడం.డ్రోన్ పర్యవేక్షణ ద్వారా పరిస్థితిని సమీక్షించి, అనుమానాస్పద కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగించబడుతుంది. అవసరమైతే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.సాలూరు పట్టణంలో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు ఇటువంటి ప్రత్యేక నిఘా చర్యలు నిరంతరం కొనసాగించబడతాయి. ప్రజలు ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే సాలూరు టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించగలరు.సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్సాలూరు టౌన్ పోలీస్ స్టేషన్ బొమ్మిడి అప్పలనాయుడు మీడియాకు తెలిపారు.

## దోమలపై దండయాత్ర "లార్వా వేట"



**పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు, మే 15,** మన్యం జిల్లా మున్సిపాలిటీలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పురపాలక ప్రత్యేక అధికారి సి. యశ్వంత్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులతో సాలూరు మున్సిపాలిటీ శ్రీ రామా కాలనీ, బంగారమ్మ కాలనీ లో సందర్శించారు "లార్వా వేట" కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన మున్సిపాలిటీ వార్డుల్లో అమలు చేయాలని స్పష్టం చేశారు.జాయింట్ కలెక్టర్ , ప్రత్యేక అధికారి సాలూరు పురపాలక సంఘం వారు మాట్లాడుతూ:ప్రతి వార్డులో డ్రైనేజీలు క్లీనింగ్, పారిశుధ్య పనులు చురుగ్గా సాగాలని ఆదేశించారు నీరు నిల్వ ఉన్న ప్రతి ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.ప్రతి శుక్రవారాల్లో వార్డులకు సంబంధించిన హెల్త్ సిబ్బంది ఇంటింటా హేబిటేషన్ వారీగా "లార్వా వేట" నిర్వహించాలని సూచించారు.కార్యక్రమాన్ని ఉదయం 11 గంటలలోపు లేదా సాయంత్రం 4 గంటల తర్వాత చేపట్టాలని తెలిపారు.నీరు నిల్వ ఉన్న ప్రతి చోట తప్పనిసరిగా "ఆయిల్ బాల్స్" వేయాలని ఆదేశించారు.లార్వా నివారణలో నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.ప్రజారోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు:మున్సిపల్ కమిషనర్ ఈ కార్యక్రమంపై పూర్తి బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారుహెల్త్ ఆఫీసర్ , ఏఎన్ఎం లు,హెల్త్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని సూచించారు.జ్వరాల నివారణకు ముందస్తు చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని తెలిపారు."ప్రజారోగ్య పరిరక్షణలో ప్రతి అధికారి అప్రమత్తంగా పనిచేయాలి" అని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

## వ్యవసాయ కార్మికుల సదస్సు లో బలగ రాధ



**పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు, మే 15,** :పార్వతిపురం మన్యం జిల్లా వీరఘట్టంలో వ్యవసాయ కార్మిక శాఖ జిల్లా కార్యదర్శి గౌతు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మికులతో సదస్సును ఏర్పాటు చేయడం జరిగినది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ పార్వతిపురం మన్యం జిల్లా కార్యదర్శి బలగరాధనాయుడు మాట్లాడుతూ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకాన్ని జి రాంజీ పథకంగా మార్చడం వలన గ్రామీణ అభివృద్ధికి కావలసిన నిధులు కేంద్ర కేంద్ర ప్రభుత్వం నుండి తగ్గిపోయే అవకాశం ఉందని అందువలన ఉపాధి హామీ లో పనిచే వర్కర్స్ కు కూడా నిధులు తగ్గడం వలన 120 రోజులు పని కూడా కష్టంగా మారుతుందని కాబట్టి అటు గ్రామీణ అభివృద్ధిని ఇటు ఉపాధి హామీలో పని చేసే వారికి నష్టం కలగకుండా ఉండాలంటే ప్రభుత్వం ఈ జి రామ్ జి పథకాన్ని రద్దు చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున పోరాటం చేయటానికి సిద్ధం కావాలని రైతులకు పిలుపునిచ్చారు.

# పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే ఈ యోగాసనాలను రోజూ వేయాలి




పిల్లల ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగకరమని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం పిల్లలు చదువులు, స్క్రీన్ టైమ్, ఆటలు వంటి అనేక పనులతో బిజీగా గడుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో కొన్ని సులభమైన యోగా ఆసనాలు వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. యోగా వల్ల కండరాలు బలపడటంతో పాటు శరీర సమతుల్యత, శ్వాస నియంత్రణ కూడా మెరుగుపడుతుంది. అలాగే ప్రతిరోజూ యోగా చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడం, మంచి నిద్ర రావడం, ఆత్మవిశ్వాసం పెరగడం వంటి ప్రయోజనాలు కూడా ఉంటాయని చెబుతున్నారు. పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే కొన్ని సులభమైన యోగాసనాల గురించి నిపుణులు వివరిస్తున్నారు.తాడాసనం, బాలాసనం..తాడాసనం పిల్లలకు మంచి ప్రారంభ ఆసనం అని చెప్పవచ్చు.. ఈ ఆసనంలో పాదాలను కలిపి నిటారుగా నిలబడాలి. చేతులను పైకి ఎత్తి శరీరాన్ని పైవైపు చాపాలి. కొద్దిసేపు లోతుగా శ్వాస తీసుకుంటూ ఈ స్థితిలో ఉండాలి. ఇది శరీర భంగిమను మెరుగుపరచడంతో పాటు పిల్లల్లో స్థిరత్వాన్ని పెంచుతుంది.వృక్షాసనం చెట్టులా నిలబడే ఆసనం. ఒక కాలిపై నిలబడి మరో కాలును తొడ భాగానికి ఆనించాలి. చేతులను నమస్కార ముద్రలో ఉంచి కొద్దిసేపు నిలబడాలి. తరువాత మరో కాలితో కూడా చేయాలి. ఈ ఆసనం పిల్లల్లో ఏకాగ్రత, సమతుల్యతను పెంచడంలో సహాయపడుతుంది. కాళ్ల కండరాలు కూడా బలపడతాయి. అలాగే బాలాసనం పిల్లలకు మానసిక ప్రశాంతతను అందించే ఆసనం. మోకాళ్లపై కూర్చుని ముందుకు వంగి నుదిటిని నేలపై ఉంచాలి. చేతులను ముందుకు చాపి కొద్దిసేపు నెమ్మదిగా శ్వాస తీసుకోవాలి. ఈ ఆసనం వెన్ను, భుజాలు, నడుము భాగాల్లో ఒత్తిడిని తగ్గించడంలో ఉపయోగపడుతుంది.
అధోముఖ శ్వాసాసనం..అధోముఖ శ్వాసాసనం శరీరాన్ని ఇంగ్లీష్ అక్షరం ఎ ఆకారంలో ఉంచే ఆసనం. చేతులు, కాళ్లు నేలపై ఉంచి నడుమును పైకి ఎత్తాలి. కొద్దిసేపు ఈ స్థితిలో ఉండాలి. ఇది చేతులు, భుజాలు, వెన్ను భాగాన్ని బలపరుస్తుంది. పిల్లల్లో శరీర సమన్వయాన్ని కూడా మెరుగుపరుస్తుంది. భుజంగాసనంను కోబ్రా పోజ్‌గా కూడా పిలుస్తారు. పొట్టపై పడుకుని చేతుల సహాయంతో ఛాతిని పైకి ఎత్తాలి. ఈ ఆసనం వెన్నెముకను బలపరచడంలో సహాయపడుతుంది. అలాగే శ్వాస సామర్థ్యాన్ని పెంచి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బద్ధకోణాసనం లేదా బటర్‌ఫ్లై పోజ్‌లో కాళ్ల పాదాలను కలిపి మోకాళ్లను బయటకు వంచాలి. చేతులతో పాదాలను పట్టుకుని మోకాళ్లను సున్నితంగా కదిలించాలి. ఇది నడుము భాగానికి మంచి స్ట్రెచ్ ఇస్తుంది. జీర్ణక్రియకు కూడా మేలు చేస్తుంది.శవాసనం..శవాసనం పిల్లలకు విశ్రాంతిని అందించే ముఖ్యమైన ఆసనం. నేలపై సూటిగా పడుకుని చేతులు, కాళ్లు సడలించి కళ్లను మూసుకోవాలి. కొద్దిసేపు నెమ్మదిగా శ్వాస తీసుకుంటూ విశ్రాంతి తీసుకోవాలి. ఇది ఒత్తిడిని తగ్గించి మంచి నిద్రకు సహాయపడుతుంది. మర్జరాసనం-బిటిలాసనం లేదా క్యాట్-కౌ పోజ్ వెన్నెముకకు మంచి వ్యాయామంగా పనిచేస్తుంది. నాలుగు కాళ్ల స్థితిలో ఉండి శ్వాస తీసుకుంటూ వెన్నును కిందికి వంచాలి. శ్వాస వదులుతూ వెన్నును పైకి వంపుగా మార్చాలి. ఈ కదలికలను కొన్ని సార్లు చేయాలి. ఇది శరీర భంగిమను మెరుగుపరచడమే కాకుండా జీర్ణక్రియకు కూడా సహాయపడుతుంది. ఈ విధంగా రోజూ ఈ ఆసనాలు వేయడం వల్ల పిల్లలు శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారవుతారని నిపుణులు చెబుతున్నారు.

# చియా సీడ్స్, గుమ్మడి విత్తనాలు వంటి సీడ్స్‌ను రోజులో ఏ సమయంలో ఎలా తీసుకుంటే మేలు చేస్తాయి..?



నేటి తరుణంలో ఆరోగ్యం మీద అవగాహన రావడంతో చాలా మంది విత్తనాలను ఆహారంగా తీసుకుంటున్నారు. విత్తనాలు చాలా మందికి ఇప్పుడు ఆరోగ్యకరమైన ఆహారంలో ముఖ్యమైన భాగంగా మారిపోయాయని చెప్పవచ్చు. చియా సీడ్స్ నుంచి గుమ్మడి గింజలు, సన్‌ఫ్లవర్ సీడ్స్ వరకు చాలామంది రోజూ తీసుకుంటున్నారు. వీటిలో ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటంతో శరీరానికి ఎన్నో ప్రయోజనాలు అందుతాయి. అయితే వీటిని సరైన సమయంలో, సరైన విధంగా తీసుకోకపోతే పూర్తి పోషకాలు శరీరానికి అందకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. చిన్న చిన్న మార్పులతోనే వీటి ప్రయోజనాలను మరింతగా పొందవచ్చని సూచిస్తున్నారు. ఏయే విత్తనాలను ఎలా, ఎప్పుడు తీసుకోవాలో వారు వివరిస్తున్నారు.చియా సీడ్స్..చియా సీడ్స్ ప్రస్తుతం ఎక్కువగా ఉపయోగిస్తున్న విత్తనాలలో ఒకటి. ఇవి ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు. ఇందులో ఉండే సొల్యూబుల్ ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అలాగే రోజంతా రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలో కూడా ఉపయోగపడుతుంది. ఇది శరీరంలో శక్తి సమతుల్యతకు, కొవ్వు తగ్గించుకోవడానికి తోడ్పడుతుంది. అలాగే చియా సీడ్స్‌ను నేరుగా తినడం కంటే ముందుగా నీటిలో నానబెట్టడం మంచిదని సూచిస్తున్నారు. ఒక గ్లాస్ నీటిలో వేసి కొంతసేపు ఉంచితే అవి విస్తరించి జెల్‌లా మారతాయి. ఆ తరువాత అదే నీటితో కలిసి తీసుకుంటే శరీరం పోషకాలను సులభంగా గ్రహిస్తుంది.
పొద్దు తిరుగుడు, గుమ్మడి విత్తనాలు..సన్‌ఫ్లవర్, గుమ్మడి విత్తనాలను చాలామంది ఎప్పుడైనా స్నాక్‌లా తింటుంటారు. అయితే మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య తీసుకుంటే మరింత ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు. మధ్యాహ్న భోజనంలో ఉండే మంచి కొవ్వులు ఈ విత్తనాల్లోని జింక్, మెగ్నీషియం వంటి ఖనిజాలను శరీరం బాగా గ్రహించేందుకు సహాయపడతాయి. ఈ విత్తనాలను తేలికగా డ్రై రోస్ట్ చేసి తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల వాటి పోషకాలు నిల్వ ఉండటమే కాకుండా జీర్ణం కావడం కూడా సులభమవుతుంది. అదే విధంగా బేసిల్ సీడ్స్ వేసవిలో ఎక్కువగా ఉపయోగపడే విత్తనాలుగా భావిస్తారు. ఇవి శరీరానికి చల్లదనాన్ని అందించడంలో సహాయపడతాయి. మధ్యాహ్న భోజనం ముందు, అంటే మిడ్ మార్నింగ్ సమయంలో తీసుకుంటే శరీరం పోషకాలను బాగా గ్రహిస్తుందని నిపుణులు చెబుతున్నారు.బేసిల్ సీడ్స్..వేసవిలో శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడంలో కూడా బేసిల్ సీడ్స్ కూడా ఉపయోగపడతాయి. ఈ సీడ్స్‌ను కూడా ముందుగా నీటిలో నానబెట్టాలి. అవి విస్తరించిన తర్వాత తీసుకుంటే చల్లదనంతో పాటు హైడ్రేషన్ ప్రయోజనాలు మరింతగా అందుతాయి. విత్తనాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసినా, వాటిని ఎలా తీసుకుంటున్నామన్నది కూడా అంతే ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. సరైన సమయంలో తీసుకోవడం, కొన్ని విత్తనాలను నానబెట్టి తీసుకోవడం వల్ల ఫైబర్, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరానికి మెరుగ్గా అందుతాయి. కాబట్టి ఇకపై విత్తనాలను తీసుకునేటప్పుడు సమయం, విధానం రెండింటినీ గమనిస్తే పొందవచ్చని వారు సూచిస్తున్నారు.

## వేసవిలో ఆరోగ్యంగా ఉండాలంటే ఉదయాన్నే ఈ నీరు తాగండి



వేసవిలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఎక్కువ వేడి కారణంగా శరీరంలో నీటి శాతం తగ్గి అలసట, నీరసం, జీర్ణ సమస్యలు రావచ్చు. అందుకే శరీరాన్ని చల్లగా ఉంచే పానీయాలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాంటి వాటిలో ఎండుద్రాక్ష, సోంపు నానబెట్టిన నీరు కూడా ఒకటి.ఆయుర్వేదం ప్రకారం సోంపు, ఎండుద్రాక్ష రెండింటికీ శరీరానికి చల్లదనం ఇచ్చే గుణాలు ఉన్నాయి. వీటిని రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయాన్నే ఆ నీటిని తాగితే ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు కలుగుతాయి. ఒక గ్లాసు నీటిలో1 టీస్పూన్ సోంపు, 4 నుంచి 5 ఎండుద్రాక్షలు వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం ఆ నీటిని వడకట్టి తాగాలి. తర్వాత ఎండుద్రాక్షలను నమిలి తినాలి.సోంపు -- ఎండుద్రాక్ష పోషకాలుసోంపులో కాల్షియం, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాలు ఉన్నాయి. ఇవి జీర్ణక్రియకు సహాయపడటంతో పాటు శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. ఎండుద్రాక్షలో ఐరన్, సహజ చక్కెరలు, ఫైబర్, కాల్షియం, విటమిన్లు వంటివి ఉన్నాయి. ఇవి శక్తిని పెంచి, నీరసం తగ్గించడంలో సహాయపడతాయి.ప్రయోజనాలు శరీరాన్ని చల్లగా ఉంచుతుంది సోంపు శరీరానికి చల్లదనం ఇస్తుంది. ఎండుద్రాక్ష కూడా డీహైడ్రేషన్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. వేసవిలో ఈ నీరు తాగితే వడదెబ్బ, అధిక వేడి ప్రభావం తగ్గే అవకాశం ఉంటుంది.
జీర్ణక్రియ మెరుగుపడుతుంది గ్యాస్, ఎసిడిటీ, ఉబ్బరం వంటి సమస్యలను తగ్గించడంలో సోంపు సహాయపడుతుంది. ఎండుద్రాక్షలో ఉండే ఫైబర్ మలబద్ధకం తగ్గించడంలో ఉపయోగపడుతుంది. దీంతో కడుపు తేలికగా ఉంటుంది.
శక్తిని పెంచుతుంది ఎండుద్రాక్షలో సహజ చక్కెరలు, ఐరన్ ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. అలసట, నీరసం తగ్గించడంలో సహాయపడతాయి.చర్మానికి మేలు చేస్తుందిఈ నీటిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని విషపదార్థాలను బయటకు పంపడంలో సహాయపడతాయి. దీంతో చర్మం కాంతివంతంగా కనిపించే అవకాశం ఉంటుంది. మొటిమలు, పొడి చర్మం వంటి సమస్యలు కూడా తగ్గవచ్చు.

## వేసవిలో ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టే.. ఇంటి చిట్కాలు



ఏప్రిల్ నెల నుంచి ఎండలు దంచికొడుతున్నాయి. మండే ఎండలు, వేడి గాలులు, చెమట కారణంగా శరీరం త్వరగా అలసిపోతుంది. సమ్మర్ సీజన్‌లో శరీరంలో నీటి శాతం తగ్గిపోవడం వల్ల డీహైడ్రేషన్, తలనొప్పి, నీరసం, చర్మ సమస్యలు, జీర్ణ సమస్యలు, హీట్ స్ట్రోక్ వంటి అనేక ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. మన ఇంట్లోనే అందుబాటులో ఉండే కొన్ని సహజ పదార్థాలు, సరైన ఆహార అలవాట్లు, తగినంత నీరు తీసుకోవడం, చిన్న చిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చు.తగినంత నీరు తీసుకోవాలి:వేసవిలో శరీరం చెమట ద్వారా ఎక్కువ నీటిని కోల్పోతుంది. అందుకే తరచుగా నీరు తాగడం చాలా ముఖ్యం. కొబ్బరి నీరు, గ్లూకోజ్ నీరు, మజ్జిగ తీసుకుంటే శరీరానికి చల్లదనం లభిస్తుంది.సహజ పానీయాలు:నిమ్మరసం, జీలకర్ర నీరు, సబ్జా నీళ్లు, రాగి జావ వంటి పానీయాలు శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తాయి.నీటి శాతం ఎక్కువగా ఉన్న పండ్లు తినాలి:పుచ్చకాయ, దోసకాయ, మస్క్‌మెలన్, నారింజ వంటి పండ్లు వేసవిలో శరీరానికి తేమను అందిస్తాయి.పెరుగు, మజ్జిగ తప్పనిసరి:ప్రతి రోజు భోజనంలో పెరుగు లేదా మజ్జిగ తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. శరీరం చల్లగా ఉంటుంది. అలాగే, ఉదయాన్నే రాగి జావ తాగడం వల్ల రోజంతా శరీరం చల్లగా ఉంటుంది.చర్మ సంరక్షణకు సహజ మార్గాలు:అలోవెరా జెల్, చందనం పేస్ట్, రోజ్‌వాటర్ వంటివి చర్మానికి చల్లదనం ఇస్తాయి. ఎండ వల్ల వచ్చే మంట, దురద తగ్గుతాయి. ఎండ నుంచి రాగానే ముఖానికి కలబంద జెల్ రాసుకుంటే చర్మం చల్లబడి, మంట తగ్గుతుంది.హీట్ స్ట్రోక్ లక్షణాలు కనిపిస్తే:తల తిరగడం, అధిక చెమట, అలసట అనిపిస్తే వెంటనే చల్లని ప్రదేశంలో విశ్రాంతి తీసుకోవాలి. ఓ౼ఆ లేదా ఉప్పు-చక్కెర కలిపిన నీరు తాగాలి.
తేలికపాటి ఆహారం మంచిది:వేసవిలో ఎక్కువగా ఆయిల్, మసాలా ఆహారం తీసుకుంటే శరీర వేడి పెరుగుతుంది. ఆకుకూరలు, పండ్లు, ఉడికించిన ఆహారం మంచిది.

# సంచలనాల సమాజం

సమాజానికి అంతా తెలుసు..
ఏ కుర్రాడు ఏ అమ్మాయితో తిరుగుతున్నాడు
ఎవరి ఇంట్లో గొడవల గోల జరుగుతోంది
ఏ ఆడది బరి తెగించి తిరుగుతోంది
ఏ మగాడు ఏ అక్రమానికి పాల్పడ్డాడు
ఎక్కడ అత్త కోడళ్లు కొట్లాడుతున్నారు
ఎవ్వరు తాగి బజార్లో పడిపోయారు
సంచలన వార్తలన్నీ క్షణాల్లో వైరల్ అవుతాయి !

కాని....
ఏ ఇంట్లో తినడానికి తిండి లేదు
పేదరికంతో ఏ అమ్మాయి చదువు మానేసింది
ఏ రోగి వైద్యం లేక చావుబతుకులో ఉన్నాడు
ఏ ముసలి అన్నం లేక పస్తులున్నాడు
ఏ తల్లిదండ్రుల్ని సుపుత్రులు అనాథల్ని చేశారు
ఏ కూతురు పెళ్ళి కట్నం ఇవ్వలేక ఆగిపోయింది
అలాంటివేవీ జనులకు అవసరం లేదు
మరొకరి ఏడుపు మన నవ్వుకు కారణం కావద్దు
సమాజానికి సహానుభూతి బోధిద్దాం
మానవీయ విలువలను తట్టి లేపుదాం
విశ్వ మానవాళి శ్రేయస్సు కాంక్షిద్దాం !

మధుపాళీ

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘోర ప్రమాదం...

### బస్సు, కారు, ద్విచక్ర వాహనం ఢీ..

**వేములవాడ:**రాజన్న సిరిసిల్ల జిల్లాలోనిగంభీరావుపేట మండలం సముద్ర లింగాపూర్ సమీపంలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రతిమ విజ్ఞాన విద్యా సంస్థకు చెందిన బస్సు, కారు బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సముద్ర లింగాపూర్ శివారులో ఈ ప్రమాదం సంభవించింది. ఢీకొన్న ధాటికి కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను వాహనం నుండి బయటకు తీసి, చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల పేరుతో ఏటా ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా, ఆచరణలో మాత్రం ఫలితం శూన్యంగా కనిపిస్తోంది. అవగాహన సదస్సులు కేవలం ఫొటోలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల అమలులో అధికారుల పర్యవేక్షణ లోపించడం, వాహనదారుల్లో నిర్లక్ష్యం పెరగడం ప్రమాదాలకు ప్రధాన కారణమవుతోంది. జిల్లాలో రోజురోజుకూ రోడ్డు ప్రమాదాల సంఖ్య ఆందోళనకరంగా పెరుగుతోంది. ముఖ్యంగా యువత అతివేగంతో వాహనాలు నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, కారులో సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం వంటి ఉల్లంఘనలు ప్రాణాల మీదకు తెస్తున్నాయి. వేగం కంటే ప్రాణం మిన్న అనే నిజాన్ని విస్మరించి, ఒక్క క్షణం చేసే నిర్లక్ష్యం ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోంది.


# వేములవాడ భీమేశ్వర స్వామిని దర్శించుకున్న టీజీఎస్‌సీపీసీఆర్ చైర్‌పర్సన్, మరియు సభ్యులు





**వేములవాడ:**తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంఅనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని తెలంగాణ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ చైర్‌పర్సన్ శ్రీమతి సీతా దయాకర్ రెడ్డి మరియు సభ్యులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు శ్రీమతి మర్రిపల్లి చందన శ్రీమతి వందన గౌడ్ శ్రీమతి బండి అపర్ణ శ్రీ వచన్ కుమార్ రెడ్డి శ్రీమతి గోగుల సరిత శ్రీమతి ప్రేమలత అగర్వాల్ లు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి మండపంలో వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ డీఈఓ భాస్కర్ శర్మ గారు వారికి లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏఈఓ జి. అశోక్ , ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాసశర్మ వి. వెంకట ప్రసాద్ ఆలయ ఉద్యోగులు మరియు వేద పండితులు నెమలికొండ ఉమేష్ శర్మ ఘర్షకుర్తిశ్రీధర్ శర్మపాల్గొన్నారు

# మాస శివరాత్రి సందర్భంగా రాజన్న ఆలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు





. **వేములవాడ:**రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాదు రాజేశ్వర స్వామి దేవస్థానంలోలో శుక్రవారం మాస శివరాత్రి సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పరివార దేవతలకు ప్రత్యేక అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు సమర్పించారు. సాయంత్రం నిర్వహించిన మహా లింగార్చన కార్యక్రమంలో భాగంగా 365 జ్యోతులను వెలిగించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జి స్థానాచార్యులు నమిలికొండ ఉమేష్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితులు రాజన్న ఆలయం అభివృద్ధిలో భాగంగా ఏకాంతంగా నిర్వహించారు.

# రిసెప్షన్ వేడుకకు హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు



**ఎన్టీఆర్ డిస్టిక్ మే 15**
వత్సవాయి మండలం పాత వేమవరం గ్రామానికి చెందిన దిరిశనపు దాసు(లేటు)-ఏస్తేరు గార్ల కుమారుడు వెంకటేష్ గారి వివాహం సందర్భంగా ఏర్పాటు చేసిన రిసెప్షన్ వేడుకకు హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పూర్ణకంటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్, రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి నంబూరి రవి, నియోజకవర్గ దివ్యాంగుల విభాగ అధ్యక్షులు పూర్ణకంటి బాబురావు, పట్టణ కార్యదర్శి దార్ల ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు

# దోమకాటుతో డెంగ్యూ వైరల్ వ్యాధి

### (16 మే "జాతీయ డెంగ్యూ దినం" సందర్భంగా)

రుతుపవనాలు ప్రారంభమయ్యే వర్షాకాలపై వేకువ జామున లేదా సాయంకాలం గడియల్లో వైరస్ సోకిన 'ఆడెస్ ఎజిప్టీ' వర్గపు దోమల కాటు వల్ల సంక్రమించే డెంగ్యూ వైరల్ నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరంగా, చివరకు ప్రాణాంతకంగా కూడా మారుతుంది. నాలుగు రకాల డెంగ్యూ వ్యాధుల కట్టడి చేయడానికి, దోమలు పెరగకుండా పరిసరాల పరిశుభ్రతను పాటించడమే ఏకైక ఉత్తమ మార్గం అని తెలుసుకోవాలి. డెంగ్యూ వ్యాధికి చికిత్స ఉన్నప్పటికీ అశ్రద్ధ చేస్తే ప్రమాదకరంగా మారి ప్రాణాలను కూడా తీస్తుందని పౌర సమాజం అర్థం చేసుకోవాలి. డెంగ్యూ వ్యాధి ముఖ్య లక్షణాల్లో అధిక జ్వరం, తీవ్ర తలనొప్పి, నేత్రాల వెనుక నొప్పి, కండరాలు/కీళ్ల నొప్పులు, వాంతులు, అలసట, ముక్కు/చిగుర్ల నుంచి రక్తం కారడం, శారీరక బలహీనత, చర్మంపై దద్దుర్లు, బిపీ తగ్గడం, ప్లేట్లెట్ల సంఖ్య పడిపోవడం, చివరకు అవయవాల నిష్క్రియత్వం లాంటివి కనిపిస్తాయి.

జాతీయ డెంగ్యూ దినం-2026 ఇతివృత్తం:
ప్రమాదకర ప్రజారోగ్య సమస్యగా మారిన డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించటానికి ప్రతి ఏట మే 16న భారత దేశవ్యాప్తంగా "జాతీయ డెంగ్యూ దినం" లేదా "నేషనల్ డెంగ్యూ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రభుత్వ వైద్య ఆరోగ్య యంత్రాంగం పాత్ర, వైద్య సిబ్బంది అంకితభావం, వ్యాధి పట్ల ప్రజలకు కనీస అవగాహన కల్పించడం, పరిసరాల పరిశుభ్రతకు పెద్ద పీట వేయడం, ప్రజారోగ్య వ్యవస్థలను బలోపేతం చేయడం, వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవడానికి చర్యలు తీసుకోవడం, పౌర సమాజాన్ని ఏకీకరణ చేయడం లాంటి లక్ష్యాలను చేపట్టడానికి జాతీయ డెంగ్యూ దినం వేదికలను వినియోగించుకోవాలి. జాతీయ డెంగ్యూ దినం-2026 ఇతివృత్తంగా "డెంగ్యూ నియంత్రణలో పౌర సమాజ భాగస్వామ్యం:తనిఖీ, శుభ్రత, కప్పి ఉంచడం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ ఇతివృత్తం ప్రకారం, మన ఆవాస పరిసరాల్లో నీటి నిల్వలను తనిఖీ చేయడం, నీటి నిల్వలు లేకుండా శుభ్రంగా ఉంచడంతో పాటు నీటి నిల్వలను కప్పి ఉంచడం ద్వారా దోమల నియంత్రణ జరిగి డెంగ్యూ వ్యాధి ప్రబలడం కట్టడి అవుతుందని ప్రచారం చేస్తున్నారు.

భారతంలో డెంగ్యూ వ్యాధి వ్యాప్తి:
భారత దేశవ్యాప్తంగా డెంగ్యూ కేసులు నమోదు అయినప్పటికీ యూపీ, గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక, పంజాబ్ లాంటి రాష్ట్రాల్లో డెంగ్యూ వ్యాప్తి అధికంగా కనిపిస్తున్నది. ముఖ్యంగా పట్టణాల ప్రజల నుంచి పల్లెలకు ఈ వ్యాధి వ్యాపించడం జరుగుతున్నది. 2023లో దేశవ్యాప్తంగా 2.9 లక్షల కేసులు నమోదు కాగా 485 మరణాలు కూడా జరిగాయి. అదే విధంగా 2024లో 2.33 లక్షల రోగులు, 236 మరణాలు డెంగ్యూ వల్ల జరిగాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడం, అకాల వర్షాలు కురవడం, ప్రజల్లోఅవగాహనలేమి, ప్రభుత్వాల చర్యలు మందగించడం లాంటి కారణాలతో డెంగ్యూ వ్యాప్తి పెరుగుతున్నది. ప్రణాళిక కొరవడిన పట్టణీకరణ కూడా డెంగ్యూ రెచ్చిపోవడానికి ఒక ప్రధాన కారణం అవుతున్నది.

జాతీయ డెంగ్యూ దినం వేదికగా ప్రజలు, ప్రభుత్వ యంత్రాంగాలు సమైక్యంగా పోరాడితే పలు అంటువ్యాధులు, సాంక్రమిక వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చు. అస్తవ్యస్త పట్టణీకరణ, వాతావరణ ప్రతికూల మార్పులు, వర్షాకాల అపరిశుభ్రతలు డెంగ్యూ లాంటి సాంక్రమిక వ్యాధులకు తలుపులు తెరుస్తున్నట్లు అవుతున్నది. సరైన సమయంలో స్పందిస్తూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పౌర సమాజ చైతన్యం తగు రీతిలో కొనసాగితే డెంగ్యూ వ్యాధి కట్టడి సులభం అవుతుంది. మన స్వల్ప అశ్రద్ధ ప్రాణాంతకం కావద్దు. మన ఇంటి పరిసరాల పరిశుభ్రత మన కుటుంబ/సమాజ ఆరోగ్య ప్రదాయిని అని తెలుసుకుందాం. వ్యాధి చికిత్స కన్న నివారణే మిన్న అనే నినాదాన్ని గుర్తుంచుకొని మన ఆరోగ్యం కోసం మనమే ప్రతినబూనుదాం, డెంగ్యూ కనబడని భారతాన్ని నిర్మించుకుందాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

# జీవుల మనుగడకు ఆధారం 'కాంతి' మాత్రమే !

### (16 మే "అంతర్జాతీయ కాంతి దినోత్సవం" సందర్భంగా)

విశ్వంలో కాంతి ఒక ప్రధాన భాగమే కాకుండా అత్యంత మౌళిక అంశంగా మారింది. అత్యంత సూక్ష్మ కణాల ధర్మాలను వర్ణించే క్వాంటం సైన్స్‌కు మూలాధారం కాంతి మాత్రమే. వేడి చేసిన వస్తువుల నుండి కాంతి కణాల లేదా ఫోటాన్ల ధర్మాల వరకు కాంతి శాస్త్రం వర్ణించబడుతుంది. ఫోటాన్స్ అంటే కాంతి సూక్ష్మ కణాలని అర్థం చేసుకోవాలి. కాంతికి పర్యాయపదంగా ఫోటాన్స్ నిలుస్తున్నాయి. కాంతి లేని భూగోళం శీతలం, బంజరు నేలల మయం. కాంతి ఎక్కడ ఉంటుందో అక్కడ జీవుల ఉనికి కనిపిస్తుంది. మానవాళి మనుగడకు కాంతితో అవిభాజ్య సంబంధం నెలకొని ఉన్నది. వైజ్ఞానిక శాస్త్ర అభివృద్ధి అంటే కాంతి దృగ్విషయాల శోధనలు మాత్రమే. కాంతి మాంద్యంగానే ప్రపంచ సూక్ష్మ విషయాలు అవగతం అవుతున్నాయి. 16 మే 1960 రోజున తొలిసారి బౌతికశాస్త్రజ్ఞుడైన ఇంజనీరు 'థియోడోర్ మైమాన్' కృషితో లేజర్ సర్జరీ జరిగింది. కాంతి పరిశోధనలతో ప్రత్యామ్నాయ శక్తి వనరులు, వైద్య రంగంలో ఒకచ్చితత్వంతో రోగ నిర్ధారణ లు, చికిత్స మార్గాలు, హై-స్పీడ్ ఇంటర్నెట్ లాంటి అనేక ఆవిష్కరణలు నేటి ఆధునిక పౌర సమాజాన్ని అత్యంత ప్రభావితం చేస్తున్నాయి.

కాంతి వైజ్ఞానికశాస్త్ర అనంత ప్రయోజనాలు:
నేడు కాంతి ఆధార వైజ్ఞానికశాస్త్రం, టెక్నాలజీల పాత్ర అనన్య సామాన్యమైపోయింది. ఫోటోనిక్స్ ద్వారా నేడు ప్రపంచమంతటా అంతర్జాలం/కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్ సమన్వయ పరచబడింది. ఆప్టికల్ టెక్నాలజీలతో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రిమోట్ సెన్సింగ్ వ్యవస్థలు సుస్థిర వ్యవసాయానికి బాటలు వేస్తున్నాయి. కాంతి వల్లనే భూమి కుగ్రామం అయిపోయింది. వాతావరణ మార్పుల అధ్యయనాలు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అధిగమించడం లాంటివి సుసాధ్యం అవుతున్నాయి. సమ్మిళిత అభివృద్ధి, ఆహార భద్రత, ఆకలికి సమాధానం కూడా కాంతి శాస్త్రం ఇవ్వగలుగుతున్నది. అగ్ర-ఫోటానిక్స్ వేదికగా సాగు పద్ధతుల్లో విప్లవాత్మక సకారాత్మక మార్పులు వస్తున్నాయి. శక్తిని ఆదా చేయడానికి ఎల్ఈడీ ప్రక్రియ అందుబాటులోకి వచ్చింది. టెలీ-కమ్యూనికేషన్ల రంగంలో విప్లవాత్మక మార్పులకు కాంతి పునాదులు వేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది కంటి చూపు దోషాలను సవరించడానికి కాంతి-ఆధారిత భౌతిక శాస్త్రం దోహదపడుతున్నది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమాటిక్స్ - స్టెమ్ సమన్వయంతో సమ్మిళిత వైజ్ఞానికశాస్త్ర అభివృద్ధికి రాచ బాటలు పడుతున్నాయి. లింగ సమానకడక్వ సాధనకు మహిళలు, యువతులను కాంతి ఆధారిత పరిశోధనల వైపు మరల్చాలి. నేడు దాదాపు 28 శాతం మహిళలు పరిశోధనారంగాల్లో పని చేయడం జరుగుతోంది. శుద్ధ సురక్షిత తాగు నీటి లభ్యతకు ఫోటోనిక్స్ టెక్నాలజీలు ఉపయోగపడుతున్నాయి.

అంతర్జాతీయ కాంతి దినోత్సవం-2026 ఇతివృత్తం:
ప్రపంచ శాంతి, సుస్థిరాభివృద్ధికి బాటలు వేస్తున్న కాంతి ప్రక్రియలను, కాంచి ప్రాధాన్యాలను వివరించడానికి, మరింత ప్రయోజనకరంగా మార్చడానికి ప్రతి ఏట 16 మే రోజున "అంతర్జాతీయ కాంతి దినోత్సవం" లేదా "ఇంటర్నేషనల్ డే ఆఫ్ లైఫ్"ను పాటించడం ఆనవాయితీగా మారింది. 2026 అంతర్జాతీయ కాంతి దినోత్సవం" ఇతివృత్తంగా "ఉజ్వల సుస్థిర భవిష్యత్తుకు కాంతి (లైట్ ఫర్ ఏ సస్టేనబుల్ ఫ్యూచర్)" అనబడే అంశాన్ని తీసుకోని నిత్య జీవితంలో కాంతి ప్రాధాన్యాలను వివరించడంతో జరుగుతుంది. కాంతి అద్భుత ధర్మాలను లేదా కాంతి-ఆధారిత టెక్నాలజీలను సాధారణ మానవాళికి వివరించడం, కాంతి అంశంలో మరింత లోతైన పరిశోధనలను ప్రోత్సహించడం, కాంతితో కళలు/సంస్కృతి సంబంధాలను వర్ణించడం, కాంతి అనువర్తనాలను చర్చించడం, సుస్థిరాభివృద్ధిలో కాంతి సాంకేతికతను వాడుకోవడం లాంటి అంశాలతో పాటు శక్తిని సమర్థవంత వినియోగాలు, శక్తి నష్టాల నివారణ, కాంతి కాలుష్య కట్టడి లాంటి అంశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. పునరుత్పాదక శక్తి వనరులు, మానవాళి కనీస అవసరాలు, వాతావరణ మార్పులు, కృత్రిమ ఉపగ్రహాలు లాంటివి కాంతి ఆధారంగానే జరుగుతున్నాయి.

అంతర్జాతీయ కాంతి దినోత్సవ కార్యక్రమాలు:
2015 ఏడాదిని అంతర్జాతీయ కాంతి సంవత్సరంగా పాటించడం సత్ఫలితాలను ఇవ్వడంతో 2018 నుంచి యునెస్కో అంచర్జాతీయ కాంతి దినోత్సవాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది. వైద్య ఆరోగ్య రంగాలు, ఇంటర్నెట్-కమ్యూనికేషన్ వ్యవస్థలు, సుస్థిర శక్తి వనరుల వాడకం, విద్యుత్ పాటు ఆవిష్కరణలు లాంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు సుసాధ్యం కావడానికి కాంతి-ఆధారిత ఆధునిక పరిజ్ఞానాలు దోహదపడుతున్నాయి. అంతర్జాతీయ కాంతి దినోత్సవ వేదికగా వైజ్ఞానిక ప్రదర్శనలు, ఉపన్యాసాలు, వెబినార్లు, సదలేజర్-ఆప్టిక్స్ నమూనాల ప్రదర్శనలు, ఆర్ట్ - ఫోటోగ్రఫీ రంగాల్లో పోటీలు, ప్లానిటోరియం సందర్శనలు లాంటివి ఏర్పాటు చేయవచ్చు.

ఈ వేదికలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు, ఫోటోగ్రాఫర్లు, ఆర్టిస్టులు, ఫోటోనిక్స్ టెక్నోక్రాట్లు పాల్గొని రేపటి తరానికి మార్గదర్శనం చేయాలి. కాంతిలో దాగిన విశ్వ రహస్యాలను బట్టబయలు చేయాలి, మానవాళి సరళ జీవన విధానాలకు బంగారు బాటలు వేయాలి. కాంతి ఆవిష్కరణలు కమ్యూనికేషన్, ఆరోగ్య, పర్యావరణ, వ్యవసాయం లాంటి అనేక రంగాల్లో సకారాత్మక మార్పులకు పునాదులు వేయాలి. కాంతి వాడకంతో మన ముఖాల్లో నవ్వుల వెలుగులు ప్రసరించాలి.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

# గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

### ప్రణాళిక ప్రకారం చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలి
### రాజన్న సిరిసిల్లజిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
### ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా విద్యా వారోత్సవాల కింద రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవం



**వేములవాడ** :విద్యార్థులందరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈ నెల 11 వ తేదీ నుంచి 17 వ తేదీ వరకు విద్యా వారోత్సవాల కింద రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా జయ జయహే తెలంగాణ పాటను వినిపించారు. లైబ్రరీ లో చదివి ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా గ్రంథాలయం లో ఏర్పాటు చేసిన పుస్తకాలను పరిశీలించారు. పాఠశాలల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక పుస్తక ప్రదర్శన, మానసిక ఉల్లాసానికి అందుబాటులో ఉంచిన వివిధ ఆటల పరికరాలను పరిశీలించి.. విద్యార్థులు ఈ పుస్తకాలు, ఆటల పరికరాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు. పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించామని పేర్కొన్నారు. మూడేండ్ల వయసు, అలాగే ఆరేండ్లలోపు పిల్లలు తమ సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో నమోదు కావాలని సూచించారు. కోడి గుడ్లు, బాలామృతం, ఇక్రిశాట్ వారి సూచనల మేరకు రూపొందించిన స్నాక్స్, పాలు పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చాలా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. లైబ్రరీ అనేది చదువుకునేందుకు మంచి అవకాశమని, మిగతా వారితో పోటీ పడే స్ఫూర్తి పొందుతారని పేర్కొన్నారు. తాను కూడా లైబ్రరీలో చదివానని గుర్తు చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులు వార్త పత్రికలు చదవాలని సూచించారు. దీంతో అన్ని విషయాలపై అవగాహన వస్తుందని వివరించారు. సమయం చాలా విలువైందని, సోషల్ మీడియా కు దూరంగా ఉంటూ లక్ష్య సాధన పై దృష్టి సారించాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని, ప్రతి సబ్జెక్ట్ కు నిర్ణీత గడువు పెట్టుకొని చదవాలని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న వారు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. ఏదైనా కొలువు సాధించాలని ఆకాంక్షించారు. స్కూల్ వెళ్ళే విద్యార్థులు లైబ్రరీకి వచ్చేలా వివరించాలని పేర్కొన్నారు. వచ్చే వారం యూత్ అండ్ పర్యాటక శాఖ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రత్యేక వాకథాన్, జాబ్ మేళా నిర్వహించ నున్నామని వెల్లడించారు. యువత పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు. కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో పరిశీలన జిల్లా కేంద్ర గ్రంథాలయంలో టాస్క్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కంప్యూటర్ శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఎంత మంది విద్యార్థులు వస్తున్నారు? ఏ ఏ అంశాలు నేర్చుకుంటున్నారో ఆరా తీశారు. తరగతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కృషితో గ్రంథాలయాలను అభివృద్ధి బాటలో తీసుకు వెళుతున్నామని తెలిపారు. గ్రంథాలయంలో చదువుకొని దాదాపు 150 మంది వరకు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. చాలా గ్రామాల్లో పబ్లిక్ రీడింగ్ రూమ్ లను ఏర్పాటు చేసి గ్రామీణ పాఠకులకు గ్రంథాలయాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# బుమ్రా సారథ్యంలో అరుదైన మైలురాయి!



ఐపీఎల్ 2026 సీజన్‌లో ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ ఒక విలక్షణమైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. గురువారం ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా టాస్ వేయడానికి రావడంతో ఈ అరుదైన ఘనత సాధ్యమైంది. రెగ్యులర్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా వెన్నునొప్పి కారణంగా ఈ మ్యాచ్‌కు దూరం కాగా, స్టాండ్-ఇన్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వ్యక్తిగత కారణాల వల్ల అందుబాటులో లేడు. దీనితో బుమ్రా తన ఐపీఎల్ కెరీర్‌లో తొలిసారి నాయకత్వ బాధ్యతలు చేపట్టాడు. ఒకే సీజన్‌లో ముగ్గురు వేర్వేరు భారతీయ ఆటగాళ్లు (హార్దిక్, సూర్య, బుమ్రా) కెప్టెన్లుగా వ్యవహరించడం ఐపీఎల్ చరిత్రలోనే ఇదే మొదటిసారి. ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో ముగ్గురు కెప్టెన్లను మార్చిన ఐదో జట్టుగా ముంబై నిలిచింది. గతంలో 2008లో ముంబై తరపున హర్భజన్ సింగ్, షాన్ పొల్లాక్, సచిన్ టెండూల్కర్ కెప్టెన్లుగా ఉండగా, ఆ తర్వాత పుణే వారియర్స్ ఇండియా (2013), సన్ రైజర్స్ హైదరాబాద్ (2021), పంజాబ్ కింగ్స్ (2024) ఈ జాబితాలో చేరాయి. అయితే పైన పేర్కొన్న జట్లన్నీ భారతీయులు ఇంకా విదేశీ ఆటగాళ్ల కలయికతో కెప్టెన్లను మార్చగా, ముంబై ఇండియన్స్ మాత్రం ఈసారి ముగ్గురు భారతీయులకే ఆ బాధ్యతలు అప్పగించి సరికొత్త ట్రెండ్ సెట్ చేసింది. వరుస గాయాలు, సీనియర్ల గైర్హాజరీ వల్ల ఈ పరిస్థితి తలెత్తినప్పటికీ, ఇది ముంబై టీమ్ లో ఉన్న లీడర్‌షిప్ డెప్త్‌ను తెలియజేస్తోంది. జస్ప్రీత్ బుమ్రా కెప్టెన్సీ అరంగేట్రం కోసం చాలా కాలం వేచి చూడాల్సి వచ్చింది. ఏకంగా 156 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన తర్వాత ఆయనకు కెప్టెన్ అయ్యే అవకాశం దక్కింది. లీగ్ చరిత్రలో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన తర్వాత కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్న రెండో ఆటగాడిగా బుమ్రా నిలిచాడు. ఈ లిస్టులో రవీంద్ర జడేజా 200 మ్యాచ్‌లతో టాప్ లో ఉండగా, ఇప్పుడు బుమ్రా మనీష్ పాండే (153), అక్షర్ పటేల్ (148), కీరన్ పొలార్డ్ (137) వంటి దిగ్గజాలను వెనక్కి నెట్టాడు. టాస్ సమయంలో బుమ్రా ఒక చమత్కారమైన కామెంట్ కూడా చేశాడు. ముంబైకి కెప్టెన్ కాకముందే టీమిండియా టెస్ట్ టీమ్ కు కెప్టెన్ అవుతానని ఎప్పుడూ అనుకోలేదని నవ్వుతూ చెప్పిన మాటలు సోషల్ మీడియాలో హైలైట్ అవుతున్నాయి. ఈ 2026 సీజన్ ముంబై ఇండియన్స్ జట్టుకు అస్సలు కలిసి రావడం లేదు. వరుస ఓటములతో పాటు నాయకత్వ మార్పులు జట్టును ఇబ్బంది పెడుతున్నాయి. టీమ్ లోని కోర్ గ్రూప్ అలాగే ఉన్నా, కెప్టెన్సీలో స్థిరత్వం లేకపోవడం వల్ల మైదానంలో ప్లానింగ్ కష్టంగా మారుతోంది. అయితే ఈ క్లిష్ట పరిస్థితుల్లో కూడా బుమ్రా కెప్టెన్‌గా రావడంతో అభిమానుల్లో కొత్త ఆశలు చిగురించాయి. ప్రధాన కోచ్ మాహేల జయవర్ధనే పర్యవేక్షణలో ఉన్న ఈ టీమ్, కనీసం మిగిలిన మ్యాచ్‌ల్లో గెలిచి తమ గౌరవాన్ని కాపాడుకోవాలని చూస్తోంది. ప్లేఆఫ్స్ రేసులో నుంచి ఔట్ అయినప్పటికీ, బుమ్రా లాంటి అగ్రెసివ్ బౌలర్ నాయకత్వంలో ముంబై కొత్త ఉత్సాహంతో ఆడుతుందనే అంచనాలు ఉన్నాయి.

# తనను తానే ట్రోల్ చేసుకున్న రోహిత్ శర్మ



రాయ్‌పూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌పై గెలిచిన తర్వాత ముంబయి ఇండియన్స్ స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇది టీమ్‌మేట్స్‌కు నవ్వు తెప్పించింది. ఇందులో మరీ ముఖ్యంగా రోహిత్ తనను తాను స్వయంగా ట్రోల్ చేసుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియోను ముంబయి ఇండియన్స్ ఎక్స్‌లో షేర్ చేసింది. మ్యాచ్ అనంతరం జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రోహిత్ మాట్లాడాడు. తనదైన శైలిలో రోహిత్ ఫన్నీ సెటైర్లు పేల్చడం అందరికీ నవ్వు తెప్పించింది. ఈ క్రమంలోనే తన బ్యాటింగ్‌పై తానే ట్రోల్ చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అందరూ తమవంతు కృషి చేశారని, ఈ విజయం సంపూర్ణ జట్టు కృషి అని అన్నాడు. అయితే తాను ఈ మ్యాచ్‌లో తాను టెస్టు ఇన్నింగ్స్ ఆడుతూ ఎంజాయ్ చేస్తుంటే, మిగిలిన వాళ్లు తమవంతు సహకారం అందించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారని అన్నాడు.'ఇది అద్భుతమైన విజయం! బ్యాటింగ్‌లో ఇది పూర్తిగా ఒక టీమ్‌గేమ్. నేను మాత్రం నా టెస్టు క్రికెట్‌ను ఆస్వాదిస్తుండగా, జట్టులోని ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయడం చాలా సంతోషంగా ఉంది' అని రోహిత్ అన్నాడు. అయితే రోహిత్ ఈ మ్యాచ్‌లో 26 బంతులు ఆడి కేవలం 25 పరుగులే చేశాడు. స్ట్రైక్ రేట్ 96 మాత్రమే. దీంతో ఇలాంటి స్లో ఇన్నింగ్స్ ఆడినందుకు రోహిత్ తనపై తానే సెటైర్ పేల్చుకున్నాడన్నమాట! ఇది చూసిన నెటిజన్లు 'హిట్‌మ్యాన్ తనను తానే ట్రోల్ చేసుకుంటున్నాడు' అంటూ కామెంట్లు పెడుతున్నారు. 201 పరుగుల లక్ష్యాన్ని ముంబయి 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తిలక్ వర్మ (75 పరుగులు, 33 బంతుల్లో), రికెల్టన్ (48 పరుగులు, 23 బంతుల్లో), విల్ జాక్స్ (25 పరుగులు, 10 బంతుల్లో) రఫ్ఫాడించగా, రోహిత్ శర్మ (25 పరుగులు, 26 బంతుల్లో), రూథర్‌ఫోర్డ్ (20 పరుగులు, 21 బంతుల్లో) రాణించి జట్టు విజయంలో తలో చేయి వేశారు. బౌలింగ్‌లో శార్దూల్ ఠాకూర్ 4, దీపక్ చాహర్, కార్బిన్ బోశ్, రాజ్ బవ తలో 1 వికెట్ దక్కించుకున్నారు.

# దేవదత్ పడిక్కల్, షెహనాజ్ గిల్ మధ్య ప్రేమాయణం




ఆర్సీబీ జట్టుకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కేవలం ఆటపరంగానే కాకుండా ఆర్సీబీ ప్లేయర్ల వ్యక్తిగత విషయాలపై కూడా నెటిజన్లు ఎప్పుడూ ఆసక్తి చూపిస్తుంటారు. తాజాగా ఆర్సీబీ స్టార్ ప్లేయర్ దేవదత్ పడిక్కల్, పంజాబీ చిత్ర పరిశ్రమలో పాపులర్ అయిన షెహనాజ్ గిల్ మధ్య ప్రేమాయణం నడుస్తోందంటూ సోషల్ మీడియాలో వార్తలు హల్చల్ చేస్తున్నాయి. గత కొంతకాలంగా షెహనాజ్ గిల్ తరచుగా ఆర్సీబీ మ్యాచ్‌లకు హాజరవుతూ స్టేడియంలో కనిపిస్తున్నారు. సాధారణంగా సినీ ప్రముఖులు మ్యాచ్ లకు రావడం సహజమే అయినా షెహనాజ్ గిల్ ప్రత్యేకంగా దేవదత్ పడిక్కల్‌ను ఉత్సాహపరుస్తూ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. అంతేకాకుండా షెహనాజ్ గిల్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తనకు దేవదత్ పడిక్కల్ బ్యాటింగ్ స్టైల్ అంటే చాలా ఇష్టమని.. అతను ఆడుతుంటే చూడముచ్చటగా ఉంటుందని మనసులో మాట బయటపెట్టింది. అప్పటి నుంచే వీరిద్దరి మధ్య ఏదో ఉందనే ప్రచారం మొదలైంది. తాజాగా షెహనాజ్ గిల్ తన ఇన్‌స్టా ఖాతాలో చేసిన ఓ పోస్ట్ ఈ పుకార్లకు మరింత బలాన్ని చేకూర్చింది. "నా మనసు ఆర్సీబీలో ఉంది, నా జీవితం పంజాబ్‌లో ఉంది. పంజాబీలు తమ మనసుకు నచ్చిన చోట ప్రాణాలను సైతం ఇవ్వగలరు" అని ఆమె రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌లో ఆమె 'ఆర్సీబీ' అని స్పష్టంగా ప్రస్తావించడం, అందులోనూ తన మనసు అక్కడే ఉందని చెప్పడంతో నెటిజన్లు ఓ అంచనాకు వచ్చేశారు. దేవదత్ పడిక్కల్‌ను ఉద్దేశించే ఆమె ఈ కామెంట్స్ చేశారని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఈ డేటింగ్ వార్తలు గత కొన్ని రోజులుగా వైరల్ అవుతున్నప్పటికీ.. అటు దేవదత్ పడిక్కల్ కానీ, ఇటు షెహనాజ్ గిల్ కానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. మౌనం అర్ధాంగీకారం అని కొందరు అంటుంటే, కేవలం స్నేహం వల్లే షెహనాజ్ అలా రాసి ఉంటుందని మరికొందరు వాదిస్తున్నారు. ఏది ఏమైనా, వీరిద్దరి మధ్య ఏదో నడుస్తోందన్న వార్త మాత్రం ప్రస్తుతం క్రికెట్, సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# అర్ష్‌దీప్ సింగ్‌పై నిషేధం విధించాలి

### - టీమిండియా మాజీ స్పిన్నర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్

జాతి వివక్ష వ్యాఖ్యలు చేసిన పంజాబ్ కింగ్స్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌పై నిషేధం విధించాలని టీమిండియా మాజీ స్పిన్నర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్ డిమాండ్ చేశాడు. ఈ సీజన్ మొత్తం ఆడకుండా చేయాలని బీసీసీఐని కోరాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు పంజాబ్ కింగ్స్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ షేర్ చేసిన ఓ వీడియో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ వీడియోలో తిలక్ వర్మను అర్ష్‌దీప్ సింగ్ కర్రోడా అని సంభోదించాడు. 'అరే ఓ కర్రోడా.. సన్‌స్క్రీన్ రాశావా'అని అడిగాడు. అంతటితో ఆగకుండగా.. నమన్ ధీర్‌ను అందగాడని అభివర్ణించాడు. ఈ వీడియో నెట్టింట తీవ్ర దుమారం రేపింది. కొందరు ఈ వీడియోను సరదాగా తీసుకొన్న మరికొందరు మాత్రం జాతి వివక్ష వ్యాఖ్యలుగా పేర్కొంటూ అర్ష్‌దీప్ సింగ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎక్స్ వేదికగా స్పందించిన శివరామకృష్ణన్.. అర్ష్‌దీప్ సింగ్‌పై నిషేధం విధించాలని బీసీసీఐని డిమాండ్ చేశాడు. ఇలాంటి ఘటనలను డ్రెస్సింగ్ రూమ్ జోక్స్‌గా కొట్టిపారేస్తే ఇలాంటి సమస్యలు ఎక్కువ అవుతాయని అభిప్రాయపడ్డాడు.'తిలక్ వర్మ కెరీర్ ఆరంభంలో ఉంది. కాబట్టి ఈ జాతి వివక్ష వ్యాఖ్యలపై స్పందించడు. కానీ బీసీసీఐ.. ఈ వీడియో ప్రూఫ్‌తో అర్ష్‌దీప్ సింగ్‌పై చర్యలు తీసుకోవచ్చు. ఇది ఏ మాత్రం ఆట కాదు.. ఇదో వృత్తి. జాతి వివక్ష గురించి చెబితే నన్ను ఎవరూ నమ్మలేదు. ప్రతీ ఒక్కరు నన్ను తిట్టడంతో పాటు ట్రోల్ చేశారు. అర్ష్‌దీప్ సింగ్‌ను ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లు ఆడకుండా నిషేధం విధించాలి. నేను మరోసారి ట్రోలింగ్ గురవుతానని తెలుసు. బీసీసీఐ చర్యలు తీసుకుంటుందంటే.. నా పట్ల జాతి వివక్ష వ్యాఖ్యలు చేసి వారి పేర్లు చెబుతాను. వారిపై బీసీసీఐ చర్యలు తీసుకుంటుందా 'అని శివమరామకృష్ణ వరుస ట్వీట్స్ చేశాడు. ఈ ఘటన బీసీసీఐని ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టింది. ఈ సీజన్ ప్రారంభానికి ముందే ఫ్రాంచైజీలకు ఆఫ్ ఫీల్డ్‌లో ఆటగాళ్ల ప్రవర్తనకు సంబంధించి ఏడు గైడ్‌లైన్స్‌ను బీసీసీఐ జారి చేసింది. ఈ క్రమంలో అర్ష్‌దీప్ సింగ్‌పై చర్యలు తీసుకుంటారా లేక చూసి చూనట్లు వదిలేస్తారా అనేది తీవ్ర చర్చనీయాంశమైంది.

# బీసీసీఐ రూల్స్‌లో ఊహించని ట్విస్ట్!



ఐపీఎల్ 2026 సీజన్ క్లైమాక్స్‌కు చేరుకుంది. మే 24తో లీగ్ దశ మ్యాచ్‌లు ముగియనుండగా.. మే 26 నుంచి ప్లేఆఫ్స్ సమరం మొదలవుతుంది. అయితే ఈ కీలక మ్యాచ్‌లకు వర్షం ముప్పు పొంచి ఉండటంతో క్రికెట్ అభిమానుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో ప్లేఆఫ్ మ్యాచ్‌లకు సంబంధించి బీసీసీఐ రూపొందించిన ప్రత్యేక నిబంధనల గురించి తెలుసుకుందాం. సాధారణంగా నాకౌట్ మ్యాచ్‌లన్నింటికీ రిజర్వ్ డే ఉంటుందని అందరూ భావిస్తారు. కానీ బీసీసీఐ నిబంధనల ప్రకారం క్వాలిఫయర్-1, ఎలిమినేటర్, క్వాలిఫయర్-2 మ్యాచ్‌లకు రిజర్వ్ డేలు లేవు. కేవలం ఫైనల్ మ్యాచ్‌కు మాత్రమే రిజర్వ్ డే కేటాయించబడింది. అంటే మొదటి మూడు నాకౌట్ మ్యాచ్‌లను ఏ రోజున నిర్ణయించారో అదే రోజున ఫలితాన్ని తేల్చాల్సి ఉంటుంది. వర్షం పడితే ఆటను పూర్తి చేయడానికి లీగ్ మ్యాచ్‌ల కంటే అదనంగా 120 నిమిషాల సమయం కేటాయిస్తారు. ఒకవేళ ప్లేఆఫ్ మ్యాచ్ జరిగే రోజున వర్షం కురిస్తే అంపైర్లు మొదట 20 ఓవర్ల పూర్తి మ్యాచ్ నిర్వహించడానికి ప్రయత్నిస్తారు. అది సాధ్యం కాకపోతే ఓవర్లను తగ్గిస్తూ వచ్చి కనీసం 5 ఓవర్ల చొప్పున మ్యాచ్ జరిగేలా చూస్తారు. ఒకవేళ 5 ఓవర్ల మ్యాచ్ కూడా జరగని పక్షంలో కనీసం ఫలితం కోసం సూపర్ ఓవర్ నిర్వహించే అవకాశం ఉందో లేదో పరిశీలిస్తారు. మైదానం పరిస్థితి సహకరిస్తే సూపర్ ఓవర్ ద్వారా విజేతను నిర్ణయిస్తారు. అదనపు సమయం తర్వాత కూడా వర్షం తగ్గకపోతే లేదా సూపర్ ఓవర్ కూడా నిర్వహించే అవకాశం లేకపోతే, బీసీసీఐ నిబంధనల ప్రకారం లీగ్ దశలో సాధించిన పాయింట్ల పట్టిక కీలకంగా మారుతుంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న జట్టును విజేతగా ప్రకటిస్తారు. ఉదాహరణకు, క్వాలిఫైయర్-1లో మొదటి, రెండో స్థానాల్లోని జట్ల మధ్య మ్యాచ్ వర్షం వల్ల రద్దయితే, టేబుల్ టాపర్‌గా ఉన్న జట్టును నేరుగా ఫైనల్‌కు పంపిస్తారు. ఎలిమినేటర్ మ్యాచ్‌లో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. మిగిలిన మ్యాచ్‌లతో పోలిస్తే ఫైనల్‌కు రూల్స్ కాస్త సరళంగా ఉంటాయి. ఫైనల్ మ్యాచ్‌కు రిజర్వ్ డే ఉన్నందున నిర్ణీత రోజున వర్షం వస్తే మరుసటి రోజు ఆటను కొనసాగిస్తారు. ఒకవేళ ఫైనల్ రోజున మ్యాచ్ సగం జరిగాక ఆగిపోతే.. రిజర్వ్ డే నాడు అక్కడి నుంచే ఆట ప్రారంభమవుతుంది. రిజర్వ్ డే నాడు కూడా వర్షం కారణంగా కనీసం 5 ఓవర్ల ఆట లేదా సూపర్ ఓవర్ సాధ్యపడకపోతే, అప్పుడు లీగ్ దశలో పాయింట్ల పట్టికలో టాప్ ప్లేస్‌లో ఉన్న జట్టును ఐపీఎల్ 2026 ఛాంపియన్‌గా ప్రకటిస్తారు.

# విభేదాలు ఉంటే పరిష్కరించుకోవాలి

### - టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్



ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబయి ఇండియన్స్ పరిస్థితి నిరాశజనకంగా ఉంది. ఆట కంటే కూడా జట్టు లోపల జరుగుతున్న పరిణామాలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా కెప్టెన్ హార్దిక్ పాండ్య చుట్టూ ఏదో ఒక వివాదం తిరుగుతూనే ఉంది. నిన్న పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ ఆడకపోవడంపై రకరకాల చర్చలు మొదలయ్యాయి. అధికారికంగా వెన్నునొప్పి అని చెబుతున్నా, తెర వెనుక కథ వేరే ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముంబయి మేనేజ్‌మెంట్ హార్దిక్ విషయంలో ఒక కఠినమైన నిర్ణయం తీసుకోవాలి అని సెహ్వాగ్ సూచించారు. ముంబయి ఇండియన్స్ డ్రెస్సింగ్ రూమ్‌లో హార్దిక్ పాండ్యకు, మిగిలిన ఆటగాళ్లకు మధ్య విభేదాలు ఉన్నాయనే వార్తలు గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి. దీనిపై సెహ్వాగ్ స్పందిస్తూ ఒకవేళ ఈ రూమర్స్ నిజమైతే ముంబయి ఇండియన్స్ వెంటనే హార్దిక్‌ను జట్టు నుంచి రిలీజ్ చేయాలి అని అభిప్రాయపడ్డారు. జట్టులో క్రమశిక్షణ, సమన్వయం లేనప్పుడు ఎంతటి స్టార్ ప్లేయర్ ఉన్నా ప్రయోజనం ఉండదు అని సెహ్వాగ్ పేర్కొన్నారు. అయితే ఈ వార్తలు నిజమో కాదో తనకు తెలియదని, ఒకవేళ నిజం అని తేలితే మాత్రం కఠినంగా ఉండాలి అని ముంబయికి సూచించారు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యతో పాటు సూర్యకుమార్ యాదవ్ కూడా ఆడలేదు. దీంతో జస్ప్రీత్ బుమ్రా జట్టు పగ్గాలు చేపట్టారు. బుమ్రా కెప్టెన్సీలో ముంబయి అద్భుత విజయాన్ని అందుకుని ఈ సీజన్‌లో నాలుగో గెలుపును నమోదు చేసింది. హార్దిక్ లేకపోయినా జట్టు గెలవడంతో, ఆయన అవసరం టీమ్‌కు ఉందా లేదా అన్న చర్చ మొదలైంది. అయితే సెహ్వాగ్ మాత్రం క్రికెట్ పరంగా చూస్తే హార్దిక్ చాలా విలువైన ప్లేయర్ అని, కేవలం ఆటను బట్టి చూస్తే ఆయనను కచ్చితంగా రిటైన్ చేసుకోవాలి అని అన్నారు. సెహ్వాగ్ తన వివరణలో హార్దిక్ పాండ్య మార్కెట్ వాల్యూ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఐపీఎల్‌లో రిషబ్ పంత్ 27 కోట్లతో అత్యంత ఖరీదైన ఆటగాడిగా ఉన్నారు. హార్దిక్‌కు ఇప్పుడు వస్తున్న 16 కోట్లు చాలా తక్కువ అని, నిజానికి అతను కూడా 27 కోట్ల విలువైన ఆటగాడే అని సెహ్వాగ్ ప్రశంసించారు. హార్దిక్ గతంలో ముంబయిలో సాధారణ ప్లేయర్‌గా ఉన్నప్పుడు కూడా అద్భుతంగా రాణించారు అని, ఆయన ఆల్‌రౌండ్ ప్రతిభ జట్టుకు ఎప్పుడూ అవసరమే అని సెహ్వాగ్ గుర్తు చేశారు. డ్రెస్సింగ్ రూమ్‌లో తేడాలు ఉన్నాయనే వార్తలను సెహ్వాగ్ కొట్టిపారేయలేదు. ఒకవేళ చిన్న చిన్న మనస్పర్థలు ఉంటే వాటిని కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకోవాలి అని ముంబయికి సలహా ఇచ్చారు. "క్రికెట్ అనేది టీమ్ గేమ్ అక్కడ విభేదాలకు తావు ఉండకూడదు. హార్దిక్ పాండ్య వంటి క్వాలిటీ ప్లేయర్ ముంబయిలో ఉండటం జట్టుకు ఎంతో బలం. వ్యక్తిగత ఇగోలను పక్కన పెట్టి జట్టు కోసం ఆడాలి" అని సెహ్వాగ్ సూచించారు.

సెహ్వాగ్ లాంటి సీనియర్ క్రికెటర్ హార్దిక్‌ను రిలీజ్ చేయాలి అని అనడం ముంబయి ఫ్యాన్స్‌లో హాట్ టాపిక్ గా మారింది. వచ్చే ఏడాది మెగా వేలం ఉన్న నేపథ్యంలో ముంబయి ఎవరిని రిటైన్ చేసుకుంటుంది అన్నది ఆసక్తికరంగా మారింది. రోహిత్ శర్మ, బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ వంటి స్టార్ ప్లేయర్స్ ఉన్న జట్టులో హార్దిక్ నాయకత్వంపై వ్యతిరేకత ఉందని వార్తలు వస్తున్నాయి. మరి మేనేజ్‌మెంట్ సెహ్వాగ్ అన్నట్లుగా హార్దిక్‌ను వదిలేస్తుందా లేక విభేదాలను సెట్ చేసి మళ్ళీ ఆయనకే పగ్గాలు ఇస్తుందా అన్నది వేచి చూడాలి.

# పల్లెటూరి ప్రేమకథ దూరదర్శిని




ప్రస్తుత కాలంలో సినిమా విజయాన్ని బడ్జెట్ నిర్ణయించడం లేదు, కేవలం కంటెంట్ మాత్రమే శాసిస్తోంది. బలమైన కథాంశంతో వస్తున్న చిన్న చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధిస్తూ సంచలనం సృష్టిస్తున్నాయి. సరిగ్గా అదే బాటలో, కేవలం కథనే నమ్ముకుని ఈ వారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం 'దూరదర్శిని'. టైటిల్‌తోనే సగటు ప్రేక్షకుడిలో పాత జ్ఞాపకాలను తట్టిలేపిన ఈ సినిమా, థియేటర్లలో సందడి చేస్తోంది. చిత్ర కథ మట్టపర్రు అనే పచ్చని పల్లెటూరి చుట్టూ తిరుగుతుంది. ఊరిలో కుల రాజకీయాలు, అంతరాలు ఉన్నప్పటికీ.. హరి (సువీక్షిత్), వాణి (గీతికా రతన్) చిన్నప్పటి నుండి ఒకరినొకరు ఇష్టపడతారు. ప్రతి శుక్రవారం దూరదర్శినిలో వచ్చే చిత్రలహరిని చూడటానికి వెళ్లే క్రమంలో వీరి మధ్య ప్రేమ చిగురిస్తుంది. అయితే, ఊరిలో పలుకుబడి ఉన్న వ్యక్తి, వాణి అన్నయ్య అయిన పరశురామ్‌తో హరికి గొడవ జరగడంతో వీరి ప్రేమాయణం మలుపు తిరుగుతుంది. పేదవాడైన హరి, పెత్తందారీ కుటుంబానికి చెందిన వాణిని ఎలా దక్కించుకున్నాడు? వీరి ప్రేమ కథకు కుల సమీకరణాలు ఎలా అడ్డంకిగా మారాయి? అనేదే ఈ సినిమా ఇతివృత్తం. ంర్శకుడు కార్తికేయ 1990ల నాటి గ్రామీణ వాతావరణాన్ని, అప్పటి మనుషుల భావోద్వేగాలను అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించారు. ముఖ్యంగా 'దూరదర్శిని' అనేది కేవలం టైటిల్ మాత్రమే కాకుండా, కథలో ఒక కీలక పాత్రలా సాగుతుంది. ప్రథమార్ధంలో హీరో హీరోయిన్ల మధ్య సాగే సన్నివేశాలు నెమ్మదిగా సాగినప్పటికీ, పల్లెటూరి అందాలు, అల్లరి చిల్లర కామెడీ ప్రేక్షకులను అలరిస్తాయి. విరామ సమయానికి కథలో వేగం పుంజుకుంటుంది. ద్వితీయార్ధంలో కుల వివక్ష వల్ల కలిగే పరిణామాలు, భావోద్వేగపూరితమైన సన్నివేశాలు సినిమాను నిలబెట్టాయి. ÷-లకైమాక్స్‌లో వచ్చే ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది.నూతన నటీనటులైన సువీక్షిత్, గీతికలు తమ నటనతో ఆకట్టుకున్నారు. తొలి చిత్రమే అయినా ఎంతో పరిణతితో నటించి పాత్రలకు ప్రాణం పోశారు. ఇక హీరో స్నేహితులుగా నటించిన భద్ర, బలరామ్ గ్యాంగ్ పండించిన కామెడీ అక్కడక్కడా నవ్వులు పూయిస్తుంది. విలనిజం పండించిన పరశురాం తన గంభీరమైన నటనతో మెప్పించారు.

# పర్సంటేజీ విధానంపై కమిటీ

## 15 మందితో కమిటీ వేయాలని ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయం

## రెండు నెలల్లో సమస్య పరిష్కారమవుతుందన్న సి.కల్యాణ్



సింగిల్ స్క్రీన్ థియేటర్‌లలో పర్సంటేజీ విధానానికి సంబంధించిన అంశంపై తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కీలక నిర్ణయం తీసుకుంది. పర్సంటేజీ విధానాన్ని అమలు చేయాలని ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తుండగా, నిర్మాతలు అందుకు అంగీకరించడం లేదు. వివాదం ముదురుతుండటంతో వాణిజ్య మండలి అధ్యక్షుడు డి.సురేశ్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం థియేటర్ యాజమాన్యాలు, నిర్మాతలు సమావేశమయ్యారు.ఈ సమావేశంలో ఫిల్మ్ ఛాంబర్ కీలక నిర్ణయం తీసుకుంది. పర్సంటేజీ విధానంపై కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 15 మందితో కమిటీ వేయాలని నిర్ణయించిన ఫిల్మ్ ఛాంబర్, రెండు నెలల్లో నివేదికను సిద్ధం చేయాలని కమిటీకి సూచించనుంది. కమిటీలో ఐదుగురు నిర్మాతలు, ఐదుగురు ఎగ్జిబిటర్లు, ఐదుగురు డిస్ట్రిబ్యూటర్లు ఉంటారు.

ఈ అంశంపై నిర్మాత సి.కల్యాణ్ మాట్లాడుతూ, ఈ సమస్య రెండు నెలల్లో పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సినిమాల విడుదలకు మాత్రం ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని స్పష్టం చేశారు. కమిటీలో డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, నిర్మాతలు ఐదుగురు చొప్పున ఉంటారని వెల్లడించారు. ఈ సమావేశానికి అల్లు అరవింద్, మైత్రి రవి, సి.కల్యాణ్, దిల్ రాజు సహా 50 మంది నిర్మాతలు హాజరయ్యారు. ఎగ్జిబిటర్ల తరఫున విజయేందర్ రెడ్డి, శ్రీధర్ వచ్చారు.

# దర్శకుడిగా రామ్ పోతినేని..

## బర్త్ డే రోజున ఫ్యాన్స్‌కు అదిరిపోయే సర్‌ప్రైజ్!




టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు ఒక ఊహించని కానుక ఇచ్చారు. నటుడిగా తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఆయన, ఇప్పుడు దర్శకుడిగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తన 23వ చిత్రం తో మెగా ఫోన్ పట్టనున్నట్లు వెల్లడించడం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది.ఈ చిత్రాన్ని ఒక ఉత్కంఠభరితమైన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందించనున్నట్లు తెలుస్తోంది. ఇందులోని 'వీర' అనే పవర్ ఫుల్ పాత్రలో రామ్ కనిపించనున్నారు. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వోల్ఫ్' అనే ట్యాగ్‌లైన్‌తో విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్, సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఈ పోస్టర్‌ను బట్టి రామ్ ఒక ఇంటెన్స్ పాత్రతో రాబోతున్నారని అర్థమవుతోంది.ఈ సినిమా కోసం రామ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. తన కుటుంబానికి చెందిన 'స్రవంతి మూవీస్' బ్యానర్ ఉండగానే, ప్రత్యేకంగా 'రాపో సినిమాటిక్స్' పేరుతో కొత్త నిర్మాణ సంస్థను ప్రారంభించారు. ఈ బ్యానర్‌పై రామ్ సోదరుడు కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.దర్శకుడిగా తన తొలి అడుగుపై రామ్ స్పందిస్తూ.. "ఇన్నాళ్లు వాళ్ల కథల్లో నా ముఖం చూశారు.. ఈ కథలో నా గొంతు వింటారు" అంటూ సోషల్ మీడియాలో ఓ ఆసక్తికర పోస్ట్ చేశారు. భారీ అంచనాల మధ్య రూపొందనున్న ఈ చిత్రం 2026 డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# 'రాంబుజ్జి'కి హాయ్ చెప్పండి...

## 'పెద్ది' నుంచి మరో గ్లింప్స్ వీడియో రిలీజ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' నుంచి చిత్రబృందం కీలక అప్‌డేట్‌ను విడుదల చేసింది. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు సంబంధించి వచ్చిన ఈ కొత్త అప్‌డేట్ సోషల్ మీడియాలో అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.ఈ చిత్రంలో 'రాంబుజ్జి' అనే శక్తివంతమైన పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ నటిస్తుండడం తెలిసిందే. తాజాగా ఈ పాత్రకు సంబంధించి గ్లింప్స్ వీడియోను చిత్ర బృందం సోషల్ మీడియాలో పంచుకుంది. "రాంబుజ్జికి హాయ్ చెప్పండి" అంటూ క్యాప్షన్ కూడా పెట్టింది. 'మిర్జాపూర్' వెబ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన దివ్యేందు 'పెద్ది'లో తనదైన శైలిలో నటించినట్టు గ్లింప్స్ చెబుతోంది. "ఇక అసలు ఆట మొదలవ్వబోతోంది" అంటూ చిత్రబృందం పోస్ట్ చేయడంతో ప్రమోషన్స్‌లో వేగం పుంజుకుంది. సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న విడుదల చేయనున్నట్లు తెలిపారు.రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, బొమన్ ఇరానీ, జగపతి బాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తుండగా, రత్నవేలు సినిమాటోగ్రఫీ, జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, జియో స్టూడియోస్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. వేసవి కానుకగా జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలయ్యే ఈ సినిమా కోసం సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# గర్భవతిగా ఉన్నా? కఠినమైన షెడ్యూల్!



బాలీవుడ్ అగ్ర నటి దీపికా పదుకొనే వృత్తి పట్ల ఉన్న అంకితభావాన్ని మరోసారి నిరూపించుకున్నారు. ప్రస్తుతం గర్భవతిగా ఉన్నా దీపిక కెరీర్‌లోని ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను పూర్తి చేయడంలో ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. తాజాగా షారుఖ్ ఖాన్‌తో కలిసి నటిస్తోన్న -కింగ్- సినిమా షూటింగ్ నిమిత్తం దక్షిణాఫ్రికా వెళ్లిన దీపిక అక్కడ అత్యంత కఠినమైన షెడ్యూల్‌ను పూర్తి చేసుకుని విజయవంతంగా భారత్‌కు తిరిగి వచ్చారు. సాధారణంగా గర్భ ధారణ సమయంలో సుదూర ప్రయాణాలు చేయడం అదీ కఠినమైన షూటింగ్ షెడ్యూల్స్‌లో పాల్గొనడం శారీరకంగా ఎంతో శ్రమతో కూడుకున్న పని. కానీ దీపిక మాత్రం దక్షిణాఫ్రికాలోని క్లిష్టమైన వాతావరణ పరిస్థితుల్లో కూడా పాత్రకు పూర్తి న్యాయం చేశారు. -కింగ్- సినిమా షూటింగ్ షెడ్యూల్ ఎంతో టఫ్ అని తెలిసినా ఎక్కడా అసౌకర్యానికి లోనుకాకుండా సన్నివేశాలను పూర్తి చేయడం చిత్ర యూనిట్‌ను ఆశ్చర్యపరిచింది. దీపికలోని పట్టుదల నేటి తరం నటీమణులకు గొప్ప ఉదాహరణగా చెప్పొచ్చు. దీపిక ఇలా గర్భవతిగా ఉండి షూటింగ్‌లో పాల్గొనడం ఇది రెండవసారి కావడం విశేషం. తొలిసారి గర్భం దాల్చిన సమయంలో కూడా ఇదే తరహాలో దీపిక వృత్తిపరమైన బాధ్యతలను నిర్వర్తించారు. ఆనాటి అనుభవం ఇప్పుడామెకు ఎంతో తోడ్పడింది. గర్భధారణ సమయంలో శరీరంలో వచ్చే మార్పులను, అలసటను తట్టుకుంటూనే కెమెరా ముందుకు వచ్చి పర్ఫెక్ట్ షాట్స్ ఇవ్వడం ఆమెకు అలవాటుగా మారింది. అందుకే -కింగ్- కఠినమైన షెడ్యూల్‌ను కూడా ఎంతో ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోగలిగారు. ఈ ప్రయాణంలో దీపికాకు బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ నుండి అద్భుతమైన మద్దతు లభించింది. షూటింగ్ స్పాట్‌లో దీపికాకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా షారుఖ్ అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.గర్భవతికి అవసరమైన వైద్య సదుపాయాల నుండి ప్రత్యేక ఆహారం వరకు అన్ని సౌకర్యాలను సెట్స్‌లో అందుబాటులో ఉంచారు. నటుడిగానే కాకుండా మంచి మిత్రుడిగా షారుఖ్ అందించిన తోడ్పాటు వల్లే తాను ఈ టఫ్ షెడ్యూల్‌ను సునాయాసంగా పూర్తి చేయగలిగానని దీపికా సన్నిహిత వర్గాల సమాచారం. దక్షిణాఫ్రికా ముగిసినా? దీపికాకు విశ్రాంతి దొరికేలా లేదు. త్వరలోనే తదుపరి చిత్రం -రాకా-షూటింగ్‌లో కూడా జాయిన్ కావాల్సి ఉంది. గడువు సమీపిస్తున్నా ప్రాజెక్టులు ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో దీపిక నిరంతరం శ్రమిస్తున్నారు. -కింగ్-, -రాకా- వంటి భారీ చిత్రాల్లో దీపిక పోషిస్తున్న పాత్రలు ఆమె కెరీర్‌లో మైలురాళ్లుగా నిలుస్తాయని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వ్యక్తిగత జీవితంలో మధుర క్షణాలను ఆస్వాదిస్తూనే వృత్తిని దైవంగా భావించే అమ్మడి తీరు అందరినీ ఆకట్టుకుంటోంది. దీపిక మాతృత్వం - కెరీర్ మధ్య చక్కని సమతుల్యతను పాటిస్తున్నారు. ఓవైపు ఇంటి మహాలక్ష్మి రాక కోసం ఎదురుచూస్తూనే మరోవైపు వెండితెరపై తన ముద్రను పదిలం చేసుకుంటున్నారు.

# ఎట్టకేలకు థియేటర్లలోకి కురుప్ప

తమిళ స్టార్ హీరో సూర్య నటించిన భారీ చిత్రం 'కరుప్పు' విడుదలకు ఎట్టకేలకు అడ్డంకులు తొలగాయి. గత కొన్ని రోజులుగా ఈ సినిమా విడుదలపై నెలకొన్న అనిశ్చితి అభిమానులను, నిర్మాతలను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. అయితే అన్ని సమస్యలు సద్దుమణగడంతో సినిమా ప్రపంచవ్యాప్తంగా మే 15, శు క్రవారం థియేటర్లలో సందడి చేసింది. తెలుగులో ఈ సినిమా 'వీరభద్రుడు' పేరుతో విడుదల అవుతోంది. సినిమా విడుదల సందర్భంగా సూర్య అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డియర్ ఆల్.. మాతో ఉన్నందుకు ధన్యవాదాలు. ఈరోజు నుంచి 'కరుప్పు', 'వీరభద్రుడు' థియేటర్లలో విడుదల అవుతున్నాయి' అంటూ ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ సందేశం అభిమానుల్లో ఆనందాన్ని నింపుతోంది. మొదట ఈ చిత్రాన్ని మే 14న విడుదల చేయాలని భావించినప్పటికీ, చివరి నిమిషంలో కొన్ని కారణాలతో విడుదల వాయిదా పడింది. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ప్రేక్షకులకు క్షమాపణలు తెలిపింది. కొన్ని ప్రయాణాలు కాలాన్ని మాత్రమే కాదు.. మనసును కూడా పరీక్షిస్తాయి. సినిమా కోసం ఎదురుచూసిన ప్రతి ఒక్కరికీ మేము క్షమాపణలు చెబుతున్నాం. విడుదలలో జరిగిన ఆలస్యం మమ్మల్ని కూడా బాధించింది. అయినప్పటికీ మాపై మీరు చూపించిన నమ్మకం, ప్రేమ మాకు ఎంతో బలం ఇచ్చాయి అంటూ నిర్మాణ సంస్థ భావోద్వేగ ప్రకటన విడుదల చేసింది. అలాగే 'కరుప్పు' కేవలం తమ సినిమా మాత్రమే కాదని, ప్రేక్షకులందరి కథ అని పేర్కొంది. ఎన్నో కష్టాలు, నిద్రలేని రాత్రుల తర్వాత ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని తెలిపింది. తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లో విడుదల ఆగిపోయిన సమయంలో ముంబై, పుణెలోని కొన్ని థియేటర్లలో సినిమా ప్రదర్శన జరిగినట్లు సమాచారం రావడంతో నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సినిమా పైరసీకి గురయ్యే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. సూర్య సరసన త్రిష హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రానికి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించారు. సంగీతాన్ని సాయి అభ్యంకర్ అందించారు.




Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com